# మన మాస్టరు గారు

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

విశాఖపట్నం

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

ప్రథమ ముద్రణ : 2004 (గురుపూర్ణిమ)
ప్రతులు : 1,000

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **60-00**

ప్రాప్తిస్థానము :
**జగద్గురు మందిరము**
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
♒ ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జనించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకులకందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త :* డాక్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగు దారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **డాక్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించు వారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభా వంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితము లకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ప్రస్తావన

**మా**స్టర్ ఇ.కె. అనుయాయులకు వారు పరిపూర్ణమైన దైవస్వరూపులు. గురువే దైవము అను భావము భారతీయ సంప్రదాయము. మాస్టరుగారు తన అనుయాయులను, లోనుండి తీర్చిదిద్ది, కష్ట-నష్టములను తట్టుకొను శక్తిగా వారే అనుయాయుల యందు నిలబడి యున్నారు. వారి జీవితము వినూత్నము. పరిపూర్ణ సంప్రదాయ బద్ధమూ కాదు, అలాగని విప్లవాత్మకమూ కాదు. వారు సర్వ స్వతంత్రులు. వారి స్వతంత్రతయే వారియందు గల అమితమగు ఆకర్షణ! వారియందు అనుయాయులకు నచ్చునది కూడా అదియే. సులభము, సున్నితము అగు పద్ధతులలో ఆర్ష మార్గమును ఆధునిక జీవుల కందించిన ఋషి మాస్టర్ ఇ.కె. వారి జీవన విధానము, బోధనా విధానము, అనుయాయు లతో కలసి మెలసి జీవించిన తీరు అనుపమానము. ఏ సద్గురువు కూడా, వారు చూపిన చొరవ, యిచ్చిన చనువు అనుయాయులకు యిచ్చి యుండలేదని అనుటలో అతిశయోక్తి యిసుమంతయూ లేదు.

శ్రీ కంభంపాటి పార్వతీకుమార్‌గారు వారితో 14 సంవత్సరములు సన్నిహితముగ మెదలినటువంటివారు. శ్రీ కుమార్‌గారు సులభముగ లోతులను గుర్తించగల స్వభావము

గలవారు. వారి నుండి మాస్టరుగారి వజ్రోత్సవ జన్మదిన సందర్భముగా ఒక పుస్తకము మాస్టర్ ఇ.కె. గారి గురించి ఆంగ్లమున వెలువడినది. దానిని పఠించి, స్ఫూర్తి చెందిన అనుయాయులు ఆంధ్రానువాదము కోరిరి. అట్టి అనువాదమును సోదరులు శ్రీ డి. వెంకటేశ్వరరావు మరియు శ్రీ వి. చక్రపాణి రావుల ద్వారా నిర్వర్తింపబడినది. అనువాదము స్ఫూర్తివంతముగ చేయబడుటచే దాని ముద్రణాభారము వహించి, ఆంధ్రుల కందించుటకు ధనిష్ఠ ముందుకు వచ్చినది. ఆంగ్లభాషా పటుత్వ మున వచ్చిన మూలమునకు ఆంధ్రానువాదము చేయుట, అట్లే, ఆంధ్రవచనమున మూలమును ఆంగ్లములోనికి అనువాదము చేయుట కష్టతరము. అయిననూ, స్ఫూర్తితో దీనిని అనువదించిన సోదరులు మాస్టరుగారి అనుయాయులు. దీనిని సకాలములో ముద్రించి అందించిన ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్ సోదర బృందము మాస్టరుగారి ఆశీర్వచనము పరిపూర్ణముగ పొందుదురు గాక !

తేది 29-5-2004 - ధనిష్ఠ

విశాఖపట్నం

# విషయ సూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | జననం | ... | 9 |
| 2. | మాతృదేవోభవ | ... | 14 |
| 3. | మాస్టర్ సి.వి.వి. | ... | 19 |
| 4. | దివ్యగ్రంథ దర్శనము–విశ్వప్రణాళికావిష్కరణము | | 25 |
| 5. | మాస్టర్ సి.వి.వి యోగమార్గము | ... | 35 |
| 6. | సాధనక్రమము | ... | 38 |
| 7. | కార్యాచరణ | ... | 43 |
| 8. | విద్య – వైద్యము | ... | 50 |
| 9. | రచనా వ్యాసంగము | ... | 63 |
| 10. | బృందనిర్మాణము | ... | 69 |
| 11. | సమన్వయము | ... | 72 |
| 12. | మాస్టర్ ఇ.కె. వైశిష్ట్యము | ... | 78 |
| 13. | సాంఘిక విలువలు | ... | 80 |
| 14. | గాయత్రి – వేదాలు | ... | 92 |
| 15. | కొన్ని ఆధ్యాత్మిక కోణాలు | ... | 100 |
| 16. | జ్యోతిర్విద్య | ... | 115 |
| 17. | క్రతువిద్య | ... | 122 |
| 18. | జగద్గురుపీఠము | ... | 127 |
| 19. | ప్రాక్పశ్చిమములు | ... | 135 |
| 20. | మాస్టర్ ఇ.కె.గారి పడమటిదేశ యాత్ర | ... | 142 |
| 21. | మహాప్రస్థానము | ... | 154 |
| 22. | మాస్టరుగారి ప్రబోధాలు | ... | 160 |

# 1

## జననం

**1926**వ సంవత్సరం, ఆగష్టునెల 11వ తేదీ, బుధవారం సాయంత్రం గం. 5. 30 ని॥లకు బాపట్లలో మాస్టర్ ఇ.కె. గారు జన్మించారు. ఆగష్టునెలను సింహమాసంగా పరిగణిస్తాం. మాస్టర్ సి.వి.వి; మాస్టర్ ఎమ్.ఎన్; మాస్టర్ ఇ.కె. - ఈ ముగ్గురి జననమూ సింహమాసంలోనే సంభవించడం విశేషం. సింహరాశి ద్వారా భూమికి దిగివచ్చిన కుంభయుగ చైతన్యానికి అనుగుణం గానే వీరి అవతరణం కూడా సింహమాసమైన ఆగష్టునెలలో జరిగిందని మనం గ్రహించవలసి ఉంది.

మాస్టర్ ఇ.కె. గారి తండ్రి డాక్టర్ ఎక్కిరాల అనంతాచార్య. ఆయన వేదవిద్యలో గొప్పపండితులు. ఘనవైద్యునిగా కూడా ఆయన ప్రసిద్ధులు. ఆయుర్వేద విధానంద్వారా ఆయన కొన్ని వందలమందికి అద్భుత నివారణలు చేశారు. వేదసార మెరిగిన మహాపండితునిగా ఆయన ఎంతగానో గౌరవింపబడేవారు.

డాక్టర్ అనంతాచార్యులవారు శ్రీకృష్ణ చైతన్యస్ఫూర్తితో ఉన్నకాలంలో వారికి ప్రథమ సంతానంగా ఇ.కె.గారు అవత

రించారు. ఆ కారణంగా ఆయన తనబిడ్డకు కృష్ణమాచార్య అని నామకరణం చేశారు.

కృష్ణమాచార్యకు పదమూడు సంవత్సరాల ప్రాయంలో మాతృవియోగం కలిగింది. అయినప్పటికీ ఆమె దివ్యసాన్నిధ్యాన్ని, మార్గదర్శకత్వాన్ని చిన్ననాటినుండి ఆయన పొందుతూ ఉండేవారు.

మాస్టర్ ఇ.కె. గారికి ముగ్గురు సోదరులు. వారి తండ్రి ఆ పిల్లలను ఏనాడూ బడికి పంపలేదు. ఆధునిక పాఠశాలలు బోధించవలసిన పాఠ్యాంశాలను కాక ఎందుకూ పనికిరాని విషయాలను బోధిస్తున్నాయని ఆయన విశ్వాసం. ఆ పాఠశాలలు బాలురను యంత్రాలుగా మారుస్తున్నాయి. ఆలోచనాశక్తిని, సృజనాత్మకతను కోల్పోయి పిల్లలు గ్రుడ్డెద్దుల్లా సామాన్యమైన ఆలోచనాస్థాయికి పరిమితమైపోతున్నారు. మానవకోటిలో వారు అతి సామాన్య వ్యక్తులుగా మిగిలిపోతారు. శ్రీ అనంతాచార్యుల వారు తమబిడ్డలు పొట్టకూటికోసమో, ధనార్జనకోసమో, సుఖ సాధన కోసమో బ్రతికే సామాన్య మానవులవలె గాక విశిష్ట వ్యక్తులుగా సార్థక జీవితాలను గడపాలని అభిలషించారు. మామూలు చదువులవల్ల సమయం వృథాకావడం తప్ప అంతగా ప్రయోజనం ఉండదని ఆయన తెలుసుకున్నారు. అందువల్ల ఆయన తనబిడ్డలకు తామే గురువులై విద్యాభ్యాసాలు చేయించారు.

మాస్టర్ ఇ.కె.గారు తండ్రిగారి దగ్గర చిన్నప్పుడే ఎన్నో వేదవిద్యా రహస్యాలను, సంకేతాలను ఆకళించుకున్నారు. తక్కిన సోదరుల కంటే ప్రతిభావంతులుగా రాణిస్తూ ఆయన తన ఐదవ ఏటనుండి తనలోని అఖండమైన ప్రజ్ఞను ప్రదర్శిస్తూ ఉండేవారు.

డాక్టర్ అనంతాచార్యులవారు మహావిద్వాంసులు. నిరుక్తం, వ్యాకరణం, జ్యోతిషం, ఛందస్సు అనబడే వేదాంగాలు ఆయనకు కరతలామలకములు. వేదప్రతిపాదితాంశాలకు ఆయన చెప్పిన భాష్యం అపూర్వమూ, అత్యంత ప్రతిభావంతమూను. బ్రహ్మ సమాజ సభ్యులైన ఏకేశ్వరోపాసకులు, యోగులు, వేదపండితులు, తత్త్వవేత్తలు వారిని సందర్శించి సంభాషిస్తూ ఉండేవారు. ఆయన విజ్ఞాననిధి. ఎందరికో మార్గదర్శకులు. సమాజంలో తమవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూవుండికూడా ఆయన తన నలుగురు బిడ్డలను సాకడంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపేవారు. తల్లిలా వారిని లాలించి పాలిస్తూనే తండ్రిలా వారికి విద్యాబుద్ధులు నేర్పించేవారు.

మాస్టర్ ఇ.కె. ఐదేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు ఒకసారి కొందరు బ్రహ్మసమాజ సభ్యులు వారి తండ్రిగారిని సందర్శించ టానికి వారింటికి వచ్చారు. వచ్చినవారందరూ విగ్రహారాధనకు వ్యతిరేకులు. భగవంతునికి రూపము, గుణములు లేవని, సర్వాంతర్యామి అని వారు నమ్ముతారు. వారు అనంతాచార్యుల వారితో చాలాసేపు ఎన్నో విషయాలు చర్చించారు. నిరాకార,

నిర్గుణ పరబ్రహ్మను తప్ప సాకారదైవాన్ని అంగీకరించని వారి దృష్టిలో విగ్రహారాధన మనేది అధమస్థాయి సాధన. తనతో సంభాషణ పూర్తయ్యాక వచ్చినవారికి బాలుడైన కృష్ణమాచార్యను తోడుగా ఇచ్చి వారిని ఊరు చూసిరండని పంపారు అనంతాచార్య. ఆ బాలుడు వారిని ఊరంతా త్రిప్పి ప్రముఖమైన ఒక వైష్ణవ దేవాలయానికి తీసుకువచ్చాడు. "గుడిలోపలికి వెళ్ళి చూద్దాం, రండని" వారిని అడిగాడు. వారు వెంటనే "మేము గుళ్ళలోకి రాములే" అన్నారు.

"ఏం ఎందుకురారు?" అని ప్రశ్నించాడు ఆ బాలుడు.

ఆ నిర్గుణోపాసకులు ఎంతో గొప్పగా– "భగవంతుడు సర్వాంతర్యామి. ప్రత్యేకించి గుళ్ళోకి వెళ్ళి దర్శించుకోనవసరం లేదు" అన్నారు.

"అంతటా వ్యాపించి ఉండే భగవంతుడు గుళ్ళో మాత్రం ఉండడనా మీ అభ్యంతరం?" అన్నాడు ఆ చిచ్చరపిడుగు.

అంతటి మహాసాధకులూ అవాక్కైపోయారు. ఆ బాలుని కేసి చూస్తూండిపోయారు. ఇంటికి తిరిగివచ్చాక వారు అనంతా చార్యుల వారితో "మీవాడిలో ఏదో ఒక మహత్తరమైన వెలుగు ఉంది" అన్నారు. అనంతాచార్యులు నవ్వి ఊరుకున్నారు. అదీ ఐదేళ్ళప్రాయంలో ఇ.కె.గారి విశిష్టత !

తండ్రిగారి పర్యవేక్షణలో మాస్టర్ ఇ.కె. వేదవిజ్ఞానంలో నిష్ణాతులయ్యారు. ఆయన సహజకవి. అప్పట్లో విజయవాడలో విశ్వనాథ సత్యనారాయణగారని ఒక మహాకవి ఉండేవారు, ఆయన అనంతాచార్యులవారికి మంచి మిత్రులు. ఒకనాడు ఇ.కె.గారు కొన్ని పద్యాలు రాసి విశ్వనాథవారికి చూపించారు. *'ఋతుగానం'* అన్నపేరుతో ఉన్న ఆ కవితలో సంవత్సరంలోని ఋతువులన్నీ చక్కగా వర్ణింపబడ్డాయి. ఆ వర్ణనలు, కవితాధార విశ్వనాథవారిని ఎంతగానో అలరించాయి. భావ వ్యక్తీకరణలోని స్పష్టత, నిరాడంబరత ఆయనను ముగ్ధుని చేశాయి. ఆ కవిత్వం విని ఆయన అనంతాచార్యులవారితో ఇలా అన్నారు.

"మీ కృష్ణుడు కారణజన్ముడయ్యా! వానిలో దివ్యమైన వర్చస్సు ఉంది. అతని కృషి బహుముఖంగా సాగుతుంది. అతనంటే నాకెంతో ఇష్టం."

అనంతాచార్యులవారు అర్థవంతంగా నవ్వి ఊరుకున్నారు.

## 2

## మాతృదేవోభవ !

**తం**డ్రిగారి ద్వారా కృష్ణమాచార్యులవారికి చక్కని వేదవిజ్ఞానం అందినప్పటికీ, సంస్కారబలంవల్ల ఆయనకు జగన్మాత గాయత్రీ ఆరాధనమంటేనే మక్కువ ఎక్కువ. చిన్నతనంలోనే మాతృవియోగం సంభవించినప్పటికి వారికి నిద్రిస్తున్న సమయాల్లో ఒకవిధమైన మాతృసంరక్షణం అందుతూ ఉండేది. ఆవిధమైన అనుభూతివల్ల ఆయన మాతృశక్తికి దగ్గరయ్యారు.

వేదసారం తండ్రిగారివల్ల ఆయనకు అవగతమైంది. వేదవిభాగాలు, వాటిలోని సూక్ష్మమైన శాఖలు ఆయన అవగాహన చేసుకున్నారు. వేదాలలోని వెలుగే గాయత్రి. వేదాలకు తల్లి అనే అర్థంలో గాయత్రిని వేదమాత అంటారు. మాస్టర్ ఇ.కె. సహజావబోధనతో గాయత్రిని స్వీకరించారు. గాయత్రీ మహామంత్రమే ఆయనకు సర్వస్వం. గర్భాష్టకంనుండి ఆయన గాయత్రిని ఉపాసిస్తూ వచ్చారు. ఎనిమిదవ ఏట ఆయనకు జగన్మాత గాయత్రీదేవి ఒక సుందరమైన స్త్రీరూపంలో

దర్శనమిచ్చింది. ఆ దర్శనం ఆయనను ఎంతగానో ప్రభావితం చేసింది. ఆయన తన జీవితాన్ని ఆ జగన్మాతకు సమర్పణ చేసుకుని, జీవితాన్ని ఆ వెలుగులో నడిపించుకున్నారు. గాయత్రీమాతయే ఆయనకు ప్రమాణం. అవసరానికి ఆదుకునే స్నేహితునివలె, విపత్కాలంలో మార్గదర్శకునివలె, కష్టసమయాల్లో స్వాంతనపరిచే తల్లివలె, జ్ఞానజ్యోతిని వెలిగించే గురువువలె ఆయనకు ఆ తల్లి తోడునీడ అయింది.

విశ్వవిద్యాలయంలో చేరేనాటికి ఆయన గాయత్రీ ఉపాసన తీవ్రస్థాయికి చేరింది. అప్పట్లో యూనివర్శిటీలో తరగతులు సోమవారం నుండి శుక్రవారం వరకు వారానికి ఐదు రోజులు మాత్రమే జరిగేవి. ఇ.కె. గారు హాస్టల్‌లో ఉండి చదువుకునేవారు. శుక్రవారం సాయంత్రంనుండి ఆయన ఆచూకీ ఎవరికీ తెలిసేది కాదు. సోమవారం ఉదయానికి హాస్టల్‌గదిలో కనబడేవారు. శని, ఆదివారాలు ఎక్కడకు వెళ్ళేవారో, ఏమి చేసేవారో సహాధ్యాయులకు గాని, మిత్రులకుగాని తెలిసేదిగాదు. ఎవరికీ చెప్పకుండా ఆయన విశాఖ సాగరతీరంలోని శాంతి ఆశ్రమం చేరేవారు. అక్కడ ఒక రావిచెట్టుక్రింద ప్రశాంతంగా కూర్చుని గాయత్రీమంత్ర పునశ్చరణ చేసేవారు. శుక్రవారం సాయంత్రం నుండి సోమవారం ఉదయం వరకు అదే ధ్యానం. బాహ్య ప్రపంచంతో సంబంధం ఉండేది కాదు. మంచినీళ్ళే అప్పటి ఆయన ఆహారం. అప్పట్లో ఆయన

శిరస్సుపై ఒక కాంతివలయాన్ని దర్శించేవారు ఆయన మిత్రులు. సహజంగానే చక్కని రూపం, విశేషించి మంత్ర దీక్షవలన కలిగిన వర్చస్సు ఆయనకు చక్కని హుందాతనాన్ని, ఠీవిని కలిగించాయి. ఆయన ముఖంలో గాయత్రీ ధ్యానంవల్ల స్త్రీ సహజమైన సౌందర్యరేఖ ఒకటి గోచరించేది. అప్పటి ఆయన సుందరరూపం ఆడవారిని, మగవారిని కూడా సమ్మోహపరిచేది. ముఖ్యంగా ఆయన మందస్మితం చేశారంటే అవతలివారు మాయామోహితు లయ్యేవారు. ఆయన చిరునవ్వు ఎదుటివారిలోని ఆధ్యాత్మికతను మేల్కొలిపేది. ఆయన చూపులు వాడిగాను, కాంతివంతంగాను ఉండి ఎదుటివారిని చైతన్యవంతం చేసేవి. ఆయనకు ఆ ఉపాసన వల్ల అద్భుతమైన దివ్యదృష్టి కలిగింది. మరునాడు పరీక్షాకేంద్రంలో ఇవ్వబడే ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలన్నీ చాలా స్పష్టంగా ముందే కనబడేవి. మొదట్లో ఆవిధమైన దర్శనశక్తికి ఆయన అబ్బురపడినా, తరువాత అలాంటి అల్ప విషయాలకు ఆ వెలుగును వినియో గించుకోవటం తప్పని తొందర్లోనే గ్రహించి విరమించుకున్నారు. అలా దుర్వినియోగపరచుకుంటే ఆ దివ్యశక్తి తన పతనానికి కారణమవుతుందని ఆయన గ్రహించుకున్నారు. సరదాకోసం కొన్ని సందర్భాల్లో మాత్రం ఆయన తన దర్శన సామర్థ్యాన్ని ఒకటి రెండుసార్లు తన మిత్రులముందు ప్రదర్శించినా అంతటితో చాలించి అట్టి ప్రదర్శనలను కట్టిపెట్టారు. కుర్రవాడైనా అప్పటి ఆయన విజ్ఞతకు జోహార్లు !

ఆయన తన గాయత్రీధ్యానాన్ని మాత్రం మానలేదు. ఆ ధ్యానం ఆయనకు మాత్రమే ప్రత్యేకమైన ఒక విలక్షణమైన రీతిలో సాగింది. గాయత్రిపట్ల ఆయనకు గల అభిమానము అపారమైనది. ఆయనలో ఆ తల్లి దయవల్ల మాతృత్వపు లక్షణాలు పాదుకొన్నాయి. ప్రేమ, సేవాతత్పరత, సహనము, అవగాహన అనేవి ఆయనలో ఎంతగానో పెరిగాయి. ఆయన సన్నిధిలో జనం ఎంతగానో ఆనందం పొందేవారు.

ఎమ్.ఏ. తెలుగు పరీక్షలు దగ్గరపడ్డాయి. పరీక్షకు ఫీజు కట్టవలసివచ్చింది. తండ్రిగారు మనియార్డరు ద్వారా సొమ్ము పంపారు కానీ అది సకాలంలో ఆయనకు చేరలేదు. ఆయనేమో విశాఖపట్నంలో వుండి చదువుకుంటూ వుండేవారు. తండ్రి గారేమో మూడువందల కిలోమీటర్ల దూరంలో విజయవాడలో ఉండేవారు. సొమ్ము పంపినాగాని అది అందలేదు. ఫీజు కడితేగాని పరీక్షకు కూర్చోవడానికి వీలులేదు. అందువల్ల ఆయన చాలా బాధపడ్డారు. ఆయన తక్షణమే రావిచెట్టు నీడను చేరు కున్నారు. సమర్పణగా గాయత్రీమాతను ఆరాధించారు. “తల్లీ ! నేను పరీక్షకు హాజరు కాకుండా ఉండలేను. అలాగని సకాలంలో పరీక్ష ఫీజూ కట్టలేను. నీవుతప్ప నాకు మరోదిక్కు లేదు. నీవల్లనే నా సమస్య పరిష్కారమవ్వాలి” అని ప్రార్థించారు. మరొక్కసారి జగన్మాత సాక్షాత్కరించి ఆయనతో ఇలా చెప్పింది.

"నీ ఫీజు కట్టబడింది. ఎంతమాత్రం బాధపడకు. నీ హాల్‌టికెట్ నీకు వస్తుంది."

ఆ మాటలకు ఆయన ఆశ్చర్యపడి "ఫీజు కట్టారా? ఎవరు?" అని అడిగారు.

"చెల్లించబడిందిలే" అన్నది శ్రీమాత.

మరునాడు ఆయన యూనివర్శిటీ ఆఫీసుకు వెళ్ళి చూసుకుంటే తనపేరు ఫీజు కట్టినవారి జాబితాలో వుంది !

ఆ పరీక్షల్లో ఆయన ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అంతేకాదు, సర్వప్రథములుగా కూడా నిలిచారు. అంతటితో ఆయన కళాశాల విద్యాభ్యాసం ఒకదారికి వచ్చింది. ఆ తర్వాత కొద్దికాలంలోనే ఆయనకు గుంటూరులోని ఒక కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా ఉద్యోగం వచ్చింది. తండ్రిగారి ఆదేశానుసారం ఆయన శ్రీమతి అప్పమ్మగారిని తన ధర్మపత్నిగా స్వీకరించారు.

# 3

## మాస్టర్ సి.వి.వి.

**మా**స్టర్ ఇ.కె. గారు గుంటూరులో కాపురంపెట్టే సందర్భంగా పూజామందిరంలోకి ఒక గాయత్రీపటాన్ని కొనవలసి వచ్చింది. ఆ పటంతోనే ఇంట్లో పూజగది ఏర్పాటు చేసుకుని గాఢంగా ధ్యానం సాగించాలని ఆయన తలంపు. జీవికకు మంచి ఆధారమే దొరికింది కనుక తన సాధన కొనసాగించి గాయత్రీ మాత వెలుగును తనలో మరింతగా నింపుకోవాలని ఆయన సంకల్పించారు. అందువల్ల చక్కని గాయత్రీపటాన్ని కొనుక్కువచ్చి పూజగదిలో పెట్టుకుని ఆరాధించడం మొదలుపెట్టారు. ఉదయ సంధ్యలో గాయత్రిని ధ్యానించటం, ఒక గంటసేపు సద్గ్రంథపఠనం చేసి, భోజనాదికాలు ముగించుకుని కళాశాలకు వెళ్ళటం ఆయన దినచర్యగా మారింది. సాయంత్రం వేళల్లో కూడా కొంతసేపు గాయత్రీ ధ్యానమున్నూ, ఆ పిమ్మట మిత్రులతోను, పరిచయస్తుల తోను ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయటమూగా నడిచిపోయేవి.

ఆ విధంగా కొన్నాళ్ళు గడిచిపోయాయి. వెనుక రెండుసార్లు దర్శనమిచ్చిన గాయత్రీమాతను మళ్ళీ మరొక్కసారి సందర్శించ

గలిగితే బాగుండునని ఆయన ఎదురు చూడసాగారు. కానీ ఈసారి ఆయనకి ధ్యానంలో గాయత్రీరూపానికి బదులు మరొక ఆకారం దర్శనమివ్వటం మొదలయ్యింది. వీరాసనంలో ఒక ఆకారం ఒక్కొక్కరోజు కొంచెం కొంచెంగా క్రిందనుంచి పైకి కనిపించడం మొదలయ్యింది. ఆయనకి ఆ దృశ్యం ఎంతో ఆశ్చర్యమనిపించేది– 'నేనేమో గాయత్రీమాతను ధ్యానిస్తుంటే ఈయనెవరో ఇలా దర్శనమిస్తున్నారేమిటి!' మొదట్లో అది భ్రమేమో అనిపించినా ఆ రూపం ఎంతకీ వదిలేదికాదు. అనుదినం ఉదయము, సాయంత్రము గాయత్రిని ధ్యానించినప్పుడల్లా ఆ రూపం ఆనాటికానాడు మరింత వివరంగా మహాతేజస్సుతో దర్శన మివ్వసాగింది. వారం రోజులయ్యేసరికి పూర్తి ఆకారం దర్శన మిచ్చింది. ఇప్పుడు మనం చూసే మాస్టరు సి.వి.వి.గారి రంగుల చిత్రమే ఆయనకు దర్శనమిచ్చిన రూపం.

మాస్టర్ ఇ.కె. గారు ధ్యానం చేసింది జగన్మాతను. దర్శనం ఇచ్చింది మాస్టర్ సి.వి.వి. గారు! అప్పటికి ఆ రూపం ఎవరిదో ఇ.కె.గారికి తెలియదు. ఆయన గురించిగాని, కనీసం ఆయన నామాన్నిగాని అంతకు ముందెన్నడూ ఆయన విని ఉండలేదు. 'గాయత్రిని ధ్యానించడమేమిటి! ఈయన కనిపించడమేమిటి!' అని ఆయన ఆశ్చర్యపడేవారు. ఉదయంపూట ధ్యానం చేసినప్పు డల్లా అదే ఆకారం దర్శనమిచ్చి చిరునవ్వుతో ఇ.కె.గారిని

పలుకరించేది. ఆయన కొంత కలవరపడ్డారు. 'ఈ కనిపిస్తున్న మల్లవీరు డెవరు? నా గాయత్రీమాత ఏమైనట్లు?' అని ఆయన అనుకునేవారు.'ఈయన ఎవరై ఉంటారా!' అని గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తే 'బహుశా మా నాన్నగారికి పాతస్నేహితు లెవరో అయివుంటార్లే' అనిపించేదే తప్ప ఎంత ఆలోచించినా సమాధానం దొరికేదికాదు.

మాస్టర్ ఇ.కె.గారికి మంచివక్తగా పేరుండేది. ఆయన ఆశుప్రవక్త, సహజకవి, అధ్యాపకులూను. వివిధ వైజ్ఞానికాంశాలపై ప్రసంగించమని జనం ఆయనను ఆహ్వానిస్తూ ఉండేవారు. ఒక శుభోదయవేళ సమీప గ్రామ పాఠశాలనుండి ఆయనకు ఆహ్వానం వచ్చింది. ఆనాటి సాయంత్రం ఏడుగంటలకు తమ పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి ప్రసంగించవలసిందిగా ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్‌గారు మాస్టరుగారిని ఆహ్వానించారు. మాస్టరుగారు ఆ ప్రిన్స్‌పాల్‌గారితో కొంతసేపు గడపవచ్చుగదా అని ముందుగానే సాయంత్రం పావు తక్కువ ఐదు గంటలకల్లా ఆ గ్రామానికి చేరుకున్నారు. ఆ ప్రిన్స్‌పాల్‌గారు మాస్టరుగారిని తన యింటికి తోడ్కొనివెళ్ళి కాఫీ ఇచ్చి కబుర్లు చెబుతూ ఆరు గంటలవటానికి ఇంకా రెండు నిముషాలు ఉందనగా మాస్టరుగారితో ఇలా అన్నారు. "మీరు నన్ను క్షమిస్తే చిన్నపని ఉంది. పావుగంటలో ముగించుకుని వస్తాను." మాస్టరుగారు "దానికేమి, ఇంతకీ

ఏమిటాపని?" అని అడిగారు. "మరేంలేదు, ఆరు గంటలకు ప్రేయరు ఉంది" అన్నారు ప్రిన్స్‌పాల్‌గారు. "సరే కానివ్వండి" అన్నారు మాస్టరుగారు. ఆ ప్రిన్స్‌పాల్‌గారు అలా లోపలికి వెడుతుంటే మాస్టరుగారికి 'ప్రేయరుకైతే నన్నుకూడా పిలిచి ఉండవచ్చు గదా!' అని ఒక్కక్షణం అనిపించింది. అంతలోనే ఆ ప్రిన్స్‌పాల్‌గారు బయటకువచ్చి "మీకు అభ్యంతరం లేకపోతే మీరుకూడా ప్రేయరుకు రావచ్చు" అన్నారు. ఆవిధంగా వారిద్దరూ ప్రేయరు చేసుకునే గదిలోకి ప్రవేశించారు. అక్కడ ఎదురుగా తనకు ఉభయ సంధ్యల్లోను గాయత్రీధ్యానం చేసేటప్పుడు తన పూజామందిరంలో దర్శనమిచ్చే దివ్యరూపాన్ని చూసి మాస్టరుగారు ఒక్కక్షణం ఆశ్చర్యపోయారు, 'తనకు ధ్యానంలో దర్శనమిచ్చే వ్యక్తే ఇక్కడ ఈ పటంలో ఉన్నారే!' ఆ ప్రిన్స్‌పాల్‌గారు ప్రేయరు మొదలుపెట్టారు. ఇ.కె. గారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన ఆనందానికి అవధులు లేవు. 'తాను ఎవరి గురించి తెలుసు కోవాలనుకుంటున్నారో ఆ వ్యక్తి మళ్ళీ ఇక్కడ దర్శనమివ్వడ మేమిటి!' పావుగంటలో ప్రేయరు పూర్తయ్యింది. మాస్టరుగారు ఆ ప్రిన్స్‌పాల్‌గారిని ఇలా అడిగారు. "ఏవరండీ ఈ మాస్టరుగారు? ఈయన నన్ను చాలా కలవర పెడుతున్నారు. నేను గాయత్రీజపం మొదలుపెట్టినప్పుడల్లా రోజూ ఉదయం, సాయంత్రం ఈయనే కనబడుతున్నారు." ఆ మాటలకు ప్రిన్స్‌పాల్‌గారికి కూడా ఆశ్చర్యం

కలిగింది. ఆయనకి సి.వి.వి.గారి రూపం ఆ పటంద్వారానే తెలుసు. మరి ఈయనో ! ఆ రూపాన్ని వెలుగుగా రోజూ చూస్తున్నా నంటున్నాడు ! మాస్టరు సి.వి.వి గురించి ఇ.కె.గారికి ఆయన ఇలా వివరించారు. “ఈయన పేరు మాస్టరు సి.వి.వి. ఈయన కుంభకోణంలో ఉండేవారు. (కుంభకోణం అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఒక పుణ్యక్షేత్రం.) మాస్టరు సి.వి.వి.గారు ఒక మహాతేజం. ఒక నూతన యోగమార్గాన్ని లోకానికి అందజేసారు. ఆ యోగం 'తారక రాజయోగం'. 1910 నుండి 1922 వరకు గల పండ్రెండు సంవత్సరాల కాలంలో ఆయన ఎందరికో ఈ యోగదీక్ష నిచ్చారు. ఆయన మే నెల 1922లో దేహత్యాగం చేశారు.” అంటే మాస్టరు ఇ.కె.గారు జన్మించడానికి నాలుగు సంవత్సరాల ముందన్నమాట !

అప్పుడు మాస్టరుగారు ఇలా అడిగారు. “దయచేసి నాకోసం ఈయనగారి ఫొటో ఒకటి తెప్పించిపెట్టగలరా?”. ప్రిన్స్‌పాల్‌గారు సరేనని మద్రాసు నుండి మాస్టరు ఇ.కె.గారికి సి.వి.వి. గారి ఫొటో ఒకటి అందేలా చేశారు. ఆనాటినుంచి మాస్టరు ఇ.కె.గారు మాస్టరు సి.వి.వి.గారిని ధ్యానించడం మొదలుపెట్టారు.

ఈవిధంగా మాస్టరు ఇ.కె.గారు మాస్టరు సి.వి.వి. గారి గురించి బాహ్యప్రజ్ఞలో తెలుసుకున్నప్పటినుండి సి.వి.వి.గారు

ధ్యానంలో కనబడి సంభాషించడం మొదలయ్యింది. “ఒక మహత్తర కార్యసాధనకై నేను నిన్ను ఎంపిక చేసుకున్నాను. నీ‘లో’నుండి నిన్ను ఉద్బోధిస్తూ ఉంటాను. నేను చెప్పినట్లు చేస్తూ ఉండు. నిత్యమూ ధ్యానంలో నానుండి నీకు అందిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ ఉండు.” మాస్టరు ఇ.కె.గారు అందుకు అంగీకరించారు. మాస్టరుగారు మాస్టరు సి.వి.వి.గారి గురించి మరింతగా తెలుసుకోవాలనుకున్నారు. అందుకు సి.వి.వి.గారు ఇలా చెప్పారు. “నేను తెలియనిచ్చినంత నీవు తెలుసుకుంటావు. నేను నీకు ఎంతవరకు సమాచారమిస్తే అంతవరకే నువ్వు గ్రహించగలవు. ఎప్పటికప్పుడు నీకు కాలసింది నేను అందిస్తాను. నీకు ఇష్టమైతే నేను చెప్పినట్లు చెయ్యి. ఇందులో బలవంతమేమీ లేదు. నువ్వంటే నాకిష్టం, అందువల్ల నిన్ను నేను ఎంచుకున్నాను.”

# 4

## దివ్యగ్రంథ దర్శనము – విశ్వప్రణాళికావిష్కరణము

**మా**స్టర్ ఇ.కె. గారికి మాస్టర్ సి.వి.వి.గారి ఉద్బోధనము ఆరంభమైంది. మాస్టర్ సి.వి.వి.గారు దేహధారులై ఉండగానే వారికి దివ్యజ్ఞాన సమాజముతో సంబంధాలు ఉండేవి. వారి ప్రణాళికానుసారం గుంటూరులోని దివ్యజ్ఞాన సమాజంవారు మాస్టర్ ఇ.కె.గారిని మహాభారతంలోని పరమార్థాన్ని గురించి ప్రసంగించ వలసిందిగా ఆహ్వానించారు. ప్రసంగానంతరం ఇ.కె. గారు దివ్యజ్ఞాన సమాజంవారి గ్రంథాలయంలోకి వెళ్లారు. అక్కడ హెచ్.పి. బ్లావెట్స్కీ రచించిన 'సీక్రెట్ డాక్ట్రిన్' అనే గ్రంథంపై వారి దృష్టి పడింది. దానిని గురించిన వివరాలను ఆయన అక్కడివారిని అడిగారు. ఆ సమాజపు సభ్యులు ఇలా అన్నారు. "ఇది చదవటానికి సాధ్యం కాని పుస్తకాలలో ఒకటి. దీనిని మేము మిక్కిలి గౌరవంతో చూస్తాం తప్ప ఎన్నడూ తెరిచి చదివిన పాపాన పోలేదు". మరునాడు కూడా మాస్టరుగారిని మరో ప్రసంగం చేయమని సమాజంవారు కోరారు. ఆ తరువాత మహాభారతాన్ని గురించి ఆ సమాజంవారికి మాస్టరుగారు ఎన్నో తరగతులు నిర్వహించారు. రెండవనాడు మాస్టరుగారి ప్రసంగానికి ఆ దివ్య

జ్ఞాన సమాజపు అధ్యక్షులు కూడా హాజరయ్యారు. ఆయనకు అంతకు ముందురోజు మాస్టరుగారి ఉపన్యాసాన్ని విన్న సభ్యులు మహాభారతం గురించి చెబుతున్న ఈ వ్యక్తి సామాన్యుడు కాదనీ, ఆయనకు చాలా విషయాలు తెలిసినట్టుగా కనిపిస్తోందనీ చెప్పారు. అందుకని ఆయన స్వయంగా వచ్చారు. ప్రసంగానంతరం ఆయన తనని తాను మాస్టర్ ఇ.కె.గారికి పరిచయం చేసుకున్నారు– "నేను ఈ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షుణ్ణి. మిమ్మల్ని ఇక్కడ ఇలా కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది." అన్నారు. అప్పుడు మాస్టరుగారు "మీ బీరువాల్లో 'సీక్రెట్ డాక్ట్రిన్' అనే పేరుతో నేనొక పుస్తకాన్ని చూశాను. అదొకసారి నాకిప్పించగలరా?" అని అడిగారు.

"దానికేం భాగ్యం. తప్పక తీసుకోండి. నాతో సహా ఎవ్వరం ఆ పుస్తకాన్ని తాకలేదు. అందులో ఏముందో కూడా మాకు తెలియదు. అదొక మహత్తరమైన గ్రంథం అని మాత్రం మాకు తెలుసు. అంతే. మీరు దానిని చదవాలనుకుంటే తప్పక తీసుకు వెళ్ళండి" అన్నారు ఆ అధ్యక్షులవారు.

మాస్టర్ ఇ.కె.గారు ఆ పుస్తకాన్ని ఇంటికి తీసుకువచ్చారు. తక్షణమే దానిని చదవటం ప్రారంభించారు. ఆ గ్రంథంలో అనేక జ్ఞానమార్గాలకు సంబంధించిన క్రొత్త క్రొత్త పదాలు ఎన్నో వాడబడినాయి. అందువల్ల అది కొంచెం కష్టం అనిపించింది. అప్పటికి రాత్రి ఒంటిగంట అయింది. అయినప్పటికీ ఆయన

ఆ పుస్తకాన్ని విడిచిపెట్టలేదు. పుస్తకాన్ని అలా టేబుల్‌పైన ఉంచి ఒక కప్పు కాఫీ త్రాగివద్దామని వీధిచివరవున్న హోటలకు వెళ్ళారు. (ఆయనకు కాఫీ అంటే చాలా ఇష్టం. ఆ మాటకు వస్తే మాస్టర్ సి.వి.వి., మాస్టర్ ఎమ్.ఎన్., మాస్టర్ ఇ.కె. ముగ్గురికీ యోగము లోనే కాక ఈ విషయంలో కూడా పోలిక ఉంది. ఈ ముగ్గురూ ఎవరు ఎప్పుడు కాఫీ ఇచ్చినా వద్దనేవారు కాదు. కాఫీ అంటే వారికి అంత ఇష్టం.)

ఆ విధంగా అర్థరాత్రి ఒంటిగంటకి వీధి చివరన ఉన్న హోటలుకు చేరుకుని మాస్టరుగారు కాఫీ త్రాగి తిరిగి ఇంటికి బయలుదేరారు. అంతలోనే ఆకస్మికంగా ఒక వృద్ధుడు తారసపడి ఆంగ్లంలో ఇ.కె.గారిని ఇలా అడిగాడు. "నాకు ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఇప్పించగలరా?" ఆ సమావేశం హఠాత్పరి ణామం. ఇ.కె.గారు ఆ వ్యక్తిని పరికించి చూశారు- చాలా ముసలివాడు. సరైన దుస్తులు లేవు. చొక్కాజేబులో ఒక పెన్ను ఉంది. ఆ జేబునిండా సిరా మరకలున్నాయి. పొడవాటి నెరసిన జుట్టు, మాసిన గెడ్డం- ఇదీ ఆయన ఆకారం. ఆ వృద్ధుడు ఆంగ్లంలో మరోసారి అడిగాడు- "నాకు ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఇప్పించగలరా?" మాస్టరుగారు ఇలా అన్నారు. "తప్పకుండా, నాతో దయచేయండి." ఆ యిద్దరూ మరొక్కసారి ఆ హోటల్ చేరుకున్నారు. "తమరు ఏంతీసు

కుంటారు?” ఇ.కె.గారు ఆ వృద్ధుని అడిగారు. ‘చపాతీలు’ అని చెప్పారు. మాస్టరుగారు చపాతీలు తెప్పించారు. ఆ పెద్దాయన తినటం మొదలుపెట్టారు. మాస్టరుగారు మరింత శ్రద్ధగా ఆయనను పరికించి చూశారు. “చాలా వయస్సే ఉంటుంది ఆయనకు. మంచి ఆకలితో ఉన్నట్టున్నారు.” ఇ.కె.గారు ఇలా అనుకున్నారు. “పాపం ! ఈయన తిండి తిని ఎన్నాళ్ళయిందో గదా! ఇంత అర్థరాత్రివేళ ఈ మహానుభావుడికి తినడానికి ఇప్పించగలగటం ఎంతటి మహద్భాగ్యం. మరో విషయం కూడా ఆయనను అబ్బురపరి చింది. “చూడటానికి బిచ్చగానిలా కనిపించే ఈయన ఇంగ్లీషులో మాట్లాడుతున్నారే.” మాస్టరుగారి అలోచనలు ఇలా సాగుతుండగా ఆ వ్యక్తి చపాతీలు తినటంలో నిమగ్నమైపోయారు. అంతలోనే ఆ ముసలాయన మాస్టరుగారికేసి చూస్తూ హఠాత్తుగా “అయితే మీరు ‘సీక్రెట్ డాక్ట్రిన్’ చదువుతున్నారన్నమాట!” అని అడిగారు. మాస్టరుగారికి విద్యుద్ఘాతము తగిలినట్లయింది. ఈ ముసలాయనకు తాను ‘సీక్రెట్ డాక్ట్రిన్’ చదువుతున్నట్టు ఎలా తెలిసింది? ఆశ్చర్యంతో ఆయనకేసి చూశారు మాస్టరుగారు. ఆయన మళ్ళీ అడిగారు. “మీరు ‘సీక్రెట్ డాక్ట్రిన్’ చదవటానికి ప్రయత్నిస్తున్నారు కదూ!” ఆ మాటలతో మాస్టర్ ఇ.కె.గారికి ఆ వృద్ధునిపట్ల పరమ పూజ్యభావం కలిగింది. “అవునండీ” అన్నారు. అంతే. ఆ వృద్ధుడు

"నాకొక టీ తెప్పించండి" అనడంతో విషయం మారిపోయింది. ఆయన టీ త్రాగటం పూర్తయ్యాక ఇద్దరూ ఆ హోటల్‌నుంచి బయటకు వచ్చారు.

నడుచుకుంటూ ఇద్దరూ రోడ్డుమీదకు వచ్చాక ఆ వృద్ధుడు ఇ.కె.గారితో ఇలా అన్నారు. "సీక్రెట్ డాక్ట్రిన్ చదవటానికి ముందు భగవద్గీత చదవండి." ఇ.కె.గారు చిన్నప్పటినుండి భగవద్గీతను చదువుతూనే ఉన్నారు. గీతలోని ఏడువందల శ్లోకాలూ ఆయనకు నోటికి వచ్చు. అంతేకాక గీత గురించి ఎన్నో ఉపన్యాసాలు కూడా ఇచ్చివున్నారు. అందుకని ఆయనిలా బదులిచ్చారు. "నేను గీతను చదివాను. అందులో ఏడువందల శ్లోకాలూ నాకు నోటికి వచ్చు." ఆ ముసలాయన ఇలా అన్నారు. "సీక్రెట్ డాక్ట్రిన్ చదవటానికి ముందు భగవద్గీత చదవండి." ఆ మాటలు ఆదేశంలా ఉన్నాయి. ఇ.కె.గారు ఆశ్చర్యపడి ఇలా అనుకున్నారు. "నన్నిలా ఆదేశిస్తున్నారు. ఎవరీయన ? నేను సీక్రెట్ డాక్ట్రిన్ చదువుతున్నానని ఈయనకెలా తెలుసు ? భగవద్గీత చదవమని నాకు ఇంతగట్టిగా చెబుతున్నారేమిటి?"

ఇలా అనుకుంటూ వారిద్దరూ ముందుకు నడిచారు. "సరే ఆయన చెప్పినట్లే భగవద్గీత చదువుదాంలే" అనుకుని ఆ సంగతి ఆయనకు చెబుదామని ఇ.కె.గారు ప్రక్కకు తిరిగి చూశారు. ఆ వృద్ధుడు కనిపించలేదు. మాస్టరుగారికి ఇది

మరొక ఆశ్చర్యకరమైన విషయం. “ఎవరో ఒకాయన వచ్చారు. అడిగి చపాతీలు తిని, టీ త్రాగారు. భగవద్గీత చదవమని ఆదేశించారు. కనబడకుండా మాయమైపోయారు!” ఇ.కె.గారు భగవద్గీత చదవాలని నిశ్చయించుకున్నారు.

ఇ.కె.గారు భగవద్గీత చదవటానికి దీక్షగా కూర్చున్నారు. మరునాడు అర్ధరాత్రివరకు ఏ ఆటంకమూ లేకుండా ఆ అధ్యయనం కొనసాగింది. మాస్టరుగారి శ్రీమతి పుట్టినింటికి వెళ్ళారు. అందువల్ల ఆయన ఒంటరిగా ఉన్నారు. భగవద్గీతను అధ్యయనం చేస్తూంటే ఒక ప్రణాళిక– పరమగురువుల పరంపర, వారికి సంబంధించిన ఆంతర పరిపాలనకు సంబంధించిన దివ్య ప్రణాళిక, కలియుగానికి చెందిన శ్రీకృష్ణ భగవానుని ప్రణాళిక మహాద్భుతంగా దర్శనమిచ్చాయి. ఆయన పరవశించి పోయారు.

మళ్ళీ ఆ మరునాడు అర్థరాత్రివేళ వృద్ధుని కలుసుకోవచ్చు నేమో అనుకుంటూ ఇ.కె.గారు అదే హోటలుకు బయలుదేరారు. ఒక కప్పు కాఫీత్రాగి రోడ్డుమీద ఎదురుచూశారు. ఆ వృద్ధుని జాడ ఎక్కడా కనిపించలేదు. కొద్దిగా నిరాశపడి ఆయన ఇంటిముఖం పట్టారు. అంతలోనే హఠాత్తుగా మాస్టరుగారి కుడి భుజంమీద ఎవరిదో చల్లని చేయి! ‘ఎలావుంది భగవద్గీత’ అనే మాటలు వినిపించాయి. మాస్టరుగారు వెనక్కితిరిగి చూసి

ఆశ్చర్యపోయారు. రారనుకున్న వ్యక్తి ఎదురుగా కనిపించేసరికి ఆనందంతో పరవశించారు. పరమ పూజ్యభావంతో ఆ వృద్ధుని పాదాలకు నమస్కరించారు. "మీకు నా కృతజ్ఞతలు. భగవద్గీతలో ఇదివరకు నాకు తెలియని ఎన్నో విషయాలు ఇప్పుడు అర్థమవుతున్నాయి."

"భగవద్గీత సర్వసమగ్రం. అయితే మీకు కొంతభాగం మాత్రమే తెలిసిందన్నమాట" అన్నారా వృద్ధమూర్తి.

"చపాతీలు తీసుకుంటారా?" అడిగారు మాస్టరుగారు.

"మీకు మీరుగా నన్నేమీ అడుగకూడదు. నిన్న కూడా అడిగింది నేనా? మీరా? ఇంకెప్పుడూ ఇలా అడగకండి. నేను చెప్పేది వినండి, అంతే" (గట్టివాడేనే అనుకున్నారు). ఆ తరువాత ఆయన ఇలా అన్నారు. "ఇక ఇప్పుడు సీక్రెట్ డాక్ట్రిన్ చదవండి."

వారంరోజుల్లో మాస్టర్ ఇ.కె.గారు 'సీక్రెట్ డాక్ట్రిన్' గ్రంథాన్ని పూర్తిచేశారు. ఆ గ్రంథం చదువుతున్నప్పుడు ఏవేవో ఆకారాలు ఇంటిలోపలికి వస్తూపోతూ ఉండేవి. మాస్టరుగారు ఆశ్చర్యపోయి, 'నన్ను అడగకుండా నా ఇంట్లోకి వచ్చిపోతున్న వీళ్ళందరూ ఎవరు' అనుకున్నారు. 'సీక్రెట్ డాక్ట్రిన్' తాలూకు ప్రణాళిక అంతా మాస్టరుగారికి అవగతమయ్యింది.

మాస్టరుగారు ఆ గ్రంథాన్ని ముగించేసరికల్లా వెనుక దర్శన మిచ్చిన వృద్ధమూర్తి మరోసారి ఇంటి గోడలోనుండి

వస్తున్నట్టుగా దర్శనమిచ్చారు. ఈసారి ఆయన రూపం వెనుకటిలా అస్పష్టంగా లేదు. తేజోవంతంగాను, బహు సుందరంగాను ఉన్నారాయన. మాస్టర్ ఇ.కె.గారు అప్పుడు దర్శించిన తేజోవంతమైన ఆకారం మనం మాస్టర్ కె.హెచ్.గారి వంటి దివ్యమూర్తిని ఊహించుకుంటే, ఆ రూపానికంటే వేయిరెట్లు తేజోవంతంగా ఉంది. ఆ దివ్యమూర్తి గోడలద్వారా మాస్టరుగారి దగ్గరకు వచ్చి 'సీక్రెట్ డాక్ట్రిన్ ఎలా ఉంది?' అంటూ పలకరించారు. ఇ.కె.గారు భక్తితో చేతులు జోడించి 'నమస్కారం' అన్నారు. అంతే ! మరొక్క మాటలేదు. అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం !

కొద్దిసేపు అలా గడిచాక "ఒక ప్రశ్న అడగమంటారా?" అన్నారు మాస్టరుగారు. 'దానికేం, అడుగు' అన్నారాయన. "తమరు గోడలోంచి ఎలా నడచివచ్చారు?" అడిగారు మాస్టరు గారు. "దానికేముంది. మీరూ నడవవచ్చు" అన్నారాయన. 'నేను కూడానా!' అన్నారు ఇ.కె. "అవును. నా ఎదురుగా మీరాపని చేయగలరు" అన్నారాయన. అంతలోనే వారిద్దరిమధ్యా ఒక మంచాన్ని వేయించి "నావైపు చూస్తూ మంచంలోంచి వచ్చేయండి" అన్నారాయన. మాస్టర్ ఇ.కె.గారు ఆ దివ్యమూర్తి కళ్ళలోకి చూస్తూ మంచంగుండా నడిచి వెళ్ళిపోయారు ఆయన దగ్గరకు. ఇ.కె.గారికి ఆశ్చర్యం కలిగింది. మళ్ళీ కొంచెంసేపు నిశ్శబ్దం !

మాస్టరుగారే మరికొంచెంసేపటికి ఇలా అడిగారు. “తమరింతగా నాపట్ల దయతో అనుగ్రహిస్తున్నారు గదా! ఎందుకు?” ఆ పరమగురువు ఇలా చెప్పారు. “మీరు ఒక కార్యనిర్వహణకోసం ఎన్నుకోబడ్డారు. మీకుగల పవిత్రత, జగన్మాతపట్ల మీకుగల భక్తి ఉన్నత కక్ష్యలలోగల గురువుల అనుగ్రహానికి మిమ్మల్ని పాత్రులుగా చేశాయి. అన్నింటిని మించి బృహస్పతి(Jupiter) మీ ద్వారా పనిచేయుట మొదలయింది. కాబట్టి ఇకముందునుండి ఎప్పటికప్పుడు నా ద్వారా వ్యక్తమవుతూ ఉండే ప్రణాళికకు అనుకూలంగా పనిచేయడానికి మీరు మాతో సహకరించాలి. ఒక మూడు దశాబ్దాలపాటు నాతో కష్టపడవలసి ఉంటుంది. నాతో పనిచేయడమంటే ముళ్ళబాటమీద నడవటమే. అదేమంత సుఖకరమైన మార్గం కాదు. మీకు ఇష్టమయితే మాకు సహకరించండి. ఇందులో నిర్బంధమేమీ లేదు. మీ ఇష్టప్రకారమే చేయండి. కాకపోతే ఒక్కసారి ఒప్పుకున్నాక ఆ తరువాత వీలుపడదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మరొక్కసారి చెబుతున్నాను. మీరు ప్రయాణించ వలసింది ముళ్ళబాటలో. పనిచేయవలసింది దివ్యమైన ప్రణాళిక కోసం. అదంత తేలికైన పనిమాత్రం కాదు. కత్తిమీద సాము లాంటిది. ఎన్నో ప్రమాదాలను ఎదుర్కోవలసి ఉంటుంది. మీకు సమ్మతమైతే నేను మళ్ళీ వస్తాను”. మాస్టరు ఇ.కె.గారు “నేను సిద్ధమే”

అన్నారు. అప్పుడు ఆ పరమగురువు ఇలా చెప్పారు. "తొందర పడకండి. వారం దినములు సమయం తీసుకోండి. బాగా ఆలోచించుకోండి. మీకు సంసారం ఉంది. నిర్వహింపవలసిన వృత్తి ఉంది. చక్కగా స్థిరపడ్డారు. జగన్మాత అనుగ్రహం ఎలాగూ ఉంది. మీకు వచ్చిన లోటేమీ లేదు. మీ జీవితం సుఖంగా సాగిపోతోంది కనుక మీకిష్టమైతేనే ఈ మార్గంలో ప్రవేశించండి" అంటూ ఆ పరమగురువు అదృశ్యమయ్యారు. మరోవారం తరువాత మళ్ళీ ఆయన దర్శనమిచ్చి "ఏం, మీరు సిద్ధమేనా?" అని అడిగారు. మాస్టరు ఇ.కె.గారు "వారంక్రితం ఎలా సిద్ధమో ఇప్పుడూ అలానే సిద్ధంగా ఉన్నాను" అన్నారు.

ఆ విధంగా మాస్టరు ఇ.కె.గారికి దివ్యకార్య నిర్వహణ క్రమం 1953లో మొదలై 1983వ సంవత్సరం ముగిసేసరికి పూర్తయ్యింది. ఆ తరువాత ఆయన మరో మూడునెలలు జీవించి 1984 మార్చినెలలో దేహత్యాగం చేశారు. ఆ ముప్పది సంవత్స రాల కాలాన్ని ఆయన తనకివ్వబడిన ప్రణాళిక ననుసరించి బోధనతోనూ, స్వస్థపరచుటతోనూ, రచనలతోనూ, శిక్షణ ఇచ్చుట తోనూ సద్వినియోగ పరిచారు. ఆ విధంగా ఆయన కార్య కలాపాలు మొదలయ్యాయి. ఎప్పటికప్పుడు ఆ పరమగురువు ద్వారా ఆయనకు ఆదేశాలు అందేవి.

5

# మాస్టర్ సి.వి.వి యోగమార్గము

**మా**స్టర్ సి.వి.వి కుంభయుగ చైతన్యానికి చెందిన పరమగురువు. ఆయనను దివ్యజ్ఞాన సమాజంవారు "మాస్టర్ జూపిటర్" అని వ్యవహరిస్తారు. ఆయన నివాసము నీలగిరి పర్వతాలు. ఆయనను నీలగిరిపర్వత పరమగురువు అని కూడా అంటారు. నీలగిరి పర్వతశ్రేణులలో అగస్త్యమహాముని ఆశ్రమం ఉందనే విషయం భారతీయులందరికీ తెలుసు.

గ్రహచైతన్య పరిణామాన్ని, భూమిపై ఉండే జీవుల పరిణామాన్ని శీఘ్రతరం చేయడం అనే ప్రత్యేక ప్రణాళికకు సంబంధించినవారు మాస్టర్ సి.వి.వి. కుంభరాశికి అధిపతియైన వరుణ (Uranus) గ్రహానికి సంబంధించిన శక్తిని ఆయన ఊర్ధ్వ కక్ష్యల నుండి స్వీకరించారు. అలా స్వీకరించిన కుంభరాశి చైతన్యాన్ని ఆయన భూ గ్రహానికి, అందలి జీవులకు ప్రసారం చేశారు. 1910వ సంవత్సరం వరకు ఆధ్యాత్మికపరమైన యురేనియం లోహం యొక్క ఉపయోగాలను గురించి పరమ గురువులు ఉన్నత కక్ష్యలలోకి ఉద్బోధింపడిన తమ శిష్యులకు

కూడా వెల్లడించలేదు. మాస్టర్ సి.వి.వి.గారి ప్రణాళిక కుంభరాశి చిహ్నానికి చెందినది. అందువల్ల ఆయన హృదయపద్మంనుండి యురేనియం లోహపు జ్వలనము వెలువడేది. దానివల్ల తనలో కలిగిన చైతన్యాన్ని ఆయన భూమియొక్క అంతరిక్ష ప్రజ్ఞలోకి విడిచిపెట్టారు. తద్వారా తన శిష్యులలోని వ్యక్తిగత కుండలినీ శక్తిని ఉద్బోధించారు. దానిని సమాహారశక్తిగా రగుల్కొల్పి భూగ్రహం యొక్క కుండలినీశక్తితో అనుసంధానం చేశారు. అందువల్ల ఆయన రెండు ప్రయోజనాలు సాధించారు. ప్రకృతి నియమాలకు భంగం కలగకుండా వ్యక్తియొక్క ఆధ్యాత్మిక వికాసాన్ని త్వరపరచడానికి అవకాశాలు కలిగించడం ఒకటి. ప్రాణమయ కోశము, ఈథరిక్ శరీరముల యొక్క పనితీరును మెరుగు పరచడానికి అంతరిక్షములోని మహాప్రాణశక్తిని ఉద్బోధించడానికి వీలుగా ఒక ఆధ్యాత్మికమైన ప్రసారమార్గాన్ని ఏర్పాటు చేయడమనేది రెండవ ప్రయోజనం. సత్యాన్వేషకులను అమృతత్త్వ మార్గంలోనికి ఉద్బోధించి వారిలో దేహపరిణామానికి, ప్రజ్ఞావిష్కరణకు సంబంధించిన పురోగతి శీఘ్రతరం చేయటానికి మాస్టర్ సి.వి.వి. గారు ఒక నిర్దిష్టమైన ప్రణాళికను ఏర్పాటు చేశారు. ఆయన శిష్యులకు త్రిసూత్ర ప్రణాళిక నిచ్చారు: 1. ఉదయము, సాయంత్రము ప్రేయరు చేయటం; 2. జీవితాన్ని సేవకు అంకితం చేయటం; 3. స్వలాభాపేక్షతో ఏ పని చేయకుండటం.

వారు తమ అనుయాయులకు అమృతత్వాన్ని కలుగ జేస్తానని వాగ్దానం చేశారు. సాధకుడు తప్పనిసరిగా పైన ఇచ్చిన త్రిసూత్ర ప్రణాళికను పండ్రెండు సంవత్సరాల కాలం పాటు క్రమశిక్షణతో అనుసరించవలసి ఉంటుంది.

దృఢమైన దీక్ష, పట్టుదల గల మాస్టర్ ఇ.కె.గారు ఈ అనుశాసనాన్ని క్రమం తప్పకుండా పాటించారు. ఆయన మరణాన్ని, పునరుత్థానాన్ని అనుభూతిచెంది అమృతత్త్వస్థితిని చేరుకోగలిగారు. ఈ స్థితిని ఇప్పటి నూతన వర్గాలకు చెందిన విశ్వసేవకులు తరుచుగా తృతీయ ఉపదేశము (Third Initiation) అంటున్నారు.

సాధన దినములలో ఇ.కె.గారు ఉదయ సంధ్యలలో ప్రేయరు, అనుష్ఠానములను నిర్వహించుకుని క్రమం తప్పకుండా అధ్యాపకునిగా కాలేజీలో తమ విధులను తాము చక్కగా నిర్వహించేవారు. సాయం సంధ్యలలో రామాయణము, మహాభారతము, భగవద్గీత, సీక్రెట్ డాక్ట్రిన్ గ్రంథాలనుండి ప్రవచనాలను ఇచ్చేవారు. పండ్రెండేళ్ళ సాధనక్రమంలోని చివరిదశలో ఆయన చేసిన సాధన, బోధనల అద్భుత ఫలితాలను ఆయనను ఆశ్రయించినవారు గమనించ గలిగేవారు. లక్ష్మీ నారాయణ దీక్షలో ఉన్నప్పుడు వ్యాధిగ్రస్తులకు స్వస్థత కలిగిస్తూ ఉండేవారు. ఆపన్నులైన మిత్రులకు మార్గదర్శనం చేసేవారు.

# 6

## సాధనక్రమము

మాస్టర్ ఇ.కె.గారు తాను అనుసరింపదలుచుకున్న పరమగురువుల మార్గానికి సంబంధించిన నిర్దిష్ట ప్రణాళికను అనుసరించటానికి కావలసిన సంసిద్ధత అంతా ఒక పంద్రెండేళ్ళ కాలంలో అంటే 1953 నుండి 1965 వరకు సాగింది. ఆ కాలంలో రాత్రిసమయాల్లో తీవ్రమైన అంతర్గత శిక్షణ, పగటి వేళల్లో బాహ్యమైన శిక్షణ నడిచింది. పరమగురువులు ఆయనకు ఆధ్యాత్మికవిద్య (Occultism)లో పాఠాలు ప్రారంభించారు. ఆధ్యాత్మిక జ్యోతిష్యము, ఆధ్యాత్మిక మనస్తత్వ శాస్త్రములకు సంబంధించి సమగ్ర అవగాహన ఆయనకు కలిగేలా వారు లోతైన స్ఫూర్తి పాఠాలు ఇచ్చేవారు. శబ్దము, వర్ణము, సంఖ్య, సంకేతముల వివరణలు కూడా ఇచ్చేవారు. ఇ.కె.గారు ప్రతిభా వంతులు, శ్రద్ధాళువులు, ప్రపన్నులు కనుక ఆయా విషయాలన్నీ అనతి కాలంలోనే వారికి పట్టుబడ్డాయి.

ఇ.కె.గారికి గుప్తవిజ్ఞాన విభాగాల్లోకి కూడా ప్రవేశం లభించింది. ఆ పంద్రెండేళ్ళ కాలంలో ఆయన ఎన్నో అత్యున్నత మైన క్రతువులలో ప్రావీణ్యం సంపాదించారు.

పైథాగరస్ రచించిన ముప్పదిమూడు సంపుటాల్లోని విజ్ఞానమూ ఆయన సొంతమయ్యింది. మహాభారతం, భగవద్గీత లకు సంబంధించిన కీలకమైన పదునెనిమిది వ్యాసఘట్టాలకు పరిష్కారం లభించింది. రాత్రిసమయాల్లో ఆయనకు బోధన సాగేది. దీక్షతో అవగాహన చేసుకునేవారు. పగటి సమయాల్లో అంత దీక్షగానూ ఆయన పని కొనసాగేది.

మాస్టర్ సి.వి.వి గారి ఆదేశానుసారం అనుదినమూ ప్రేయరులు జరిగేవి. గాయత్రీమంత్ర ధ్యానం సాగేది. లక్ష్మీ నారాయణ పూజావిధి నిర్వహింపబడేది. రాత్రులందుసాగే గుప్తవిద్యా బోధన తీవ్రంగా ఉన్నప్పటికీ ఇ.కె.గారు ఉదయకాలపు ప్రేయరుగాని, సాయంత్రపు ప్రేయరుగాని మానేవారు కారు.

ఈ కాలంలోనే మాస్టర్ సి.వి.వి.గారి అమృతత్త్వపు మార్గానికి చెందిన ధృవతారవంటి మాస్టర్ ఎమ్.ఎన్. గారు ఇ.కె.గారికి పరిచయమయ్యారు. ఈ కారణంగా మాస్టర్ ఎమ్.ఎన్. గారు నివసించి ప్రేయర్లు, కోర్సులు నిర్వహించిన ఒంగోలు పట్టణానికి ఇ.కె.గారు తరచుగా వెళ్ళేవారు. దివ్యజ్ఞానానికి చెందిన అన్నికోణాల్లోనూ సూక్ష్మతరంగా మాస్టర్ ఎమ్.ఎన్.గారు ఇ.కె.గారికి మార్గదర్శనం చేశారు.

ఈ సాధనక్రమమంతా నిశ్శబ్దంగానూ, ఎవరికీ తెలియ కుండానూ జరిగిపోయింది. కాలేజీలో మాస్టర్ ఇ.కె.గారి

సహాధ్యాయులకుగాని, ఇతర మిత్రులకుగాని ఎవ్వరికీ ఆయనలో ఏం జరుగుతోందో రవ్వంత కూడా తెలియదు. అదంతా అత్యంత గుప్తమైన శిక్షణాక్రమం. ఆఖరికి ఆయన కుటుంబ సభ్యులకు కూడా ఆయనలో క్రమవికాసం చెందుతున్న ఆధ్యాత్మిక కోణాలు తెలియవు. ఈ కాలంలోనే సామాన్య సంసారిలా ఆయన నలుగురు కుమారులకు, ఒక కుమార్తెకు జన్మనివ్వటం విశేషం. (ఆ తర్వాత ఆయన 46 సంవత్సరాల వయస్సులో ఉండగా ఆరవ సంతానం రెండవ కుమార్తె జన్మించింది.)

ఆంతరమగ్నతకు, బాహ్యాచతురతకు, దృఢచిత్తతకు, గంభీర నిశ్శబ్దానికి, ఆధ్యాత్మిక శిక్షణపట్ల పూర్ణవిధేయతకు మాస్టర్ ఇ.కె.గారు ఆదర్శప్రాయులు.

## కష్టపరంపర :

మాస్టర్ ఇ.కె.గారి జీవితంలో ఈ సాధన కాలమంతా మరోవిధంగా కష్టకాలమనే చెప్పాలి. ఆయనను మిక్కిలిగా బాధించిన సమస్యలలో ప్రధానమైనది ఆయన రెండవ కుమారుని అనారోగ్యం. ఇంగ్లీషు వైద్యంవల్లగాని, ఆయుర్వేదం వల్లగాని ఎంతగా ప్రయత్నించినా ఆ వ్యాధి లొంగుబాటు కాలేదు. దానితో ఇంక ఆయనకు హోమియోపతియే శరణ్యం అయింది. హోమియో వైద్యులుకూడా అయిన ఒకానొక మిత్రుని సహకారంతో ఇ.కె.గారు తన కుమారునికి గల మూర్ఛ రోగానికి

హోమియో వైద్యంద్వారా చికిత్స ప్రారంభించారు. సింహరాశికి చెందిన వారవటంవల్ల వారిలో మాతృత్వపు లక్షణాలు పుష్కలంగా ఉండేవి. మరోప్రక్క ఆయన విశ్వమాత ఆరాధకులవటంవల్ల ఆ అనుగ్రహం కూడా ఎంతగానో ఉండేది. అందువల్ల ఆయన ఎవరయినా బాధపడుతుంటే చూసి గిలగిల లాడిపోయేవారు. ఆ విధంగా ఆయన హోమియో విధానంద్వారా తన కుమారుని వ్యాధిని నివారణ చేయాలనే నిశ్చయానికి వచ్చారు. దానితో ఆయన హోమియో తత్త్వాన్ని లోతులకుపోయి దర్శింప గలిగేందుకు వీలుగా సొంతంగా ఆ శాస్త్రాన్నంతటిని క్రొత్తగా నేర్చుకోవలసి వచ్చింది. ఆ విధానంలో అంతకుముందు గమనింపబడని క్రొత్త విషయాలు ఎన్నో ఆయనకు తెలిశాయి. అందువల్ల ఆయన తన కుమారుని వ్యాధికి చక్కగా చికిత్సచేసి నివారణ చేయగలిగారు. దానితో హోమియోవిధానం ఆయనకు తక్కిన జీవితకాలమంతా చక్కని స్వస్థతా సాధనమయింది. ఈ విధంగా ఆర్తినుండి ఆర్తులను ఆదుకోగలిగే స్థితికి (ఆర్తిహరణం) ఆయన చేరుకున్నారు.

ఈ పంద్రెండేళ్ళ సాధనాకాలంలోనే ఇలాంటివే మరెన్నో చేదు అనుభవాలు- నమ్మకద్రోహం, కృతఘ్నత, వ్యంగ్య విమర్శల వంటివి- ఎన్నింటినో ఎదుర్కోవలసి వచ్చింది. అన్నింటినీ మౌనంగా భరిస్తూ, విఘ్నాలను తట్టుకుంటూ,

నిరాశకులోను కాకుండా, విమర్శలను లక్ష్యపెట్టకుండా ఆత్మ విశ్వాసంతో అంతర్వికాసం దిశగా ఆయన ప్రయాణం సాగి పోయింది. అగ్నిపరీక్షవంటి ఆ విషమ పరిస్థితులనుండి ఆయన విజయంతో బయటపడ గలిగారు. పుటంపెట్టిన బంగారంలా ఆయన తన వ్యక్తిత్వాన్ని వదిలించుకుని ఆత్మోన్నత్యంతో నిలబడగలిగారు. మానవాళిని సేవించటానికి ఒక చక్కని సాధనంగా ఆయన తీర్చిదిద్దబడ్డారు. ఈ పంద్రెండేళ్ళకాలమూ ఆయన జీవితంలో మామూలు స్థితినుండి ఆలోచిస్తే అతిదుర్భర మైన కష్టకాలమనే చెప్పాలి. అంటే తనకు తానుగా శిలువను భుజాల పైకెత్తుకుని వ్యక్తిత్వానికి శిలువ వేసుకునే దిశగా సాగిపోవడమే. ఆంతరమైన జ్యోతిర్మందిరంలోకి వాస్తవమైన ప్రచోదనము (Initiation) పొందగోరిన సత్యాన్వేషి ఈ విధమైన పరీక్షలను ఎదుర్కొనేది ఇలాంటి సందర్భాల్లోనే.

# 7

## కార్యాచరణ

**మా**స్టర్ ఇ.కె.గారు గుప్తజ్ఞానానికి సంబంధించిన తీవ్రమైన శిక్షణ పొందిన అనంతరం గుంటూరునుండి విశాఖ పట్టణానికి మారవలసి వచ్చింది. తనకివ్వబడిన ప్రణాళికను ఆచరణలో పెట్టడానికి ఆ విధమైన మార్పు అవసరమని ఆయనను నడిపిస్తున్న పరమగురువులు ఆదేశించారు. ఎందరో సహచరులు, అనుచరులతో కలిసి పనిచేయటానికి వీలుగా ఆయన తన స్వస్థలంనుండి విశాఖకు తరలివచ్చారు. పరమ గురువు సనత్కుమారునకు నామాంతరమైన విశాఖుని దివ్యశక్తితో ప్రభావితమైనది విశాఖపట్టణం. విశాఖ సముద్రతీరజలాల్లో వైశాఖేశ్వరుని దేవాలయం దాగివుంది. హిమాలయాల్లోని పరమ గురువుల సమావేశస్థలమైన విశాఖలోయకు ఈ ఆలయంతో సంబంధం ఉన్నట్లుగా చెప్పబడుతోంది. శంబళకు సంబంధించిన పరమగురు పరంపర యొక్క దివ్యశక్తితో అనుసంధానంచెంది పనిచేయటానికి వీలుగా మాస్టర్ ఇ.కె.గారికి విశాఖపట్టణం కార్యరంగంగా నిర్దేశింపబడిందనేది అంతర్గత కారణం.

## పరమగురు పరంపర (The Hierarchy) :

మైత్రేయ మహర్షి నాయకత్వంలోను, మరిద్దరు పరమ గురువుల సమర్థవంతమైన నిర్దేశకత్వంలోను లోకశ్రేయస్సుకోసం పనిచేసే పరమపురుషుల బృందాన్ని పరమగురు పరంపర అంటారు. మైత్రేయులవారికి సహకరించే ఇద్దరు పరమగురువులలో ఒకరు మరువు మహర్షి. ఆయన సూర్యవంశానికి చెందిన వారు. ఆయననే మనం ప్రస్తుతకాలంలో 'మాస్టర్ మోర్య' అంటున్నాం. మరొక పరమగురువు ప్రాచ్యగ్రంథాలలో పేర్కొనబడిన దేవాపి మహర్షి. ఆయన చంద్రవంశానికి చెందినవారు. ఆయనను దివ్యజ్ఞాన వాఙ్మయం 'మాస్టర్ కుత్‌హూమి'గా పేర్కొంటోంది. ఈ ముగ్గురు మహర్షులు దివ్యజ్ఞానులకు భూమిక వంటి త్రికోణంగా రూపొంది ఈ గ్రహానికి సంబంధించిన గురు పరంపరకు కూడా మార్గనిర్దేశం చేస్తున్నారు. వారికి మహాజ్ఞానులైన శిష్యబృందం ఒకటి ఉంది. ఆ శిష్యబృందం ఐదువేల సంవత్సరాలక్రితం సిద్ధినిపొంది ఈ గ్రహ వికాసానికి, ఈ గ్రహవాసుల వికాసానికి దోహదం చేస్తున్నారు. ఈ పరమగురువులు ముగ్గురు, వారి అనుయాయులు, శిష్యులు తరతరాలుగా మానవాళిని జ్ఞానపథంవైపు నడిపిస్తున్నారు. వారి మార్గదర్శకత్వంలో ఈ గ్రహంమీద వివిధప్రాంతాల్లో సనాతనధర్మం రూపుకట్టుకుంటూ ఉంది. కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి సత్యం

ఆవిష్కరింపబడేటట్లు చేస్తుంటుంది. ఆయా ప్రాంతాలవారి అవగాహనకు తగినట్లుగా వారివారి బోధనాభాష మారుతూ ఉంటుంది.

భాగవతంలోని మూడు, తొమ్మిది, పంద్రెండు స్కంధాలలో ఈ గురు పరంపరకు సంబంధించిన ప్రస్తావన సూచనప్రాయంగా ఉంది. ద్వాపరం అంతమై కలియుగం ప్రారంభమయ్యే సంధి కాలంలో శ్రీకృష్ణ పరమాత్మ అవతారం చాలిస్తూ కలియుగానికి సంబంధించిన దివ్యప్రణాళికను నిర్వహించడానికి మైత్రేయుల వారిని ప్రచోదనం చేసి, జగద్గురువుగా నియమించారు. మరువు, దేవాపి మహర్షుల వంటి వారితో కూడిన ఋషిగణం తనకు సహాయ పడుతుంటుం దని శ్రీకృష్ణులవారు సూచించి ఉన్నారు. ఆనాటినుండి ఈ భూమికి సంబంధించిన దివ్యప్రణాళిక అంతా మైత్రేయులవారి నిర్దేశకత్వంలో బోధన, వైద్యము అనే కార్యక్రమాల రూపంలో సాగిపోతోంది. ఈ ప్రణాళికను నిర్వహించే దివ్యజ్ఞాన బృందాన్నే మనం పరమగురు పరంపరగా పేర్కొంటున్నాం.

సూక్ష్మకక్ష్యకు చెందిన పరమగురువుల నివాసం హిమా లయాంతర్గత గుహలలో ఉంది. ఆ నివాసాలను కలాప, శ్రావస్తి గుహలని అంటారు. భూమండలానికి అధిపతియైన సనత్కు మారుల వారు సూక్ష్మప్రజ్ఞతో గోబి ఎడారి ప్రాంతంలో ఉన్నారని

చెప్పబడుతోంది. ఆయన నివాసాన్ని శంబళ అంటారు. ప్రతి సంవత్సరం మీన-మేష మాసాల్లో సంవత్సరాని కంతటికీ సంబంధించిన దివ్యప్రణాళిక ఉన్నత కక్ష్యలలోని వారిచే నిర్దేశింపబడి శంబళ ద్వారా పరమగురు పరంపరకు, వారి శిష్య బృందాలకు వృషభమాస మందలి పూర్ణిమా పర్వదినంనాడు ప్రసారం చేయబడుతుంది. ఆ పవిత్రకాలాన్ని మనమిప్పుడు వైశాఖోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆ ప్రణాళిక పరమగురు పరంపరలోని భౌతిక కక్ష్యలలోని శిష్యబృందాలకు మిథున మాసపు పూర్ణిమా సమయాన అందించబడుతోంది. మానవాళిని పరమగురు పరంపరతో అనుసంధానించే ఈ బృందాలే తక్కిన తొమ్మిది నెలల్లోనూ ఆ ప్రణాళికను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తాయి.

మాస్టర్ ఇ.కె.గారు ఆ ప్రణాళికానుసారంగా పనిచేయ డానికి ఎన్నుకోబడ్డారు. తదనుసారం వారికి వైశాఖోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం కలిగింది. తద్వారా ఆయన పరమ గురువుల ప్రణాళికను తెలుసుకొని దాని ప్రకారం పనిచేయ గలిగారు. ఎప్పటికప్పుడు ఆయనను గ్రాండ్ మాస్టర్, మాస్టర్ సి.వి.వి; మాస్టర్ ఎమ్.ఎన్. గారలు నడిపిస్తూ ఉండేవారు. వారి కార్యక్రమంలో ముందుకు సాగినకొద్దీ ఇ.కె.గారికి తొమ్మిదిమంది పరమగురువులతోను పరిచయం కలిగింది.

అత్యంత ఉత్సాహంతోను, చైతన్యంతోను ఆయన ఆ కార్య క్రమాన్ని నిర్వహించారు. స్వీయానుభవాలను ఆయన ఎంతో గుంభనగాను, గోప్యంగాను ఉంచారు. తాను ఫలానా అనిగాని, తనకు పరమగురువులతో సంబంధం ఉన్నట్లుగాని ఆయన ఏనాడూ ఎవరికీ తెలియనీయ లేదు. నిరాడంబరంగా ఉంటూ, నిరాడంబరతనే ప్రచారం చేశారు. అతిచిన్న సామాన్యపు పనుల ద్వారా ఎంతో సాదాసీదాగా ఆయన తన సాటివారిని ప్రబోధించే వారు. ఆయన ఏనాడూ దేనికీ అంటుకోలేదు. ఎప్పుడూ ఆవేశకావేశాలకు లోనుకాలేదు. ఆయన ప్రధాన ధ్యేయం ఒక్కటే- కుంభరాశి చైతన్య బీజాలను వెదజల్లడం. ఆ కుంభరాశి చైతన్యం మాస్టర్ సి.వి.వి.గారిచే స్వీకరింపబడి భూమియొక్క సూక్ష్మ కక్ష్యలలోనికి ప్రసారం చేయబడింది. ఇ.కె.గారి ఈ కృషివల్ల వ్యక్తుల పరిణామక్రమం త్వరితమై వారిలో తొందరగా పరిణతి వస్తుంది. ఆ విధంగా మాస్టర్ ఇ.కె.గారు కుంభచైతన్య ప్రసారానికి చక్కని వాహికగా పనిచేశారు. సింహరాశిలో సూర్యుడు, కుంభంలో లగ్నం, వృశ్చికంలో శని, వృషభంలో కుజుడు ఉండటంవల్ల ఆయన కుంభచైతన్యాన్ని ప్రసారం చేయటానికి చక్కగా సరిపోయారు. సమర్థవంతమైన శిక్షణ కూడా దానికి తోడైంది. ఇక్కడ మనం మరొక విషయం కూడా ప్రస్తావించు కోవటం సముచితంగా ఉంటుంది. కుంభ రాశికి ఎదురుగా

వుండే స్త్రీతత్త్వపు సింహరాశిలోని సారమేయ మండలంలోని (Regulus) ప్రధాన సూర్యుని ద్వారా కుంభ చైతన్యం భూగ్రహానికి అందింది. వరుణగ్రహ చైతన్యానికి అధిపతి కుంభరాశి. ఆ చైతన్యం వృశ్చికరాశినుండి వ్యక్తమవుతూ ఉన్నది. కాబట్టి సింహరాశి ఆ చైతన్యాన్ని గ్రహించటానికి, కుంభం దానిని ఈథరిక్ కక్ష్యలో ప్రసారం చేయటానికి, వృశ్చికం దానిని భౌతికంగా వ్యక్తంచేయటానికి సహకరిస్తాయి. వృశ్చికానికి, శనికి చొచ్చుకునిపోవటం అనే ఒక ప్రత్యేక లక్షణం ఉంది. ఒక ఆసక్తికరమైన ప్రత్యేక అంశం ఏమిటంటే, మాస్టర్ ఇ.కె. గారికి స్థిరచతుర్భుజ రాశులైన వృషభ, వృశ్చిక, సింహ, కుంభా లన్నింటిలోను ఉపదేశానికి సంబంధించిన గ్రహాలు– కుజ, శని, సూర్య, గురు గ్రహాలు– ఉన్నాయి. ఆయన జాతకంలోని నాలుగు ప్రధాన కేంద్రదృష్టులు కుంభ చతుర్భుజం (Aquarian Cross) గురించి, తత్సంబంధమైన ప్రణాళికా నిబద్ధతను గురించి తెలియజేస్తాయి. ఆంతర జ్యోతిష్యాన్ని అధ్యయనం చేసినవారికి మాత్రమే మాస్టర్ ఇ.కె.గారి జాతక చక్రంలోని ఈ విశేషాలు బోధపడతాయి.

మాస్టర్ ఇ.కె.గారికి కుంభ చైతన్యాన్ని అందుకోవటమే కాక, పరమగురు పరంపర కార్యక్రమంలోని ప్రధానాంశాలైన ప్రాచీన సంప్రదాయానికి చెందిన బోధన, స్వస్థతలు కూడా

అప్పగించబడ్డాయి. ఆ విధంగా మాస్టర్ ఇ.కె.గారి కార్యరంగం మాస్టర్ సి.వి.వి.గారి అమృతయోగాన్ని ప్రసారం చేయటం, సనాతన విజ్ఞానంలోని లోతుపాతులను బోధపరచటం, ఆర్తులకు స్వస్థత కలిగించటం అనే మూడు రంగాలకు విస్తరించింది. ఈ ప్రయోజనాన్ని ఉద్దేశించే విశాఖపట్టణానికి మారవలసిందిగా సూచనలు వచ్చాయి. తెలుగు సాహిత్యంలో పరిశోధన అనే మిషతో విశాఖపట్టణానికి తరలివచ్చారు. రెండు సంవత్సరాల అతితక్కువ కాలంలో ఆయన పరిశోధన పూర్తిచేసి, డాక్టరేట్ పట్టా పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆయనను అధ్యాపకునిగా తీసుకుంది. ఆ ప్రకారంగా ఆయన నివాసపు మార్పు ఎంతో ప్రశాంతంగా జరిగింది. అందువల్ల ఆయన కార్యక్రమాలు చక్కగా సాగిపోయాయి.

# 8

# విద్య - వైద్యము

## స్వస్థత :

మాస్టర్ ఇ.కె.గారికి గుంటూరులో ఉన్నప్పటినుండి శబ్దము, స్పర్శ, చూపుల ద్వారా ఎదుటివారిని స్వస్థపరిచే సామర్థ్యం ఉండేది. ఆ తరువాత ఆయనకు హోమియో వైద్య విధానంతో కూడా సమగ్రమైన పరిచయం కలిగింది. ఆయన తాను జనాకర్షణకు లోనుకాకుండా ఉండటానికి, వారిలో అనవసరమైన ఉద్వేగాలు కలుగకుండా ఉండేందుకు తన అతీంద్రియ చికిత్సా విధానాలను ప్రక్కనబెట్టి, హోమియోవిధానం ద్వారానే చికిత్స చేయడానికి నిశ్చయించుకున్నారు. దివ్యశక్తులు ప్రదర్శింపబడినప్పుడు ప్రజలు ఉద్వేగభరితు లవుతారు. అందువల్ల వారి ఆవేశతత్త్వాలు ప్రకోపిస్తాయి. ఆ విధంగా ఆవేశతత్త్వం ప్రకోపింపబడటం ఏ వ్యక్తికి మంచిది కాదు. ఎంతగానో హానిచేస్తుంది. దానివల్ల ఆ వ్యక్తిలోని ప్రాణమయ కోశంలో అసమానతలు చోటు చేసుకుంటాయి. వివేకం నశిస్తుంది. ఆలోచనాశక్తి తగ్గిపోతుంది. అలాంటి ప్రభావానికి

లోనైన మనిషి మరింత ఆవేశపరుడు, అంధవిశ్వాసి అయి, గురువు పట్ల వ్యక్తి ఆరాధన పెంచుకుంటాడు. గురువు అనేది ఒక తత్త్వం. వ్యక్తిత్వం ఆ తత్త్వం యొక్క వాహిక. వ్యక్తిత్వ ఆరాధన వివిధ మతాలకు, సిద్ధాంతాలకు, వాదాలకు దారి తీసింది. దానివల్ల తీవ్ర విభేదాలు పుట్టాయి. కరడుగట్టిన సిద్ధాంతాలు, మతాలు ఈ భూమిమీద సంఘర్షణకు కారణమవు తూనే ఉన్నాయి. అందువల్లనే నవ్యయుగంలోని పరమగురు పరంపర వ్యక్తిత్వ రాహిత్యము అనే మూలసూత్రం ఆధారంగా పనిచేయాలని స్థిర నిశ్చయానికి వచ్చింది. నిజమైన ఏ గురువు ఇకమీదట తన వ్యక్తిత్వపు ఘనతను చాటుకోకుండా సత్యాన్ని ప్రదర్శిస్తూ, ప్రబోధిస్తూ, ఆ మార్గాన్నే ప్రధానంగా చాటిచెబుతాడు అని దీని భావం. తాను వెనుక ఉండి తన కార్యక్రమాలను ముందుంచుతాడు. నిజమైన గురువు యుద్ధరంగంలోని వీరుని వలె ముందుకు దూసుకుపోవటం కాక పశువులకాపరి వలెనో, గొఱ్ఱెలకాపరి వలెనో తను వెనుక ఉండి తనవారిని ముందుకు నడిపిస్తాడు. కుంభయుగంలో మార్గదర్శకత, వ్యక్తిత్వరాహిత్యము అనేవే ప్రాధాన్యం వహిస్తాయి. వ్యక్తిత్వాన్ని ఘనంగా చాటుకోవట మనే పూర్వసంప్రదాయం గురువులపట్ల ఎంత మాత్రమూ పనికిరాదు. మానవాళిలో ఎక్కువభాగం ఇప్పటికీ ఆవేశకక్ష్యకు పరిమితమై, స్వచ్ఛమైన మానసిక కక్ష్యకు చేరుకోకపోవడంవల్ల

గురువులను వ్యక్తులుగా ఆరాధించే విధానం కొంతమేరకు నిలబడిపోయింది. నిజమైన గురువు ఆ విషయాన్ని పట్టించుకో రాదని, ఆ విధమైన వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించపరాదని పరమగురువుల ఆదేశం. ఆకారణంగానే మాస్టర్ ఇ.కె.గారు తన స్వస్థతా కార్యక్రమా న్నంతటినీ హోమియో వైద్యవిధానం ఆధారంగా సాగించాలనుకున్నారు. ఆయన హోమియోను అనుసరించడంలో ఎన్నో మెలకువలు (Dimensions) చూపారు. అందరికీ తెలిసిన హోమియో మందులకు సంబంధించి ఎన్నో నూతన లక్షణాలను కనిపెట్టి, ఆయన హోమియో వైద్యశాస్త్రానికి మరింత వన్నె తెచ్చారు.

ఆయన తన స్వస్థతా కార్యక్రమాన్ని తన ఇంటివద్దనే తన మిత్రుల సహాయంతో ఒక వైద్యాలయాన్ని నిర్వహించడం ద్వారా ప్రారంభించారు. అది ఉచిత వైద్యాలయం. అక్కడ ఏ విధమైన ఫీజులు లేకుండా ప్రేమతో రోగులకు మందులిచ్చేవారు. ఎలాంటి వ్యాధులైనా చేతితో తీసేసినట్టు అద్భుతంగా తగ్గి పోయేవి. ఎంతటి అసాధ్యమైన రోగమైనా ఆయనవల్ల తగ్గుతుంది అనే విషయం నెమ్మదిగా ఆనోటా ఆనోటా అంతటా వ్యాపించింది. కాలక్రమాన ఆ వైద్యాలయం ఎంతగానో విస్తరించింది. ఆయనతో సహకరించిన మిత్రులందరూ ఆ వైద్యవిధానంపట్ల ఆసక్తి చూపించారు. వారి ప్రేరణతో ఇ.కె.గారు వారిని మాస్టర్

సి.వి.వి. గారి యోగమార్గంలోకి ప్రచోదనం చేసి, హోమియో వైద్యశాస్త్రాన్ని నేర్పారు. అంతేకాక అలా నేర్చుకున్న వారందరూ తమతమ స్వస్థలాల్లో వైద్యాలయాలు నిర్వహించడానికి వారిని ఆయన ప్రోత్సహించారు. చికిత్స చేసేటప్పుడు దృశ్యంగాను, అదృశ్యంగాను తాను వారికి సహకరిస్తానని వాగ్దానం చేశారు. ఆ విధంగా వైద్యాలయాలు విస్తరిస్తుండగా ఆయనకు ఉదారులు, ధార్మికులు, ప్రేమాస్పదులైన వైద్యునిగా ప్రఖ్యాతి వచ్చింది.

మరికొంత కాలానికి మరోఅడుగు ముందుకు వేసి మాస్టర్ ఇ.కె.గారు తనవద్దకు వైద్యానికి వచ్చినవారిని హోమియో విధానం అభ్యసింప చేసేవారు. రోగార్తులను అద్భుత వైద్యులుగా పరిణమింపజేసిన రససిద్ధుడాయన. ఆంధ్రప్రదేశ్‌లో హోమియో విధానం ఒక ఉద్యమంలాగా వ్యాపించటానికి ఆయన ఎంతగానో దోహదం చేశారు. ఈనాడు ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో వందకుపైగా ఉచిత హోమియో వైద్యాలయాలు నిర్వహింపబడు తున్నాయి. ఆయా వైద్యాలయాలకు వచ్చే చాలామంది రోగులు మందులతో పాటు మాస్టర్ సి.వి.వి.గారి యోగమార్గంలో కూడా ప్రవేశించి, ఇ.కె.గారి ప్రబోధాలను ఆచరణలో పెడుతున్నారు. ఆ విధంగా వైద్యంద్వారా ప్రబోధము, యోగమార్గ ప్రవేశము ఏకకాలంలో జరుగుతూ ఆయన కార్యక్రమాలు విస్తరిస్తున్నాయి.

స్వస్థతా విధానం ద్వారా ఎన్నెన్నో అద్భుత నివారణలు జరిగాయి. నివారణ సాధ్యంకాని వ్యాధులు ఆయనవల్ల నయమై

నప్పుడు ప్రజలు ఆయనను మహనీయునిగా చెప్పుకున్నారు. కానీ, ఆయన అలాంటి పొగడ్తలను అంగీకరించలేదు. ఆ విధమైన ప్రజల ఆవేశాలను ఆయన ఈ విధమైన మాటలతో శమింప జేసేవారు. **“కాలమే స్వస్థతాధర్మము కలది. వ్యాధి నయమయ్యే సమయ మాసన్నమైన వ్యక్తి నా దగ్గరకు వస్తాడు. అతనికి వ్యాధి నివారణ జరుగుతుంది. రోగం తగ్గించాననే ఘనత నాకు కాలపురుషునివల్ల దక్కుతోంది. అంతే! వాస్తవానికి నివారణ కలిగించేది నేను కాదు. కాలము ద్వారా దైవము నివారిస్తూ ఉంటాడు. వ్యాధి నయమయ్యే సమయం ఆసన్నం కాని వ్యక్తి నా దగ్గరకు వస్తే నావల్ల అతనికి స్వస్థత కలుగదు. ప్రతి సమస్యకి కాలమే పరిష్కారాన్నిస్తుంది అనేది శాశ్వతసత్యం. ఈ విషయాన్ని మనం నిర్లక్ష్యం చేయకూడదు. ఎవరివల్ల ఏమి జరిగినా అది వారివల్ల కాదని, దైవానుగ్రహమని అందరూ తెలుసుకోవాలి.”**

మాస్టర్ ఇ.కె.గారు ఇరవైనాలుగ్గంటలూ వైద్యసేవకు అంకితమై ఉండేవారు. ఏ సమయంలో రోగార్తులు వచ్చినప్పటికీ ఆయన అందుబాటులో ఉండేవారు. రోగులకు ఆయన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉండేవి. నిద్రపోతున్నప్పుడు కూడా ఆయన తన ప్రక్కనే ఒక టెలిఫోను ఉంచుకునేవారు. దూర ప్రాంతాలలోనివారు ఫోను చేసినప్పుడు వెంటనే ఆయన తగిన

సలహాలు ఇచ్చేవారు. అంతటిది ఆయన వైద్యసేవానిరతి. ఆయనకుగల అతీంద్రియ నివారణాశక్తి అత్యవసర సందర్భాల్లో బయటపడేది. ఏదైనా దూరప్రాంతంనుంచి వైద్యసలహాకోసం ఫోను వస్తే ఆయన సాధారణంగా 'ఫలానా హోమియోమందు వేయండి' అని చెప్పేవారు. ఒకవేళ ఆ మందు వెంటనే లభ్యం కాకపోతే ఒక మోతాదుగా 'పంచదార మాత్రలు (Placebo) వేసెయ్ అదే తగ్గిపోతుంది' అనేవారు. అలా ఎన్నోసార్లు ఎందరికో తగ్గిపోయింది. కొన్ని సందర్భాల్లో రోగి ప్రక్కనేవుండి హోమియో మందులు అందుబాటులో లేనప్పుడు "తీర్థమిస్తాను తీసుకో, తగ్గిపోతుంది" అంటూ చెంచాడు నీళ్ళు ఇచ్చేవారు. అలాగే తగ్గిపోయేది. మరికొన్ని సందర్భాల్లో ఆయన నోటిమాటే మందుగా పనిచేసేది.

ఒకసారి భయంకరమైన మండ్రగబ్బ కుట్టి ఒకామె ఎంతో బాధతో గిలగిల్లాడుతూ మాస్టరుగారి దగ్గరకు వచ్చింది. విషం వేలుమీదనుంచి భుజానికి చేరింది. మాస్టరుగారు నవ్వుతూ 'బాధ ఇక్కడిదాకా వచ్చిందా?' అంటూ ఒక్కసారి ఆమె భుజాన్ని స్పృశించారు. ఆమె ఎంతో ఆందోళనతో 'ఔనండీ' అంది. 'ఇప్పుడది దిగిపోతుందిలే. ఒక్క క్షణం అలా కూర్చో' అన్నారు మాస్టరుగారు. అదేమి స్పర్శో! క్షణంలో బాధ మాయమైంది. ఆ స్త్రీ ఎంతో ఆనందించింది.

మాస్టరుగారు వైద్యానికి సంబంధించి ఇలాంటి మహాద్భు తాలు చేస్తున్నప్పటికీ రోగితాలూకు కర్మానుభవ విషయాన్ని విస్మరించేవారుకాదు. కాలంతోపాటు నివారణకు సంబంధించి మరోపార్శ్వం కర్మ అని ఆయనకు తెలుసు. ఆయన నిర్మమంగా తన స్వస్థతా కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అక్కడక్కడా కొన్ని సందర్భాల్లో ఆయన వైద్యం విఫలమైనప్పుడు ఆయన ఆ ఓటమిని హుందాగా అంగీకరించి మౌనంగా ఉండిపోయేవారు. రోగి కర్మవశాన నివారణ సాధ్యపడదని తెలిసినా, ఆయనేమీ మాట్లాడకుండా అవతలివారు అది తన వైఫల్యమే అన్నాకూడా ఒప్పుకుని ఊరుకునేవారు. ఆయన ఏనాడూ తాను పొరపాటు లకు ఆస్కారం లేనివాడినని చెప్పుకోలేదు. ఆ కారణంగా ఆయన తన అనుయాయులకు మరింత ఆత్మీయులయ్యారు. మహత్కార్యా లను సాధించేవారు సాధారణంగా తమ తప్పిదాలను, అపజయా లను అంగీకరించరు. కానీ, మహానుభావులైనవారు మాత్రం తమ తప్పులను, వైఫల్యాలను అంగీకరించి మరింత మహానుభావు లవుతున్నారు. మాస్టర్ ఇ.కె.గారు అవసరపడిన సందర్భాల్లో నిర్మొహమాటంగా తమ వైఫల్యాలను ఒప్పుకునేవారు. అదీ ఆయనలోని గొప్పతనం! ఆయన గొప్పతనం ప్రధానంగా నిరాడంబరమైన ఆయన మంచితనంపై ఆధారపడి ఉండేది. ఆ విధంగా ఆయన వేలాదిమందికి చేసిన వైవిధ్యభరితమైన

అద్భుత చికిత్సలను గురించి ఎంతయినా చెప్పుకోవచ్చు. ఆయన సర్వసాధారణంగా వ్యక్తులను తీర్చిదిద్దుతూ వారిలో పరివర్తన కలిగేలాచేస్తూ ఉండేవారు.

రోగనివారణకు హోమియో మందులను ఇస్తూ రోగాలు రాకుండా చేసుకునేందుకు ఆయుర్వేద సూత్రాలను నేర్పుతూ రోగి యోగిగా మారేందుకు దివ్యస్పర్శను అందిస్తూ మాస్టరుగారు తన స్వస్థతా కార్యక్రమాన్ని కొనసాగించారు.

## ప్రబోధము :

మాస్టర్ ఇ.కె.గారు నిర్వహించిన మరొక ముఖ్య కార్యక్రమం ప్రబోధము. బోధన, స్వస్థపరచుట అనే రెండూ ఆయనకు రెండు రెక్కలవంటివి. తన అనుయాయులలో తగిన పరివర్తన తీసుకువచ్చేందుకు ఆయన సాగించిన ధ్యానం పరమావధిని చేరుకోవడానికి ఈ రెండూ ఆయనకు ఎంతగానో సహకరించాయి. వాస్తవానికి ప్రతి వైద్యుడు ఒక ప్రబోధకుడు, ప్రతి ప్రబోధకుడు ఒక వైద్యుడు. నిజమైన ఏ గురువుకైనా ఆ రెండూ విడదీయరాని కార్యక్రమాలు. ప్రాచీనకాలంలో గురువులు అలాగే ఉండేవారు. సత్యాన్ని దర్శించిన గురువులు ఎప్పుడూ ఆ మార్గాన్నే కొనసాగించారు. వైద్యము తెలియని గురువు పరిపూర్ణుడు కాడు. అలాగే విజ్ఞానప్రబోధం చేయలేని వైద్యుడు

కూడా పరిపూర్ణుడు కాడు. ఈ రెండింటి పరమావధి గురువును అనుసరించే సాధకులకు మార్గదర్శనం చేయటమే. స్వస్థతవల్ల సాధకుల శరీరంలోని జీవశక్తులకు సహజ సమస్థితి పునరుద్ధ రింపబడుతుంది. బోధనవల్ల సాధకులలో ప్రజ్ఞావికాసం జరుగుతుంది. ప్రాణశక్తులు సహజస్థితి పొందనిదే ప్రజ్ఞావికాసం సాధ్యపడదు. మనిషి ప్రాణశక్తులతో ఒకవిధంగాను, ప్రజ్ఞాశక్తు లతో మరొక విధంగాను నిర్మింపబడతాడు. ఈ రెండు శక్తులూ మనిషిలో కలగలిసి ఉంటాయి. ఈ రెంటిలో ఏ ఒక్కటి భంగ పడినా రెండవదికూడా భంగపడుతుంది. ఒకదానిని సరిచేసి నట్టయితే రెండవది కూడా సర్దుబాటు అవుతుంది.

"ప్రాణచికిత్స – యోగప్రబోధం" (Prana Treat - Yoga Teach) అనే ప్రాచీనసూక్తి ప్రతి గురువుకూ ఆదర్శం. మాస్టర్ ఇ.కె.గారు కూడా దానినే అనుసరించారు. ఆయన ఎంతో సహనంతోను, దీక్షతోను పదేపదే బోధించేవారు. ఆయన బోధన ప్రేమపూర్వకంగాను, అవసరమైనప్పుడు అధికారికంగాను ఉండేది. ఆయన బోధనలో హాస్యమూ ఉండేది, అనుశాసనమూ ఉండేది. ఆయన అయస్కాంతంవలె శ్రోతలను బుద్ధికోశానికి, కొన్ని సందర్భాల్లో తన్మయస్థితికి ఆకర్షించేవారు. ఆయన ప్రవచిస్తున్నప్పుడు చిందించే చిరునవ్వులు సర్వత్ర అయస్కాంత తరంగాలను వ్యాపింపజేసేవి. ఆయన చూపులు కాంతివంతా

లుగా ఉండి పదేపదే ఆ కళ్ళలోకి చూసే జనాలను ఏ లోకాల్లోకో తీసుకుపోయేవి. ఆయన ప్రవచనాలను వినడానికి అలవాటు పడినవారు అవి వినకపోతే ఉండలేనంతగా బాధపడేవారు. ఆయన ప్రవచనాలు శ్రోతల ప్రజ్ఞను తాకేలా ఉండేవి. వింటున్న వారిని జ్యోతిర్మార్గంలోకి ప్రచోదనం చేసేవి.

ఆయన తరచుగా నిరుక్తము, జ్యోతిషము, ఛందము, కల్పములకు చెందిన మూలసూత్రాల ఆధారంగా విశ్వగ్రంథాలకు వ్యాఖ్యానం చెప్తుండేవారు. వాటిద్వారా రామాయణం, మహాభారతం, భగవద్గీత, భాగవతం, బైబిలు పాతనిబంధనలు, సీక్రెట్ డాక్ట్రిన్ వంటి మహాగ్రంథాలలో నిక్షిప్తమైన విశేషాంశాలను అందుకుని అందించగలిగారు. తెలుగులోగాని, ఇంగ్లీషులోగాని ఆయన వాక్ప్రవాహం ధారాళంగా సాగిపోతుండేది. ఆయన తన ఉపన్యాసాల్లో చాలాసార్లు మతాల ఛాందసత్వాన్ని, కరడు గట్టిన సంప్రదాయాలను విమర్శించారు. వాటివల్ల సత్యలేశమే గాని, సత్యం సమగ్రంగా బోధపడదని ఆయన చెప్పేవారు. మహాగ్రంథాలను మతాధికారులు అన్వయించిన విధంగాకాక సొంతంగా ప్రభావరహితమైన దృష్టితో అధ్యయనం చేయాలని ఆయన ప్రగాఢ విశ్వాసం. మహర్షులు, యోగులు, ప్రవక్తల సమన్వయాలంటే ఆయనకు ఎంతో పూజ్యభావం ఉండేది. మహాగ్రంథాలలోని ప్రక్షిప్తాలను కూడా ఆయన బయటపెడుతు

ఉండేవారు. ఆయన ప్రవచనాలు ప్రధానంగా తొంభై నిముషాల పాటు అనర్గళంగా సాగిపోయేవి. అవకాశం లేనప్పుడు మాత్రమే అంతకు తక్కువ సమయంలో ముగించేవారు. ఆయా ప్రవచనా లన్నీ 'శంన్నో మిత్రః...' అనే ఆశంసనంతో మొదలయ్యేవి. శాంతిమంత్రంతో ముగిసేవి. ఆయన ప్రసంగాలకు శ్రోతలు మంత్రముగ్ధుల్లా పరవశించేవారు.

మాస్టరుగారి బోధనా, స్వస్థతలకు సంబంధించి మరొక ముఖ్యాంశం- ఆయన ఏనాడూ తనకు తానుగా మాట్లాడటానికి గాని, వైద్యం చేయటానికిగాని ముందుకు వచ్చేవారు కాదు- ఎవరైనావచ్చి అడిగితేనే తప్ప! ఆ అడగటం కూడా పైపైన మాటవరసకన్నట్లుగా ఉంటే ఆయన సమాధానం కూడా అందుకు తగ్గట్లుగానే ఉండేది. ఆర్తితో అడిగినవారిపట్ల ఆయన అంత బాధ్యతగాను ఉండేవారు. అడిగేవారి తీరునుబట్టి ఆయన స్పందన ఉండేది. నిర్లక్ష్యంగా ఉండేవారితో నిర్లక్ష్యంగాను, లౌక్యులపట్ల లౌక్యంగాను, తప్పించుకోవాలని అనుకునేవారిపట్ల తప్పించుకునే వానిలాగాను, దొంగవేషాలు వేసేవారిపట్ల మౌనంగాను, తననే నమ్ముకున్నవారిపట్ల అత్యంత క్రమశిక్షణ తోను ఆయన ప్రవర్తించేవారు. మాస్టరుగారి బోధన, స్వస్థతా కార్యక్రమం మూడు దశాబ్దాలపాటు నిరాటంకంగా సాగి పోయింది. ఆయన మహాగ్రంథాల్లోని గూఢార్థాలను బోధించడమే

కాక, తన అనుయాయులకు ఆధ్యాత్మిక జ్యోతిష్యము, శబ్దము, వర్ణము, సంఖ్య, ప్రతీకాత్మకత (Symbolism), తంత్రము, మంత్రము, రమల వంటి మధ్య, ప్రాచ్య శాస్త్రాలు– ఇలాంటి అనేక అతీంద్రియ శాస్త్రాలను బోధించారు. ఎక్కడ ఏది అవసర మైతే అక్కడ ఆ విషయాన్ని ఆయన ఆశువుగా చెప్పేవారు. సాయంత్ర వేళల సాగే ఆ ప్రవచనాలకు ఎంతమంది వచ్చారు అని ఆయన పట్టించుకునేవారు కాదు. ముప్పది సంవత్సరాల ఆయన ప్రబోధ కార్యక్రమంలో సాయంత్రంపూట ప్రవచనంలేని రోజు ఉండేదే కాదు. ఆయన ద్వారా వచ్చే ప్రవచనాలు వినటానికి పరోక్షంగా ఎందరో వ్యక్తులు వచ్చేవారని ఆయన తరచు చెప్పేవారు. అలా ఉల్లాసంకోసం తన ప్రవచనాలు వినటానికి వచ్చిన అదృశ్యవ్యక్తులను గమనించినప్పుడు ఎంతో ప్రోత్సాహ కరంగా ఉండేదని ఆయన అనేవారు. అలాంటి సందర్భాల్లో ఆయన ప్రవచనాలు అత్యంత ఉదాత్తస్థాయిని సాగేవి. ఆయన ప్రవచనాలకు ముందుగా ఏవిధమైన సంసిద్ధత ఉండేది కాదు. శ్రోతల అవసరాలను బట్టి, స్థల మహాత్మ్యాన్ని బట్టి, ఆనాటి గ్రహస్థితులను బట్టి అప్పటికప్పుడు ఆయా విషయాలు ఆవిష్కృతాలై ఆయనద్వారా వెలువడేవి. ఆయన ఏనాడూ ఎవరినీ తన ఉపన్యాసం ఎలావుందని అడిగేవారు కాదు. అలా అడగ కూడదని ఆయనకు గట్టి ఆదేశాలు ఉండటంవల్ల శ్రోతల అభిప్రాయాలను గురించి పట్టించుకునేవారు కాదు.

సమాజంలోనివారి అభిప్రాయాలకు అనుగుణంగా జీవించాలి అనుకోకపోవటం మాస్టర్ ఇ.కె.గారిలోని ప్రత్యేకత. ఆయన నిర్వహిస్తున్న గంభీరమైన కార్యక్రమాలతో పోల్చిచూస్తే జనాభిప్రాయమనేది ఎంతో అల్పము, తాత్కాలికమూను. ఆ మాటకువస్తే ఆయన కార్యకలాపాలను అర్థం చేసుకున్నవారే అరుదు. అందువల్ల ఆయన దృష్టి ప్రధానంగా శ్రద్ధాళువులైన శ్రోతలను ప్రబోధించడంగానే ఉండేది. అంటే శ్రోతల ప్రాణమయ కోశంలో (Energy system) సాధారణస్థితిని కలిగించటం అని అర్థం. ఆయన ప్రవచనాలు విన్నవారు తరచుగా తమకున్న ఎన్నో సందేహాలు పటాపంచలయ్యాయని చెప్పేవారు. కొంత మంది తమకు సరైన మార్గం దొరికిందని చెప్పేవారు. మరికొంద రయితే తమ నెత్తిమీద ఉన్న సమస్యల బరువు తీరిపోయిందనే వారు. మాస్టరుగారు మౌనంగా విని ఊరుకునేవారు.

రాత్రి 9 – 12 గంటల మధ్య ఆయన ప్రత్యేక శిక్షణ కావాలనుకునే యువబృందాలకు హోమియోపతి, జ్యోతిషము వంటి అతీంద్రియ శాస్త్రాలలో విశేష తరగతులు నిర్వహించే వారు. ఉదయంపూట నిరుక్త సహితమైన సంస్కృత బోధన, యోగాసనాలు నేర్పించేవారు.

## 9

# రచనా వ్యాసంగము

**మా**స్టర్ ఇ.కె.గారు బోధన, స్వస్థత, యోగప్రబోధాలను ముమ్మరంగా నిర్వహిస్తూనే, రచనా వ్యాసంగాన్ని కూడా కొన సాగించారు. వేదసూక్తాల వివరణనుండి, హోమియో విజ్ఞానము – ఆరోగ్యాల వరకు ఆయన యాభైకిపైగా గ్రంథాలు వెలువ రించారు. ఆయన రచించిన "*భాగవత రహస్యప్రకాశం, మంత్రగీత, జ్యోతిష గ్రంథాలు, వేదసూక్త వివరణలు, పతంజలి యోగసూత్ర వివరణము, క్రతునిర్వహణము*" వంటి విజ్ఞానాంశాలు ఆయా అంశాలకు సంబంధించిన లోతైన అవగాహనను కలిగిస్తాయి. '*భారతీయ బాలశిక్ష*' పేరిట పిల్లలకు తల్లిదండ్రులు అందించవలసిన ప్రాథమికశిక్షణను కూడా నాలుగు చిన్నపుస్తకాలుగా ఆయన అందించారు. ఆయన గ్రంథ రచనా విధానం సామాన్యమైనది కాదు. ఇప్పటి రచయితల తీరుకంటే అది ఎంతో భిన్నమైనది. ఆయన రచనలన్నీ భవ్య కవితావేశంతో రాయబడినవి. శ్రీకృష్ణ భగవానుని జీవితఘట్టా లకు సంబంధించి ఆయన అందించిన నవలారాజములు ఆయన భవ్యకవితావేశానికి చక్కని నిదర్శనాలు. ఇది ఇలా రాయాలి

అని ఆయన ఏనాడూ సంకల్పించలేదు. తమంతట తామే ఆయా గ్రంథాలు ఆయన ద్వారా దిగివచ్చాయి. గ్రంథరచనా విధానంలో అపౌరుషేయతకు (Impersonality) సంబంధించిన ఒక విశేషమిది. ఇదేవిధమైన అపౌరుషేయత ఆయన నిర్వ హించిన బోధన, స్వస్థతలలో కూడా వ్యక్తమయ్యేది. ఆయన అనుయాయులలో చాలామంది అందుకు ప్రత్యక్షసాక్షులు. నిజం చెప్పాలంటే ఆయన తనకు తానుగా ఒకచోట కూర్చుని ఏనాడూ ఏ రచనా రాయలేదు. ఆశువుగా చెప్పేవారు అంతే! రాయాలనే ప్రేరణ ఎప్పుడు వచ్చినా ఆయన అప్పటికప్పుడు సంసిద్ధులై తన ప్రక్కనున్నవారిని పెన్ను, కాగితాలు తీసుకోమనేవారు. వారికి ఆశువుగా చెప్పటం మొదలుపెట్టేవారు. అది సత్యాన్వేషకు లకు పనికివచ్చే చక్కని గ్రంథంగా రూపొందేది. విషయం దానంతటదిగా పూర్తయ్యే వరకూ ఆశుకథనం కొనసాగు తుండేది. '*స్పిరిచ్యువల్ ఎస్ట్రాలజీ, మంద్రగీత, మంద్రజాలము, పురుషమేధము, భాగవత రహస్య ప్రకాశము*' అనే గ్రంథాలు మాస్టరుగారి భవ్యకవితావేశంనుండి దిగివచ్చిన రచనలలో ప్రముఖంగా పేర్కొనదగినవి. సహచరు లెవరైనా 'మీనుండి ఈ రచనలు ఎలా వస్తున్నాయి?' అని అడిగితే ఆయనిలా చెప్పేవారు. **'బుద్ధిమయకోశంలో ఉన్నట్టుండి నాకు ప్రేరణ కలుగుతుంది. అప్పుడు నా అంతఃకరణశరీరం సమాయత్త మవుతుంది. నా ఎదురుగా గాలిలో నాకొక వ్రాతప్రతి కద**

**లాడుతూ కనిపిస్తుంది. నా ఎదుటివారు వ్రాసేందుకు వీలుగా దానిని చూస్తూ పైకి చదువుతాను. ఒక్కొక్కసారి సన్నివేశాలు నా కళ్ళముందు కదలాడతాయి. వాటిని వర్ణించి చెబుతాను. ఆ విధంగా నా ఆశుకథనం సాగుతుంది.'** ఆయన ఏనాడూ ఏ రచననూ తన సొంతమని చాటుకోలేదు.

భారతదేశంలో స్ఫూర్తివంతపు (Inspirational writings) రచనలనేవి వింతవిషయమేమీ కాదు. మౌలికంగా వేదాలు, ఉపనిషత్తులు అలా దర్శించి చెప్పబడినవే. మహాగ్రంథాలైన భగవద్గీత, మహాభారతము, భాగవతము, రామాయణములు కూడా ఆ విధంగా దిగివచ్చినవే. యోగప్రబోధాన్ని పొందినవారు కొందరు మానవాళికి అందించవలసిన విజ్ఞానాన్ని అంతరిక్షము (Akashic Records) నుండి అందుకుని అందించడానికి తగిన వాహికలుగా పనిచేస్తారు. ఏఏ విజ్ఞానగ్రంథాలు అందించబడాలి అనేది ఉన్నత కక్ష్యలలోని వారిచే నిర్ణయింపబడి, అర్హులైన వాహికలద్వారా ప్రసారం చేయబడతాయి. అత్యాధునికంగా ఆ విధమైన విజ్ఞాన ప్రసారణ మేడమ్ ఏలిస్. ఏ. బెయిలీ ద్వారా జరిగింది. న్యూయార్క్‌లో ఉండే ఆమెకు హిమాలయాలలోని ఒక పరమగురువు విజ్ఞానాన్ని ప్రసారం చేశారు. అలా ఆమె ద్వారా దిగివచ్చిన విజ్ఞానగ్రంథాలు నేడు భూగోళం మొత్తంమీద మూడు వేల బృందాలను ప్రచోదనం చేశాయి. దూరశ్రవణము,

దూర దర్శనము, ఆకాశగమనము, దివ్యావేశరచనము అనేవి యోగ ప్రబోధకులకు, వారి శిష్యగణాలకు నిత్యకృత్యములే.

శ్రీమద్భాగవతానికి రహస్య ప్రకాశనం చేస్తున్నప్పుడు మాస్టరుగారు ఇతర గ్రంథాలకేసి, ఇతరత్రా పనులను గురించి తమ దృష్టిని మళ్ళిస్తూ ఉండేవారు. తత్ఫలితంగా జనులు ఆశించిన ప్రకారంగా భాగవత రహస్య ప్రకాశం సరిగా సాగలేదు. చాలా మందికి మాస్టరుగారు 'దానిని ఎందుకు పూర్తిచేయలేదు? అలా ఎందుకు ఇతర వ్యాపకాలు పెట్టుకుంటున్నారు?' అనేవి ప్రశ్నార్థకంగా ఉండేవి. ఆ విషయాన్ని గురించి సన్నిహితులైన వారు వివరణను కోరగా ఆయన చిన్నగా నవ్వి ఇలా అన్నారు. **"ఎప్పటికి ఎంతవరకు అవసరమో అంతవరకే వస్తుంది. నేను ప్రసారకుడిని మాత్రమే. నాకు అందింది అందినట్లుగా ఎప్పటి కప్పుడు అందిస్తాను. అంతేగాని సొంతంగా ఏ వ్యాఖ్యానమూ చేసే సాహసం చేయను. పైవారి నిర్ణయం లేకపోతే నేను చేసేదేం లేదు వేచి ఉండటం తప్ప! నేను అనుసరించేవారిని ప్రశ్నించే అలవాటు నాకు లేదు. ఆ వ్యాఖ్యానం నాకు ఎప్పు డందితే అప్పుడు దానిని అందిస్తాను. అది వచ్చినప్పుడు రాత్రీ పగలు అనేది చూడకుండా ఎక్కడపడితే అక్కడ ఏ పనిలో ఉన్నా వచ్చింది వచ్చినట్టుగా అందజేశాను. ఇవ్వబడిన విజ్ఞానాన్ని చదువుకొన్నవారు ఆచరణలో పెట్టాలి. విజ్ఞానమనేది ఆచరించ టానికేగాని, సమాచారంకోసం కాదు. మానవ మనస్సులు**

**సమాచారంకోసం తహతహలాడతాయే గాని, కనీసం ఆ విజ్ఞానంలోని ప్రాథమికాంశాలనైనా ఆచరించటానికి ఇష్టపడవు. తరువాతి భాగాలకు వ్యాఖ్యానం గురించి అడిగేవారిని ఇప్పటి వరకు ఇచ్చినదానిని ఆచరించి చూపండి అని గట్టిగా అడగండి. మీవరకైతే నే చెప్పే దొక్కటే. ఆ వ్యాఖ్యానానికి కర్తను నేను కాదు. నేనే గనుక నా అంతట నేనుగా గ్రంథాలు రాయదలచు కుంటే నాకున్న గ్రంథ పరిజ్ఞానంతో వందలాది పుస్తకాలు రాసుండేవాడిని. కానీ అలా రాసినవి ఎంతోకాలం నిలబడవు. పైవారి ప్రణాళికానుసారం నిర్వహించబడే పనులు మాత్రమే కాలాన్ని అతిక్రమించి నిలబడతాయి."**

మాస్టర్ ఇ.కె.గారు తనకోసం రాత్రింబగళ్ళు పనిచేసే కొందరు కుర్రవాళ్ళను చేరదీసేవారు. ఆయనకు వారు రాత్రిళ్ళు కూడా గ్రంథరచనకు సహకరించేవారు. కొన్నిసార్లు మాస్టరుగారు గంటలతరబడి చెబుతూనే ఉండేవారు. అలాంటి సందర్భాల్లో ఆ కుర్రవాళ్ళు వంతులవారీగా పనిచేసేవారు. అందువల్ల వారికి తగినంత విశ్రాంతి దొరికేది. మాస్టరుగారి కార్యక్రమం ఆ విధంగా నిరాటంకంగా సాగిపోయేది.

మాస్టరుగారి పుస్తకాలు ఈనాడు ఎన్నో ఇతరభాషల్లోకి అనువదింపబడ్డాయి. వాటివల్ల శ్రద్ధాళువులైనవారిలో చక్కని పరివర్తన కలుగుతోంది. సాధకులు తమ జీవితాలను చక్కదిద్దు

కుని సత్యమార్గాన్ని అనుసరించటానికి అవసరమైన తగినంత మార్గ నిర్దేశకత్వం ఆ గ్రంథాలలో ఇవ్వబడింది. పైపైన చూసే వారికి ఆయన ఇచ్చిన సాహిత్యం అసమగ్రం అనిపించవచ్చు కాని, సాధకులకు మాత్రం అది స్వయంసంపూర్ణం.

మాస్టర్ ఇ.కె.గారు ఈనాడు తెలుగు సాహిత్యంలో అత్యుత్తమ సంప్రదాయ పద్యకావ్యంగా పరిగణింపబడుతున్న 'గోదావైభవము' అనే చక్కని పద్యకావ్యాన్ని రచించారు. ఒక సాధకుడు గ్రహింపగలిగినంత ఆధ్యాత్మిక సాధనలను గురించి ఈ గ్రంథం ఎంతగానో తెలియజెబుతుందని సాధకలోకం భావిస్తుంటుంది. అంతేకాక భక్తితో చదివేవారికి ఒకవిధమైన తన్మయత్వంతో కూడిన ఆనందానుభూతిని కూడా ఈ కావ్యం ఇస్తుంది. మాస్టరుగారికి ఇవ్వబడిన గ్రంథరచనా ప్రణాళికాక్రమం ఈ గోదావైభవంతోనే మొదలయింది. ఈ కావ్యంలో గోదాదేవి యొక్క తీవ్రమైన ఆధ్యాత్మిక సాధనలు, ఆమె అనుభూతికి అందిన సత్యంయొక్క మహావైభవము చక్కగా వర్ణింపబడ్డాయి. ఒక విధంగా చెప్పాలంటే అందులో వర్ణింపబడినదంతా ఆ పరమసత్యానికి సంబంధించిన మాస్టరుగారి స్వీయానుభూతులే. ఈ గ్రంథం ద్వారా అందించబడిన మధురానుభూతిని అందు కోవటం కోసమైనా మనం తెలుగు నేర్చుకోవాలి. గాఢమైన ఆధ్యాత్మిక అంతర్దర్శనం, మధురానుభూతులతో కూడిన ఆ పద్యాలలోని అందాన్ని అందుకోవాలంటే అంతకుమించి మరోదారి లేదు.

# 10

## బృంద నిర్మాణము

**వి**జ్ఞాన ప్రబోధానికిగాని, హోమియో ద్వారా చికిత్స చేయవలసిందనిగాని వివిధప్రాంతాల ప్రజలు తరచుగా మాస్టరు గారిని ఆహ్వానించేవారు. అలావెళ్ళి ఆయన కొన్నిచోట్ల వారం రోజులు, కొన్నిచోట్ల నెలరోజులు ఉండిపోయేవారు. అలా ఆయన వెళ్ళి బోధించి, వైద్యం చేసినచోటల్లా ఆయన తన ప్రవచనాల్లో సూచించినదానికి అనుగుణంగా ప్రజలు బృందాలుగా ఏర్పడేవారు. మాస్టరుగారు వారిని వీడి తిరిగివస్తున్నప్పుడు ఆయా బృందాలవారు తమను నడిపించవలసిందని, బోధన, వైద్యము కొనసాగించ వలసిందని అర్థిస్తూ ఉండేవారు. వారి అభ్యర్థనలను పురస్కరించుకుని మాస్టరుగారు చెప్పుకోదగిన తీరులో 1977వ సంవత్సరం నుండి బృందనిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రదేశంలో ఆయన చేసిన పర్యటనల కారణంగా యాభైకి పైగా బృందాలు రూపుకట్టుకున్నాయి. ఈ బృందాల వారికందరికీ పరమగురు పరంపర యొక్క కార్యప్రణాళిక పరిచయమయింది. వారు ధ్యానం నిర్వహిస్తారు. హోమియో వైద్యాలయాల ద్వారా సేవా కార్య

క్రమాలు నిర్వహిస్తారు. మాస్టరుగారి గ్రంథాలనుండి గాని, పురాణ గ్రంథాలనుండి గాని, భారతదేశంలోని ఇతర గురువుల ప్రబోధాలనుండి గాని బోధనా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారంగా ఆ బృందాలవారు సనాతన సంప్రదాయ పద్ధతిలో ధ్యానము, స్వాధ్యాయము, సేవ అనే కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. వారి సేవా కార్యక్రమాలు విద్యాబోధనకు, ఆర్తుల సేవకు కూడా విస్తరించాయి. సాధ్యమైన అన్ని విధాలుగాను సేవచేయటం అనే దానిని మాస్టరుగారు ప్రోత్సహించేవారు. బోధన, స్వస్థపరచుట, బృందనిర్మాణములకు సంబంధించిన అన్ని కార్యక్రమాలలోను మాస్టరుగారు నిర్మమంగా ఉండేవారు. ఆయన ప్రత్యేకించి తనంత తానుగా ఏ పనిని ప్రారంభించటం గాని, ప్రతిపాదించటం గాని చేసేవారు కాదు. ఎవరయినా ఇలా చేద్దామని ప్రతిపాదిస్తే దానికి స్పందించడమే తప్ప, తనకు తానుగా ప్రతిపాదించక పోవటమనేది ఆయన కార్యవిధానంలోని ప్రధాన లక్షణం.

జరుగుతున్న కార్యక్రమాలకు ఆయన సాక్షీభూతులుగా ఉండేవారు. చాలాసార్లు ఆయనిలా చెప్పారు. **"నేను ఏ పనినీ ప్రతిపాదించలేదు, ప్రారంభించనూ లేదు."** స్థితప్రజ్ఞతయొక్క లక్షణాలు తెలియనివారికి ఇలాంటి మాటలకు అర్థాలు సరిగా తెలియవు. ఆయన అంతర్యామిప్రజ్ఞలో జీవించేవారు. ఆ ప్రజ్ఞకు సంబంధించిన ప్రణాళికలో ఆయనా ఒక భాగమే కనుక

ఆయనద్వారా ఆ కార్యక్రమాలు రూపుకట్టుకునేవి. 'ప్రజ్ఞగా జీవించి పనిచేయడం తప్ప, పనిచేస్తున్నామనే భావన లేక పోవడము' అనేది నిజమైన యోగియొక్క లక్షణం. నీ అస్థిత్వాన్ని అంతర్యామితో అనుసంధానం చేసుకున్నప్పుడు అంతర్యామి కార్యమే నీ ద్వారా సాగుతుంది. ఇది సాధకుని యొక్క స్థితి. దివ్యప్రణాళిక రూపుదాల్చడానికి అతడు తననొక వాహికగా మలుచుకుంటాడు. అప్పుడు అలాంటి సాధకుని యొక్క వ్యక్తిగత సంకల్పం దివ్యసంకల్పంతో అనుసంధాన మవుతుంది. పర్యవసానంగా ఆ వ్యక్తిద్వారా పనిచేసేది దివ్యసంకల్పమే అవుతుంది. 'తండ్రీ! నీ యిచ్ఛయే జరుగనీ' అనేది శిష్యునికి, సాధకునికి, గురువునకు కూడా ఆదర్శమైన మార్గ మవుతుంది. మాస్టర్ ఇ.కె.గారు ఇటువంటి స్థితి ఎలా ఉంటుందో మనకు చక్కగా నిరూపించారు. ఆయన తానుగా ఏనాడూ దేనినీ సంకల్పించ లేదు. తన వరకు వచ్చిన సంకల్పాలను కాదనలేదు. ఊర్ధ్వకక్ష్య లలో ప్రారంభమైన పనులతో తనను తాను అనుసంధానం చేసుకున్నారు తప్ప, తానుగా ఏనాడూ ఏ కార్యాన్నీ ప్రారంభించ లేదు. జరుగుతున్న పనితాలూకు పరిణామాలు ఎలా ఉంటాయి అనే విషయమై ఆయన ఏనాడూ పట్టించుకోలేదు. కాబట్టే ఆ పనితాలూకు ఫలితాన్ని కూడా ఆయన ఆశించలేదు. తనకు పైవారిచే నిర్దేశింపబడిన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ముందుకు సాగిపోయారు. అంతమాత్రమే.

# 11

## సమన్వయము

**మా**స్టర్ ఇ.కె.గారు జీవితంలోని ప్రతీ అంశాన్నీ చక్కగా సమన్వయించేవారు. ఆయనకు కాదనదగినది గాని, వదిలి వేయదగినది గాని ఉండేదికాదు. ఆయనెప్పుడూ అన్నీ ఉండాలనే అనేవారు. భిన్నంగా కనిపించే విజ్ఞాన మార్గాలన్నీ ఆయన దృష్టిలో ఒకే విజ్ఞానవృక్షపు శాఖలు. విభిన్న వైద్యశాస్త్రాలు, చికిత్సా విధానాలు ఆయన ప్రకారం ఒకే ప్రాణవృక్షము యొక్క శాఖలు. ఆయన ప్రత్యేకించి ఏ ఒక్క 'సిద్ధాంతాన్ని' బలపరచక పోయినా అన్ని సిద్ధాంతాలలో ఉండే సత్యాన్ని చాటిచెప్పేవారు. సాధారణంగా ప్రజలు ఏదో ఒక సిద్ధాంతాన్ని అభిమానించి తక్కిన మార్గాలను విమర్శిస్తారు. మాస్టరుగారు అలా ఏ ఒక్క ఇజానికీ అంకితమూ కాలేదు. దేనినీ కాదనీ అనలేదు. సత్యంలో నిలబడిపోయి అన్ని ఇజాల్లోను, ఆరాధనా పద్ధతులలోను, ఆలోచనా ధోరణులలోను ఉండే సత్యలేశాలను దర్శించ గలిగారు. ఆయన ఇతర గురువులను గౌరవించమని, వారి ప్రబోధాలను అధ్యయనం చేయమని, ఆయా గురువుల చిత్రపటా లను తమ పూజా మందిరాల్లో ఉంచుకోమని తన అనుయాయు

లను ప్రోత్సహించేవారు. సాధ్యమైనంతగా వ్యక్తులను ప్రోత్స హించటం, నిరుత్సాహ పరచకపోవటం అనేది మాస్టర్ ఇ.కె.గారి లోని విశిష్టలక్షణం. ఆయన తన అనుయాయులను వివిధ బోధనలను గ్రహించటానికి, అర్థం చేసుకోవటానికి, అవన్నీ ఒకే సత్యంగా సమన్వయించు కోవటానికి తగిన విశాల దృక్పథం కలిగివుండవలసిందిగా కోరేవారు. ఈ విషయంలో ఆయన శ్రీకృష్ణ భగవానుని భక్తులు. శ్రీకృష్ణుడు కూడా చక్కని సమన్వయ మూర్తి. తన కాలంనాటి ప్రసిద్ధమైన విజ్ఞానశాఖ లన్నింటినీ సమన్వయ పరచినవాడు. మాస్టర్ ఇ.కె.గారు వైష్ణవ సంప్రదా యానికి చెందిన కుటుంబంలో జన్మించారు. సాధారణంగా వైష్ణవులు శైవ సంప్రదాయాలను అంగీకరించరు. భారతదేశంలో తాత్వికచింతనకు సంబంధించి ప్రధానంగా ఐదు మార్గాలవారు ఉన్నారు. ఒక వర్గంవారు పరతత్త్వాన్ని (బ్రహ్మము) మాత్రమే సేవిస్తారు. ఆ పరతత్త్వ రూపాంతరాలను వారు అంగీకరించరు. ఈ వర్గానికి చెందినవారే బ్రహ్మ సమాజం వారు. వారు నామ రూప రహితమైన దైవాన్ని ధ్యానిస్తారు. రెండో వర్గంవారు శైవులు. శివుని పూజిస్తారు. మూడో వర్గంవారు శాక్తేయులు. అమ్మవారిని పూజిస్తారు. నాలుగవ వర్గంవారు గణపతిని పూజించే గాణాపత్యులు. ఐదవ వర్గంవారు సూర్యారాధకులు. ఈ ఐదు రకాలవారే కాక ఇంకా ఎందరో ఇతర మార్గాలకు, ఆలోచనా ధోరణులకు చెందిన వారున్నారు. సత్యాన్ని వివిధ

మార్గాల్లో దర్శింపవచ్చును అనేది భారతీయ తత్త్వంలోని విశిష్ట లక్షణం. ఒక మార్గాన్ని అనుసరించేవారు ఇతర మార్గాలవారిని తిరస్కరిస్తారు.

ఆర్యులైన హిందువుయొక్క మౌలిక అవగాహన ప్రకారం తాత్వికమార్గాలన్నీ దైవం (సత్యం) నుండి దిగివచ్చినవే. దైవ సంకల్పం లేనిదే ఏ మార్గమూ పైకిరాదు. వచ్చినా మనలేదు. ఇలాంటి ఆరాధనా మార్గాలను గురించి దైవానికి లేని అభ్యం తరంగాని, పట్టింపులుగాని మానవులకు మాత్రం ఎందు కుండాలి? ఆయా వ్యక్తుల జీవసంస్కారాలను బట్టి ఎవరికి నచ్చిన మార్గాన్ని వారు స్వీకరించటం, అభిమానించటం జరుగు తుంది. అంత మాత్రంచేత అన్నిమార్గాలను కాదనటంగాని, విమర్శించటంగాని ఎంతమాత్రమూ తగదు. హిందూత్వంలోని ఈ విధమైన కలుపుగోలుతనం వల్లనే బౌద్ధ, జైన, జొరాష్ట్ర, క్రైస్తవ, ఇస్లాం మతాలను స్వాగతించటమూ, ఆదరించటమూ జరిగింది. అవగాహనలో మానవమనస్సులు సంకుచిత మవటం వల్ల ఏకపథంలోని వైవిధ్యం అంతగా రుచించటంలేదు. తమతమ మార్గాలను వ్యాప్తి చేసుకోవడానికి, ఇతర మార్గాలపై దండెత్తడానికి ఉద్యమస్ఫూర్తి (missionary zeal)తో పనిచేసే వారు అజ్ఞానులు. ఇతరుల యోగ్యతను గమనించడానికి, తగిన విధంగా వారిని ఆదరించి కలుపుకుపోవటానికి వీరు ఎంతగానో

ఎదగవలసి ఉంటుంది. ఈ ఎదుగుదల లేకపోతే మతముల మధ్య వైషమ్యమూ, పర్యవసానంగా ఘర్షణా తప్పదు. ఈ పవిత్రభూమిలోకి ఇస్లాం, క్రైస్తవ మతాలు ప్రవేశించకముందు కూడా ఈ గడ్డమీద శైవులకు, వైష్ణవులకు తీవ్రవిభేదాలు తలెత్తి, అవి కొన్ని సందర్భాల్లో ప్రాంతీయ యుద్ధాలకు దారితీసాయి. దైవవిశ్వాసాల పేరుతో యుద్ధాలు, రక్తపాతం జరగటమనేది మానవుల అజ్ఞానం ఎంతటిదో తెలియజేస్తుంది. మానవాళి అన్యమతముల వారిని ఆదరించటం నేర్చుకోకుండా వారిని వెలివేసినంత కాలమూ ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది.

మాస్టర్ ఇ.కె.గారు తన జీవితంలో ఇలాంటి సమన్వయాన్ని ప్రదర్శించి చూపారు. ఆయన విష్ణు ఆరాధనా మార్గాన్ని, శివారాధనా మార్గాన్ని కూడా ప్రోత్సహించారు. ఏ విధమైన పక్షపాతమూ లేకుండా ఈ రెండు మార్గాలకు చెందిన క్రతువులను నిర్వహించారు. 'నిత్యపూజావిధానం' పేరుతో చక్కని ఆరాధనాక్రమాన్ని అందించారు. అందులో పరబ్రహ్మము, శివుడు, విష్ణువు, ఆదిత్యుడు, శక్తి, గణపతులకు సంబంధించిన సమన్వయాత్మకమైన పూజావిధానం ఇచ్చారు. సాటి వైష్ణవులు తనను ఎంతగా విమర్శించినా ఆయన పట్టించుకోలేదు. ఆయన అలాంటి విమర్శలకు అతీతంగా జీవించారు. తన విధానాల విషయంలో ఎంతమాత్రమూ రాజీపడలేదు.

మాస్టర్ ఇ.కె.గారు తన ప్రవచనాల్లో తరచుగా బైబిలు పాత నిబంధనలు, క్రొత్త నిబంధనల నుండి కూడా ఎన్నో విషయాలను ప్రస్తావించేవారు. పాత నిబంధనల గ్రంథంలోని రహస్యాలు ఆయనకు తెలిసినంతగా ఈనాడు ఎవరికీ తెలియవు. 'స్పిరిచ్యువల్ సైకాలజీ' అనే గ్రంథంలో ఆయన ఇచ్చిన తొంభై మూడు ధ్యానములు పాత నిబంధనలపట్ల ఆయనకుగల గొప్ప పరిజ్ఞానాన్ని తెలియజేస్తాయి. ఆయనకు జీసస్ అంటే ఎంతో ఇష్టం. మాస్టరుగారి రచనలలో మనకు తరచుగా జీసస్‌యొక్క అంతర్గత జీవితము, వివిధకోణాలు దర్శనమిస్తాయి. మాస్టరు గారిచ్చిన ఈ క్రింది ధ్యానమంత్రము జీసస్‌పట్ల ఆయనకు గల పూజ్యభావాన్ని తెలియజేస్తుంది.

*"All names together utter the name of God. A prophecy thinks from darkness to light. Prophecy is fulfilled. Abraham, Moses, Isiah, Jacob put together form Jesus."*

*"సర్వ నామముల సమగ్రరూపమే దైవము. చీకటి నుండి వెలుగునకు కొనివచ్చునదే దివ్యవాక్కు. అబ్రహాము, మోజెస్, ఈశయ్య, జాకోబ్, జీససుగా కూడి గోచరింతురు."*

'స్పిరిచ్యువల్ ఎస్ట్రాలజీ'లో ఆయన 'వైట్‌రోబ్', 'టూ ఫిషెస్ అండ్ ది ఫైవ్ లోఫ్స్ ఆఫ్ బ్రెడ్', 'ది ఫిషర్ మాన్', 'ది

స్టార్ ఆఫ్ లైట్' వంటి విజ్ఞానానికి సంబంధించిన గాఢ సంకేతాలను ఎన్నింటినో ప్రస్తావించారు. ఆయనలో వేదవ్యాసమహర్షి నుండి జీసస్‌క్రీస్తు వరకుగల సార్వకాలిక గురువుల సమన్వయం ఉంది. భారతీయమూ, అభారతీయమూ అయిన ప్రతి ఆధ్యాత్మిక మార్గానికి సంబంధించి ఎన్నో పరిష్కారాలు, సమాధానాలు ఆయన దగ్గర ఉన్నాయి.

# 12

## మాస్టర్ ఇ.కె. వైశిష్ట్యం

**ఒ**క మహానుభావుని యొక్క జీవితాన్నీ, గుణగణాలను, చెప్పటం ఎంతో కష్టం. కానీ వానిలో ఏకొద్ది విశేషాలు చెప్పినా పాఠకునికి న్యాయం చేసినట్టవుతుంది. ఆసక్తి ఉన్న పాఠకులు అలా చెప్పబడిన గుణగణాల్లో ఏ కొన్నింటినైనా ఎంచుకుని ఆచరించే అవకాశం ఇచ్చినట్టవుతుంది గదా! అందువల్ల మాస్టరుగారిలోని కొన్ని విశిష్ట లక్షణాలను సంక్షిప్తంగానైనా ఇక్కడ ప్రస్తావించుకుందాం.

- అనిరాకరణము.
- బాహ్యాభ్యంతర శుచిత్వం.
- నిరంతర సాన్నిధ్యంలో ఉండటం (To be in the Presence).
- వ్యక్తిగత జీవిత సమస్యలందు ఉదాసీనత.
- వ్యక్తిగత ప్రయోజనాలు లేకపోవటం వల్ల కార్య పరిణామాల పట్ల ప్రభావితులు కాకపోవటం.
- అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో తటస్థ స్థితి.

- పవిత్రత, అపవిత్రల దృష్టి లేకపోవటం.
- దేనిగురించీ ఆరోపణగాని, అభ్యర్థనగాని లేకపోవుట.
- అన్ని పరిస్థితులలోను నిరాడంబరంగాను, సమభావంతోను ఉండటం.
- పరిసరాలవారి సామాజిక స్థితిగతులను పట్టించుకోకుండా ప్రేమను పంచటం.
- భౌతికమైన సుఖాలను, అసౌకర్యాలను పట్టించుకొనక పోవటం.
- కార్యాచరణలో అప్రమత్తత.
- మొహమాటంలేని విధేయత.
- నిర్లక్ష్యం వహించువారిపట్ల ఉదాసీనత.
- నిరాడంబరులపట్ల దాక్షిణ్యం.
- లౌక్యులపట్ల విముఖత్వం.
- ఆవేశపరులపట్ల తీవ్రత.
- సర్వదా సేవకు సంసిద్ధత.

# 13

## సాంఘిక విలువలు

పరిస్థితుల ఆవశ్యకతను బట్టి మాస్టర్ ఇ.కె.గారిలో ఒక్కొక్కసారి పోరాడే సైనికుడు కనిపించేవాడు. ఎవరయినా తనను బెదిరించడానికి గాని, ఒత్తిడి చేయాలనిగాని ప్రయత్నిస్తే ఆయన ప్రతిఘటించారు. సాధారణంగా ఎంతో విధేయంగా ఉండే ఆయన ఎవరయినా తనమీద పెత్తనం చేయాలనిగాని, దబాయించాలని గాని చూస్తే ఆయన హఠాత్తుగా వారిపై కోపం ప్రదర్శించేవారు. ఇతరులలోని పొగరుబోతుతనాన్ని తటస్థీకరించేందుకే ఆయన పొగరుబోతులా కనిపించేవారు. నిర్లక్ష్యంగాను, విముఖంగాను ఉండేవారిపట్ల కఠినంగా వ్యవహరించేవారు. అలాంటి సందర్భాల్లో ఆయన ఎలా ప్రవర్తించేవారో తెలుసుకోవడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. వాటిలో కొన్ని చూద్దాం.

### ఒక సన్నివేశం :

ఒకసారి మాస్టర్ ఇ.కె.గారు తనదగ్గర శిక్షణ పొందుతున్న ఒక యువకుని వివాహానికని ఒక దేవాలయానికి వెళ్ళారు. పెళ్ళితంతు సాగిపోతుండగా ఉన్నతస్థానంలో ఉన్న ఒక

రాజకీయ నాయకుని తాలూకు బిళ్ళబంట్రోతు ఒకడు మాస్టరు గారి దగ్గరకు వచ్చాడు. 'కృష్ణమాచార్యులు గారంటే మీరేనాండీ?' అని అడిగాడు. మాస్టరుగారు 'ఔనని' చెప్పారు. 'ఈ ప్రక్కనే ఉన్న గెస్ట్‌హౌస్‌లో మంత్రిగారు ఉన్నారు. ఆయన మిమ్ములను ఒకసారి రమ్మంటున్నారు. కారు తీసుకువచ్చాను. నాతో దయచేయండి' అన్నాడు ఆ బంట్రోతు.

'నే నిప్పుడు ఈ పెళ్ళి హడావిడిలో ఉన్నాను. నీతో మాట్లాడటం నాకిప్పుడు వీలుపడదు' అన్నారు మాస్టర్ ఇ.కె.

కొంతసేపటికి పెళ్ళితంతు ముగిసింది. మాస్టరుగారు ఖాళీగా కనిపించారు. బంట్రోతు ఆయనను సమీపించి 'తమరిప్పుడు దయచేస్తారా?' అని అడిగాడు.

'ఎక్కడికి రమ్మంటావ్?' అన్నారు మాస్టరుగారు.

'మినిష్టరుగారిని కలుసుకోవడానికి గెస్ట్‌హౌస్‌కండీ.' అన్నాడు బంట్రోతు.

'ఎందుకు?' అడిగారు మాస్టరుగారు.

'మంత్రిగారు ఏదో మీతో మాట్లాడాలట' చెప్పాడు బంట్రోతు.

'ఏ మంత్రి?' మాస్టరుగారు ప్రశ్నించారు.

'మున్సిపల్‌శాఖ సహాయ మంత్రిగారండీ' అన్నాడు బంట్రోతు.

'సహాయ మంత్రంటే?' మాస్టరుగారు అడిగారు.

'అదేమిటి బాబూ! సహాయ మంత్రంటే తెలియదా తమకు?' సేవకుడు నీళ్ళు నమిలాడు.

మాస్టరుగారు చిరునవ్వుతో ఇలా అన్నారు. 'అదికాదయ్యా. ఆయనా మామూలు మనిషేనా? లేక మంత్రి మాత్రమే నంటావా? ఇంతకీ నువ్వెవరివి?'

'నేను వారి నౌకరునండీ' అన్నాడు బంట్రోతు.

'అయితే నువ్వు మనిషివి కాదా? నౌకరువా? మీ మంత్రి గారు కూడా మనిషి కాదా? నేను మనుషులను కలవడానికి ఇష్టపడతాను, వారి బిరుదుల్ని కాదు. నీలో ఉండే నౌకర్నిగాక నిన్ను కలుసుకోవటం నాకిష్టం. మీ మినిష్టరుగారిని కలుసు కోవాలని నా కనిపించడంలేదు. అలాగన్నాని వారితో చెప్పు' అన్నారు మాస్టరుగారు.

'యూనివర్శిటీలో అధ్యాపకునిగా పనిచేసే ఒక సామాన్య వ్యక్తి ఒక స్టేట్ మినిష్టర్ స్వయంగా ఆహ్వానిస్తే తిరస్కరించడమా?' ఆ నౌకరు ఆశ్చర్యపోయాడు. ఒక గంటపాటు అలా ఎదురు చూస్తూనే ఉండిపోయాడు. ఈలోగా మాస్టరుగారు శాంతించారు. అతనితో ఇలా అన్నారు. 'రావయ్యా, రా. ఇలావచ్చి నాప్రక్కన కూర్చుని మంచి పెళ్ళిభోజనం తిందువుగాని. కాసేపు మీ మినిష్టరు గారిని మర్చిపో. ఆయనకు అంతగా నన్ను

చూడాలనిపిస్తే ఆయనే నా దగ్గరకు వస్తార్లే. ఆయనకోసం నేను గెస్ట్‌హౌస్‌కి రాను.'

ఆ సేవకుడు మొహమాటపడ్డాడు. మాస్టరుగారు పెళ్ళివారు చేయించిన కొన్ని స్వీట్సు తీసుకువెళ్ళి అతనికిచ్చి సాగనంపారు.

ఆ తరువాత మాస్టరుగారు తన సహచరులతో ఇలా అన్నారు. 'ఎవరో మినిష్టరయితే నాకేమిటి? అడుక్కుతినే వాడయితే నాకేమిటి? నాక్కావలిసింది మనిషి. మనిషి మనిషిగా వచ్చి అడిగితే వాడికోసం నేనేదైనా చేస్తాను. వాడు పశువులా ప్రవర్తిస్తే అందుకు తగ్గట్టుగానే నేనూ ఉంటాను'.

## రెండో సన్నివేశం :

ఒకసారి మాస్టర్ ఇ.కె.గారు రాధామాధవంలో తన గదిలో ఉండగా ఎవరో ఆయనకు ఫోన్ చేశారు.

"కృష్ణమాచార్లుగారేనా మాట్లాడేది"

"ఔనండీ"

"మావాళ్ళవి నాలుగు జాతకచక్రాలున్నాయి. అవి ఒకసారి మీరు చూడాలి. మా డ్రైవరుకిచ్చి పంపుతున్నాను. వాటిని ఒకసారి సరిచూసి సలహా ఇవ్వండి."

"ఇక్కడ జాతకాలు చూసేవాడెవరూ లేడండీ"

"కృష్ణమాచార్లుగారేనా మాట్లాడేది."

"అవును"

"మీరు జాతకచక్రాలు గుణించి చెప్తారని విన్నానే! మా జాతకాలు ఒకసారి మీరు చూడాలి."

"జాతకాలు చెప్పేవాళ్ళెవరూ ఇక్కడ లేరన్నానుగా..."

"అదేమిటండీ! జ్యోతిష్కులు కృష్ణమాచార్లుగారు కాదా నాతో మాట్లాడేది."

"మీరు మాట్లాడుతోంది నిస్సందేహంగా కృష్ణమాచార్లు తోనే. కానీ ఇక్కడ జ్యోతిష్కులంటూ ఎవరూ లేరు."

అప్పుడాగదిలో ఉన్న సహచరబృందం మాస్టరుగారి సమాధానాలు వింటూ వినోదించారు. మాస్టరుగారు వారితో ఇలా అన్నారు. "ఈ మాట్లాడినవాడు ఈ ఊళ్ళోని ఒక స్టార్ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్. అడ్డమైన ప్రతి గాడిదగాడి జాతక చక్రమూ చూడటానికే నేనిక్కడ ఉన్నాననుకుంటున్నాడు. సర్వ సామాన్యంగా సమాజంలో పెద్దస్థాయిలో ఉండి బాగా రాణిస్తున్న వాళ్ళు వాళ్ళవాళ్ళ స్థితులకు అర్హులు కారు. వాళ్ళాస్థితికి వచ్చింది వాళ్ళకున్న తెలివితేటలతో కాదు. వెనకెప్పుడో వాళ్ళు చేసుకున్న కొన్ని మంచిపనులు వాళ్ళనా స్థాయికి తెచ్చాయి. వాళ్ళలో చాలామందికి వివేకం (Commonsense) ఉండదు. సమాజంలో వాళ్ళువున్న స్థాయిని, రాజకీయాల్లోను, ప్రభుత్వం లోను వాళ్ళకున్న పలుకుబడిని అడ్డంపెట్టుకుని జనాలను భయపెడదా

మని చూస్తారు. మనుషులమని, మనుషులతో వ్యవహరిస్తున్నా మని మర్చిపోతారు. ఏంజేస్తాం, దురదృష్టం!"

ఒక నెలరోజుల పోయాక ఆ మేనేజింగ్ డైరెక్టర్ చేతులు జోడించుకుంటూ వచ్చి, తన తలబిరుసు ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకుని, తనకు, తన కుటుంబసభ్యులకు దారిచూపించ వలసిందని ప్రాధేయపడ్డాడు.

## మూడో సన్నివేశం :

ఒకసారి మాస్టరుగారు ఆంధ్రదేశంలో ప్రముఖ పట్టణమైన విజయవాడలో హోమియో తరగతులు నిర్వహించారు. పగలంతా తరగతులు, రాత్రిళ్ళు ఆధ్యాత్మిక ప్రవచనాలు– వీటికితోడు బాగా ప్రొద్దుపోయేవరకూ మందులిచ్చే కార్యక్రమం. ఒకరోజున రాత్రి పదిగంటలప్పుడు ఒక సరిక్రొత్త ఇంపోర్టెడ్ కారువచ్చి ప్రాంగణంలో ఆగింది. దానిలోనుంచి సూటు బూటుతో ఉన్న ఓ వ్యక్తి దిగాడు. అతడు తిన్నగా నడుచుకుంటూవచ్చి మాస్టరు గారి ముందు నిలబడ్డాడు. మాస్టరుగారు అతనికేసి చూసి వచ్చిన పనేమిటని అడిగారు. అతనెవరో మాస్టరుగారికి తెలియదు. ఆ వ్యక్తి తనను తాను ఇలా పరిచయం చేసుకున్నాడు.

"నేను మన రాష్ట్రంలో నెంబర్‌వన్ పారిశ్రామికవేత్త అయిన శ్రీ...... గారి అల్లుడిని."

"అయితే ఏమిటి?" అడిగారు మాస్టరుగారు.

"మా అత్తగారు హైదరాబాదులో చాలా జబ్బుపడి ఉన్నారు. అల్లోపతీ వైద్యులు మరింక తాము ఏమీ చేయలేని స్థితికి వ్యాధి ముదిరిపోయిందని చెప్పారు. మా మామగారి స్నేహితు లొకాయన మీరు హోమియోపతీ ద్వారా ఎలాంటి వ్యాధినైనా తగ్గించగలరని చెప్పారు. అందుకని మా అత్తగారికి సరైనమందు వేసేందుకని ఈ రాత్రికి మిమ్మల్ని నా కారులో హైదరాబాదు తీసుకువెళ్ళటానికి నేరుగా వచ్చాను."

"ఇక్కడ నాకు శిక్షణా తరగతులు ఉన్నాయికదా! నీకోసమని వందమందిని ఎలా నిరుత్సాహ పరుస్తాను చెప్పు. నా వైద్యం కావాలనుకుంటే మీ అత్తగారినే ఇక్కడికి తీసుకు రావలసింది."

"అలాకాదండీ. మీరే హైదరాబాదు వచ్చి ఆమెకు వైద్యం చేస్తే బాగుంటుందని మా మామగారు అనుకుంటున్నారు. బహుశా మీకాయన తెలిసే ఉంటారు."

"నాకు తెలియదులే."

"ఆయన చాలా పెద్ద పారిశ్రామికవేత్త. ఆయనకు ఎంతో అధికారమూ, పలుకుబడీ ఉన్నాయి. మీరు నిర్వహించే కార్యక్రమాలకు ఆయన మీకు ఎంతగానో ఉపయోగపడగలరు."

"నాకు ఎవ్వరినుండీ ఏవిధమైన సహాయమూ అక్కరలేదు. నాకు కావలసిన సహాయం నేను అడక్కుండానే వస్తుంది. నా సహాయం కోసం వచ్చి నాకు సహాయం చేయగల స్థితిలో

ఉన్నానంటావేమిటి? నువ్వుగానీ, మీ మామగారు గానీ నాకు సాయం చేయగలిగేంత స్థితిలో లేరు. నావల్ల ఉపకారం పొంద దలిస్తే మీ అత్తగారినే ఇక్కడకు తీసుకురా. నేనిలా సలహా చెప్పానని మీ మామగారితో చెప్పు. ఆయనేదో పెద్ద వ్యాపారవేత్త, ఎదురులేని పారిశ్రామికవేత్త అన్నావు కనుక నేను చెప్పానని ఈ మాటలు కూడా చెప్పు. వ్యాపారస్తులకు తమ పనులు ఎలా సాధించుకోవాలో బాగా తెలుస్తుంది. వాళ్ళకేదైనా సహాయం కావలసివస్తే వాళ్ళు నిస్సంకోచంగా ఎక్కడికైనా వెడతారు. ఎవరికైనా వాళ్ళవల్ల సహాయం అవసరమైతే వారిని ఎంతసేపైనా నిరీక్షింపజేస్తారు. మీ మామగారు గనుక మంచి వ్యాపారవేత్త అయితే లాభంకోసం నా దగ్గరకి రావాలి అని తెలుసుకోవాలి. కుదరదంటే ఇక్కడితో మరింక ఈ వ్యవహారాన్ని వదులుకోవచ్చు."

మాస్టరుగారు తెగేసి అలా చెప్పినందుకు ఆ అల్లుడు ఆశ్చర్యపోయాడు.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు. మా మామగారికి నే నేమని చెప్పాలి" అని అడిగాడు.

"మనమధ్య జరిగిన సంభాషణంతా చెప్పవయ్యా. దానికేముంది– మరోమాట కూడా చెప్పు. తన భార్యకి నానుండి మందు కావాలంటే ఆయన స్వయంగా రావాలి. అది భార్యపట్ల ప్రేమ ఉన్నవాడు చూపవలసిన కనీస బాధ్యత. అనవసరంగా నీ టైమెందుకు పాడుచేసుకుంటావు. అసలే నువ్వు వ్యాపారవేత్తవి.

టైమంటే డబ్బేగదా నీ దృష్టిలో. నేను చెప్పాల్సింది చెప్పాను" అన్నారు మాస్టరుగారు.

ఆ వ్యక్తి అక్కడినుంచి వెళ్ళిపోయాడు. ఆ మరునాడు మధ్యాహ్నం ఆ వ్యాపారవేత్తనుండి మాస్టరుగారికి ఫోను వచ్చింది. ఆయన జరిగినదానికి క్షమించమని పదేపదే వేడుకున్నాడు. భోరుమని ఏడుస్తూ ఎలాగైనా తన భార్యకు నయం చేయమని మాస్టరుగారిని వేడుకున్నాడు. మాస్టరుగారు గనుక సమ్మతిస్తే అప్పటికప్పుడు తన భార్యను తీసుకువస్తానని చెప్పాడు. మాస్టరు గారు చల్లబడ్డారు. ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఆ వ్యాపారవేత్తతో మాస్టరుగారు ఇలా అన్నారు.

"ఈమాత్రం చాలు. నేను కల్పించుకోవడానికి మీరు చేయవలసిన కనీస కర్తవ్యం మీరు ఇప్పటికి చేశారు. మీరు ఇంతదూరం రానవసరం లేదు. మిమ్మల్ని మీరు సంబాళించుకుని మీ భార్యతాలూకు అనారోగ్య లక్షణాలేమిటో వివరంగా నాకు చెప్పండి."

ఆ వ్యాపారవేత్త వ్యాధి లక్షణాలన్నీ ఏకరువు పెట్టాడు. మాస్టరుగారు ఏమందు వేయాలో చెప్పి "ఇరవైనాలుగ్గంటలు పోయాక ఎలావుందో మళ్ళీ నాకు చెప్పండి" అన్నారు.

ఇరవైనాలుగ్గంటలు దాటగానే ఆ వ్యాపారవేత్త సంతోషంతో ఫోను చేశాడు. తన భార్య వ్యాధి తీవ్రతనుండి కోలుకుందని

చెప్పి, ఇంకా ఏమైనా మందులు వేయాలా అని అడిగాడు. "ఇంతకు ముందు వేసిన ఒక్క మోతాదూ వ్యాధిని మొత్తంగా తగ్గిస్తుంది. కోలుకోవటం ఆగిపోయింది అనిపించేవరకూ మీరు నాకు ఫోను చేయనవసరం లేదు" అన్నారు మాస్టరుగారు. ఆ వ్యాపారవేత్త వైద్యానికి మీకు ఏమివ్వమంటారు? అని అడిగాడు. మాస్టరుగారు ఏమీ ఇవ్వనవసరం లేదని చెప్పారు. "ఒక్కటి గుర్తుపెట్టుకోండి, నేను ఎవరిదగ్గరా జీతగాణ్ణి కాదు" అనికూడా చెప్పారు. కొన్ని రోజుల తరువాత ఆ వ్యాపారవేత్త విశాఖపట్టణం వచ్చి మాస్టరు గారిని సందర్శించినప్పుడు, 'నేను మీకు ఏవిధంగా నైనా సాయపడగలనా?' అని మళ్ళీ అడిగాడు. 'నా సంగతి సరే. మీ సాయం సంగతి మీరు చూసుకోండి. అది మీకెంతో అవసరం' అన్నారు మాస్టరుగారు. ఆ వ్యాపారవేత్త మాస్టరుగారి మాటలను గ్రహించ లేకపోయాడు. అనతికాలంలోనే ఆయనకు ఎన్నో సమస్యలు వచ్చాయి. పరువు, ప్రతిష్ఠ మొదలైనవన్నీ దిగజారిపోయాయి. సమాజంలోని తలబిరుసు మనుషులతో మాస్టరుగారు వ్యవహరించే కఠినమైన తీరు అలా ఉండేది. పేదలపట్ల, ఆర్తులపట్ల ఆయన ఎంతో కలుపుగోలుగాను, సానుభూతితోను వ్యవహరించేవారు.

## నాలుగో సన్నివేశం :

ఒకసారి అర్థరాత్రి సమయంలో, ఒక పేదవాడు విషజ్వరం తోటి బాధపడుతున్నాడనీ, అతని కుటుంబమంతా

నిస్సహాయంగా ఏడుస్తున్నారనీ మాస్టరుగారికి తెలిసింది. ఆయన వెంటనే మంచంమీదనుంచి లేచారు. తనదగ్గర ఉండేవాళ్ళలో ఒకరితో స్కూటరు బయటకు తీయమన్నారు. వెనక ఎక్కి కూర్చున్నారు. స్కూటరు తిన్నగా ఆ పేదవాని గుడిసెముందు ఆగింది. అతనికి మందువేసి, తెల్లవారేవరకు అక్కడే ఉండి, ఆ వ్యక్తికి జ్వరంతగ్గి స్పృహలోకి రాగానే బయలుదేరి వచ్చేశారు.

మాస్టరుగారు ఏవిధమైన సంకోచం లేకుండా అంటు వ్యాధులు ప్రబలినచోట్లకు కూడా వెళ్ళి మందులిచ్చేవారు. ఆ వ్యాధులు తనకు సోకుతాయనే భయం ఆయనకుండేది కాదు.

## ఐదో సన్నివేశం :

ఒకసారి, ఒక ఆదివారం ఉదయం మాస్టరుగారు తన హోమియో మందుల పెట్టెతో బస్టాండులో నిరీక్షిస్తూ ఉన్నారు. యూనివర్శిటీలో పనిచేస్తున్న ఒక ప్రొఫెసరుగారు స్కూటరుమీద అటుగా వెడుతూ మాస్టరుగారిని చూశారు. 'ఎక్కడికి వెళ్ళాలో దిగబెడతాను. వస్తారా?' అని అడిగాడాయన. 'మీకు వీలవు తుందా?' అన్నారు మాస్టరుగారు. 'దానికేం, మీరీపూట ఎక్కడ మందులివ్వాలో అక్కడ దిగబెడతాను' అన్నారా ప్రొఫెసరుగారు. 'సరే, పదండి' అంటూ స్కూటరు వెనుక ఎక్కారు మాస్టరుగారు. ఎక్కడికి వెళ్ళాలో చెప్పారు. స్కూటరు ఐదు కిలోమీటర్లు ముందుకు సాగింది. మాస్టరుగారు 'ఇక్కడ ఆపండి' అని ఆపించి దిగిపోయారు. "మీకు శ్రమ ఇచ్చాను. థాంక్స్, మీరింక తిరిగి

వెళ్ళిపోవచ్చు. ఇంకా పైకి వెళ్ళాలిగాని, మీరు రాలేరు. ఇక్కడొక అంటురోగికి వైద్యం చేయడానికని వచ్చాను. అంటువ్యాధులు సోకకుండా ఉండాలంటే గొప్ప సంకల్పబలం ఉండాలి. కనుక మీరు వెళ్ళిపొండి. నేను నడిచి వెళ్ళిపోతాను. పని చూసుకుని ఏదోలా వచ్చేస్తానులెండి" అన్నారు మాస్టరుగారు. అప్పుడు సమయం ఉదయం ఆరున్నర. ఆ ప్రొఫెసరుగారు మాస్టరుగారిని దింపి యూనివర్శిటీలో ఫేకల్టీ క్లబ్‌కు చేరుకుని టెన్నిస్ ఆడుతూ ఆ పూటంతా కాలక్షేపం చేశారు. మళ్ళీ సాయంత్రం ఆయన కాలక్షేపానికి క్లబ్‌కు వెళ్ళి రాత్రి పదిగంటలప్రాంతంలో ఇంటికి తిరిగివస్తూ దారిలో ప్రశాంతంగా నడుచుకుంటూ వస్తున్న మాస్టరుగారిని చూశారు. 'ఏమండీ, ఇప్పుడు తిరిగివస్తున్నారా?' అని అడిగారాయన. 'అవునండీ' అంటూ మాస్టరుగారు ఇంట్లోకి వెళ్ళిపోయారు.

మందులివ్వటం విషయానికి వచ్చేసరికి చాలాసార్లు మాస్టరుగారు ఆహారం, నిద్రా కూడా పట్టించుకోకుండా అదే ధ్యాసతో ఎన్నిగంటలైనా ఉండిపోయేవారు. పేదలపట్ల, ఆర్తుల పట్ల, బాధితులపట్ల మాస్టరుగారికి గల అంకితభావం అలాంటిది.

# 14

## గాయత్రి - వేదాలు

స్త్రీలు వేదాలు చదవకూడదని ఎంతోకాలంగా ఉన్న నిబంధనను మాస్టర్ ఇ.కె.గారు తొలగించారు. సంప్రదాయం ప్రకారం స్త్రీలు, శూద్రులు గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించ కూడదు. మాస్టర్ ఇ.కె.గారు వేదాలుగాని, మనుధర్మశాస్త్రంగాని స్త్రీలు, శూద్రులు వేదాలూ, గాయత్రీ మంత్రమూ చదవటాన్ని నిషేధించ లేదని చెప్పారు. అలాంటి నిషేధం ఏ గ్రంథాలలో ఉందో ఆధారాలు చూపించవలసిందిగా ఆయన పండితులకు ఎదురు ప్రశ్నలు వేసేవారు. ఆయన ఈ విధంగా చాటిచెప్పారు. **"మనలోని జ్యోతి రూపమైన చైతన్యం ఏదైతే ఉందో అదే గాయత్రీ తేజస్సు. ఆత్మవిజ్ఞానమే వేదవిజ్ఞానం. మానవులందరి లోను ఒకేవిధమైన ఆత్మ, చైతన్యము ఉంటాయి. కాబట్టి పుట్టుక చేత ప్రతివ్యక్తికీ వేదాలను, గాయత్రిని చదువుకొని, గానంచేసి ఆచరణలో పెట్టుకునే అర్హత ఉంది. పూర్వకాలంలో చాలామంది ఋషులలో ఈ విధమైన ఆచారం ఉండేది."** ఇందుకు మాస్టరుగారు నిదర్శనాలు కూడా చూపించారు. మత ఛాందస వాదులు ఆయనపట్ల ఆగ్రహించి, ఆయనతో విభేదించి, ఆయనను

తిరస్కరించారు. అయినప్పటికీ గత కొద్ది దశాబ్దాలుగా భారత దేశంలోను, విదేశాలలోను కూడా మాస్టరుగారి దృక్పథంవంటి దృక్పథం బలపడుతుండటంవల్ల గాయత్రీమంత్రం ప్రపంచ మంతటా బహుళప్రచారం పొందుతోంది. ఈనాడు విదేశాలలో కూడా వేలసంఖ్యలో కాకపోయినా వందల సంఖ్యలోనైనా ఎన్నో బృందాలవారు ఆత్మవికాసం కోసమూ, మానవాళి వికాసం కోసమూ గాయత్రీ మంత్రాన్ని గానం చేస్తున్నారు. భూగోళ మంతటా గాయత్రీ మహామంత్రం తాలూకు ఎన్నో ఆడియో కేసెట్లు విస్తరించాయి.

మాస్టర్ ఇ.కె.గారు వైదిక క్రతువులకు సంబంధించిన అట్టహాసాలకు కూడా అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. బాహ్యా భ్యంతర శుచి కలిగి, ఉతికిన బట్టలు ధరించి, శాకాహారం భుజిస్తున్న వారెవరైనా సరే రుద్రాభిషేకము, హోమము, వేదపఠనము వంటి క్రతువులను నిర్వహించటానికి అర్హులే అని మాస్టరుగారి అభిప్రాయము. వేదపఠనానికి సంబంధించి స్వరం సరిగా ఉంటే చాలునని, కులానికి సంబంధించిన అర్హతతో పనిలేదని ఆయన చెప్పేవారు.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన 'చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్......' అనే మాటలు తరచుగా తప్పుగా అన్వయిస్తూ, తప్పుగా ఉదహరిస్తుంటామని కూడా మాస్టరుగారు

చెప్పారు. వేదకాలంనుండీ కూడా మానవాళి గుణకర్మలనుబట్టి విభాగింపబడిందే గాని పుట్టుకనుబట్టి కాదు. జ్ఞానము, ధార్మిక జీవనము, సత్యనిష్ఠ, ప్రశాంతజీవనముల పట్ల ఆసక్తి గలవారు బ్రాహ్మణులుగా పరిగణింపబడతారు. యుద్ధవిద్యలు, ఇతరులను రక్షించుట, జనసమూహాల ప్రాణరక్షణ కోసం ఆత్మత్యాగానికి సిద్ధపడుట అనే లక్షణాలుగల మరొకవర్గంవారు క్షత్రియులుగా పరిగణింపబడతారు. మూడోవర్గంవారు వైశ్యులు. వీరు సర్వజన సంక్షేమం కోరి ప్రకృతి ప్రసాదించిన సంపదలు సద్వినియోగం అయ్యేటట్లు, వినిమయం జరిగేటట్లు చేస్తారు. జ్ఞానసముపార్జనకు తగిన అవగాహనగాని, తమ ప్రాణాలను పణంగాపెట్టి ఇతరులను రక్షించేటంతటి ధైర్యసాహసాలుగాని, ప్రకృతి సంపదలను సద్వినియోగపరచే సామర్థ్యంగాని లేని తక్కిన మానవులను శూద్రులు అనే నాలుగవ వర్గంగా చెప్పారు. గుణకర్మలను బట్టి సమాజ ప్రయోజనంకోసం ఈ విభాగం చేయబడినా అందరూ మానవులే. ఎక్కువ ప్రతిభ కలవారు తమకంటే తక్కువ ప్రతిభావంతులైన వారిపట్ల బాధ్యతపడాలి. అలాగే తక్కువ ప్రతిభ గలవారు తక్కినవారిపట్ల గౌరవభావం కలిగి ఉండాలి. ఇది మానవ కుటుంబంలోని ఒక సహజసిద్ధమైన, పరంపరాగతమైన విధానం. చాతుర్వర్ణ్య వ్యవస్థ అంత పటిష్ఠమైనదీ కాదు, పుట్టుకచేత నిర్ణయింపబడేదీ కాదు. గీతాచార్యుడు

చెప్పినట్లుగా అది గుణకర్మలకు సంబంధించినదే. మాస్టర్ ఇ.కె.గారు భగవద్గీతలోని ఆ శ్లోకాన్ని పదేపదే ఉదహరిస్తూ ఉండేవారు. అంతే కాక వేదవిజ్ఞానాన్ని, గాయత్రీ మంత్రాన్ని ఆసక్తిగల వారందరికీ అందించారు. అలాగని ఎదుటివారి అభిరుచులను పట్టించుకోకుండా అందరికీ వాటిని బోధించేవారు కాదు. అందుకు సంబంధించిన భగవద్గీతలో జ్ఞానయోగంలోని పదమూడో శ్లోకం ఒకసారి చూద్దాం.

***'చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।***
***తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥***

*(నా ప్రకృతిలోని త్రిగుణములు జీవులలో పరస్పర సమ్మిశ్రములుగా స్వభావములు పుట్టుచున్నవి. ఈ కలయికలు కోటానుకోట్లుగా రూపొంది వ్యక్తిగత స్వభావములు అగుచున్నవి. అందు సకల మానవులు, స్వభావముల సమీకరణముచే నాలుగు వర్గములుగ ఏర్పడుచున్నారు. వారే జ్ఞానార్జన చేయు బ్రాహ్మణులు; రక్షణ స్వభావముగల క్షత్రియులు; వినియోగ, వినిమయ స్వభావ ములు గల వైశ్యులు; కర్మాచరణ స్వభావము గల శూద్రులు అగుచున్నారు. ఈ నాలుగు ధర్మములలో వారిని వారే విభజించు కొనుచున్నారు. అనగా నేనే వారి ప్రకృతిగా ఇట్లు విభజించు చున్నాను. వారిలో ప్రకృతి కతీతుడుగా ఆత్మస్వరూపుడనై యుండి ఈ విభజన కతీతుడనుగా నున్నాను. అనగా ఈ విభజనము*

*చేయనివాడుగ కూడ నున్నాను. – 'మంత్రగీత' – కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య.)*

మాస్టరుగారు వైదికాచారములలోని ప్రధానాంశాలను రాజీలేని విధంగా అనుసరించేవారు. అప్రధాన విషయాల గురించి అంతగా పట్టించుకునేవారు కాదు. ఆయన ప్రకారం మాన్యుడైన వేదవేత్త సూర్యోదయానికంటే చాలా ముందుగా లేవాలి. ఉషోదయ మయ్యేసరికి ప్రార్థన, పూజలను పూర్తి చేయాలి. బ్రాహ్మీ ముహూర్తమున నాలుగు గంటలకు ప్రారంభించి ఒక గంట సమయంలో ప్రార్థన, ధ్యానం మొదలైన వాటిని ముగించుకోవాలి. ఆలస్యంగా లేచేవారిని, ప్రాతఃకార్యాలు చేయనివారిని మాస్టరుగారు మందలించేవారు. ఆయనకు బద్ధకమంటే నచ్చేదికాదు. బద్ధకస్తులు ఆయనదగ్గర ఉండలేక పోయేవారు. ఆయన ఎప్పుడూ శారీరకం గాను, మానసికంగాను ఎంతో శుభ్రంగా ఉండేవారు. నిత్యమూ శుభ్రమైన వస్త్రములు ధరించేవారు.

## మాస్టరు ఇ.కె.గారిలో కనిపించే మరికొన్ని ప్రత్యేకతలు:

మాస్టరుగారు మితంగా భుజించేవారు. రుచులను పట్టించుకునేవారు. దానిగురించి ఆయనిలా చెప్పేవారు. **"వ్యక్తికి జీవితంలో రుచి అనేది ఎంతో ముఖ్యం. జీవితానికి సంబంధిం**

**చిన అన్ని కార్యకలాపాల్లోను రుచి అనేది ముఖ్యమైనది. గుణాత్మ కతకు సంబంధించి సర్వోత్తమంగా ఉండటం అనేదానిపట్ల మనిషికి గల ప్రాధాన్యాన్ని అది తెలియజేస్తుంది."** అలాగని అతిగా తినటమూ ఆయన ఇష్టపడేవారు కాదు. చిన్న కునుకు తీయడం తప్పించి పగటినిద్రను కూడా ఆయన ఇష్టపడేవారు కాదు. జీవితానికి హాస్యం ఎంతో ముఖ్యమని ఆయన చెబుతుండే వారు. దానివల్ల జనం చురుకుగానూ, చలాకీగాను ఉంటారు. ఆయన చరచరా సాగిపోతుండేవారు. ఆయన ఉన్నచోటల్లా ఎప్పుడూ ఎంతో సందడిగా ఉండేది. ఎంతటి కార్యభారంతో ఉన్నా ఆయన ప్రశాంతంగా ఉండేవారు. ఆయన పనిచేస్తుంటే చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండేది. **"ఆచార్యులు అంటే ఆదర్శప్రాయులు అని అర్థం. ఇతరులకు ఆదర్శప్రాయులుగా ఉండటానికి తగిన శీలసంపదలను ప్రతివ్యక్తీ పెంపొందించు కోవాలి. ఆచరించి చూపించటమనేది ప్రబోధ పద్ధతులలో ఉత్తమమైనది"** అని మాస్టరుగారు చెబుతుండేవారు. జీవితం లోని ప్రతి రంగంలోను ఆ విధమైన ఆచార్యకత్వాన్ని ఆయన ఆశించేవారు.

మహానుభావులు (Initiate) అందరివలెనే మాస్టరుగారు కూడా పాకశాస్త్ర ప్రవీణులు. ఆయన రకరకాల వంటకాలు చేసేవారు. అనుభవజ్ఞురాలైన గృహిణికూడా ఆయన పాకకళా ప్రావీణ్యాన్ని మెచ్చుకునితీరేది.

దోషదృష్టితో చూసేవారిని దూరంగా ఉంచిన ఆయనలోని మరోవిశేషం ధూమపానాభ్యాసం. భారతీయుల మనస్తత్వానికి జ్ఞానసిద్ధుడైనవాడు ధూమపానం చేయటమనేది మహాపచారం. అలాంటి విషయాన్ని వారు ఎంతమాత్రమూ ఒప్పుకోరు. అయినాసరే మాస్టరుగారు సిగరెట్లు కాల్చేవారు. వ్యక్తులను పైపైన గమనించి అంచనావేసే వారు మాస్టరుగారిలో కనిపించే ఎన్నో సంప్రదాయ విరుద్ధమైన పద్ధతులను చూసి ఆయనకు దగ్గర కాలేక పోయేవారు. వాటిలో ఈ సిగరెట్ల అలవాటు మరీను. ఆయనకు చాలామంది దూరమవటానికి గల కారణాల్లో అది ముఖ్యమైనది. ఇందుకు మాస్టరుగారిలా చెప్పేవారు. **"నన్ను వాళ్ళు వదిలెయ్యటం కాదు. నేనే వాళ్ళని వదిలేశాను. నా చుట్టూ సంకుచితమైన దృష్టులు కలవారు చేరటం నాకిష్టంలేదు. దానివల్ల నా కాలం వృథా అవుతుంది. నాకు నా సమయం ఎంతో విలువైంది. ఏదైనా ఒక విషయం ఉంటే దానిని మరో కోణంనుంచి చూడాలి. మీలో చాలామంది నన్ను, మీకివ్వబడిన పనిని తప్పించుకు తిరుగుతుంటారు. అదేదో బాగానే వదిలించు కున్నాం అనుకోకండి. ప్రస్తుతానికి మీకున్న సామర్థ్యం మీకివ్వ బడిన పనికి తగినట్లుగా లేదు కనుక తాత్కాలికంగా నేనే మిమ్మల్ని దూరంగా ఉంచుతున్నాను. విలువల గురించి మీరు పట్టించుకోనప్పుడు ఆ విలువలు కూడా మీ గురించి పట్టించుకో**

**వని తెలుసుకోండి. మీరు తిరస్కరించినది మిమ్మల్ని తిరస్కరించి నట్లు లెక్క."** మాస్టరుగారి వీరోచిత దృష్టి అలాంటిది! సమాజం లోని చాలామందికి ఆయనొక అర్థం కాని వ్యక్తిగా ఉండి పోయారు. కానీ ఆయనవల్ల సహాయం పొందినవారి హృదయా ల్లోను, ఆయన బోధించే జ్ఞానమార్గాన్ని ఆచరణలో పెడుతున్న వారి హృదయాల్లోను మాత్రం ఆయన ఎప్పటికీ ఒక దివ్యమూర్తే !

# 15

## కొన్ని ఆధ్యాత్మిక కోణాలు

**మా**స్టర్ ఇ.కె.గారు సామాన్యుల్లో అసామాన్యులైనప్పటికీ పైకిమాత్రం సాధారణ వ్యక్తిగానే ఉండేవారు. మహానుభావులైన వారు మామూలు మనిషిలా, నిరాడంబరంగా, గోప్యంగా ఉండట మనేది అరుదైన విషయం. ఆయన మట్టిలో మాణిక్యంలాంటి వారు. దుమ్ముకొట్టుకుని గులకరాళ్ళమధ్య పడివుండే మాణిక్యాన్ని గుర్తించటం కష్టం. ఎంతో జాగ్రత్తగా పరిశీలిస్తేగాని దాన్ని గుర్తించలేం. ఆయన తనలోని దివ్యత్వపు లక్షణాలను ఎంతో అవసరపడినప్పుడుగాని ప్రదర్శించలేదు. ప్రజల దృష్టి నాకర్షించ టానికిగాని, పదిమందిచే గుర్తింపబడి, పూజింపబడటానికిగాని ఆయన ఏనాడూ వాటిని ప్రదర్శించలేదు. ఆయన సందేశం–

**"వెర్రి భక్తితో కలలు గనుచుండు భక్తులచే వేరొక అవతారమూర్తిగా ఆరాధింపబడుటకు కాదు నేను దిగివచ్చినది. కార్యకర్తలు తమ కర్తవ్యసిద్ధిలో నన్ను దర్శింపవలెను. మీలో నుండి మీ గురువుగా వ్యక్తమైన మీరే నేను. మీ గురువుకన్న మీరు వేరుకాదని గుర్తుంచుకొనుడు. ఎట్లు చూచినను మీ గురువు కన్న మీరు భిన్నము కాదు. మీలో నున్న 'నేను' అను ప్రజ్ఞకన్న భిన్నమైన దేదియు లేదు. ప్రాక్పశ్చిమములు 'నాలో' సమ్మిళిత మగుగాక !**

**ఈ నేను అందరిలో నున్నాను. మీరు చిరకాలము జీవింతురు గాక ! నిత్య కర్మాచరణశీలురై యుందురు గాక ! మీలో నన్ను దర్శింతురు గాక !"**

తమని తాము మహానుభావునిగా చాటుకోవాలనుకునే గురువులు తమతమ ఆధ్యాత్మిక శక్తులను ప్రదర్శించాలని కుతూహల పడుతుంటారు. ఆర్య సంప్రదాయానుసారం అలాంటి వారు పరిపూర్ణులు కారు. అసమగ్రులే. వారు ఇంకా తమ వ్యక్తిత్వాన్ని పట్టుకుని ప్రాకులాడుతున్నట్టే. వ్యక్తిత్వం పూర్తిగా జారిపోవడమనేది సద్గురువు యొక్క లక్షణం. మాస్టరుగారు తమను గురించి ఎవరికీ పూర్తిగా తెలియనిచ్చేవారు కాదు. తమలోని ఆధ్యాత్మిక శక్తులను బహిరంగంగా ప్రదర్శించేవారు కాదు. ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలగినవారికి మాత్రమే ఆయనలోని దివ్యత్వం తెలిసేది. మాస్టరుగారి దివ్యత్వానికి సంబంధించి కొన్ని సన్నివేశాలు చూద్దాం.

❊ ❊ ❊

తల్లి, అన్నదమ్ములు గల ఒక కుటుంబం ఉండేది. ఒకసారి ఆ సోదరులలో ఒకడు ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళి పోయాడు. ఎంత వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. వేసారి పోయిన ఆ కుటుంబంవారు మాస్టరుగారి దగ్గరకు వచ్చి, అతడి ఆచూకీ తెలుపమని అర్థించారు. మాస్టరుగారు ఒక్కక్షణం కళ్ళు మూసుకుని తెరిచి ఇలా అన్నారు. "మీవాడు క్షేమంగానే

ఉన్నాడు. దక్షిణదిశగా పోతున్నాడు. వాడు తన ముక్తికోసమని గురువును అన్వేషిస్తున్నాడు. ఇంక ముందుకు వెళ్ళడు. వెనక్కి వచ్చెయ్యమని ఆదేశించాను. రాబోయే రైల్లో బయలుదేరి విశాఖపట్టణం చేరుకుంటాడు. అతనికున్న అవరోధాల పరిష్కారం కోసం నా దగ్గరికి రావలసిందని కూడా సూచించాను. రేపు మధ్యాహ్నానికల్లా ఇక్కడికి చేరుకుంటాడు. తిన్నగా మాయింటికే వస్తాడు. కొన్ని రోజులపాటు నా దగ్గర ఉండనివ్వండి. ఆ తరువాత నేనే అతన్ని ఇంటికి పంపుతాను. ఇంక ఆపైన ఎప్పుడూ అలా పారిపోడు." మాస్టరుగారు అంత కచ్చితంగా చెప్పటం ఆ కుటుంబంవారికి ఎంతో ఆశ్చర్యం కలిగించింది. మాస్టరుగారు చెప్పినట్లే అతడు తిరిగివచ్చాడు. కొద్దిరోజులు మాస్టరుగారితో గడిపి, ఇంటికి తిరిగివెళ్ళాడు. ఇంటిలోనివారు ఆతనిని 'ఎందుకు వెళ్ళిపోయావు? ఎలా తిరిగివచ్చావు?' అని అడిగారు. 'నా కా క్షణంలో మాస్టరుగారు దర్శనమిచ్చి వెనక్కి తిరిగిరమ్మని ఆదేశించినట్లుగా దర్శన మయ్యింది. నీవు కోరిన విధంగా నేను నడిపిస్తాను కదా ! అని మాస్టరుగారు చెప్పి నట్లయింది' అని చెప్పాడు. ఆనాటినుంచి ఆ కుటుంబంవారంతా మాస్టరుగారికి అంకితమయ్యారు.

❊ ❊ ❊

మాస్టరుగారు యూనివర్శిటీలో పనిచేస్తున్నప్పుడు ఒకసారి విద్యార్థులతో కలిసి పిక్నిక్కుకు వెళ్ళారు. ఆ బృందంలో ముప్పది మంది విద్యార్థులు ఉన్నారు. మాస్టరుగారు నవ్విస్తూ వారితో

చాలా సరదాగా గడిపారు. వారికోసం మేజిక్ కూడా చేశారు (మాస్టరుగారు స్కూల్ ఆఫ్ మేజిక్‌లో సభ్యులు కూడా!). దానితో విద్యార్థులందరూ మాస్టరుగారికి ఆకర్షితులయ్యారు. వారందరూ తమ అరిచేతులను మాస్టరుగారికి చూపించుకుని భవిష్యత్తును చెప్పించుకోవాలని ఉత్సాహపడ్డారు. మాస్టరుగారు ఒక్కొక్కరి చెయ్యి చూసి, చెప్పటం మొదలుపెట్టారు. ఒక విద్యార్థి చేతిని పట్టుకోగానే అది చల్లగా ఉన్నట్లనిపించింది. మాస్టరుగారు ఒకసారి అతని కళ్ళలోకి చూశారు. పెద్దపెద్ద కళ్ళు. అతడు కిమ్మనకుండా ఉన్నాడు. “ఈ కుర్రవాడు సేవ చెయ్యటంకోసం పుట్టాడు. పేదవర్గాలవారికి ఇతడెంతగానో సేవ చేస్తాడు. పతితుల్ని, భ్రష్టుల్ని, ఉత్తేజపరచడం ఇతని కార్యరంగం. వారికతడు మార్గదర్శకు డవుతాడు. ఇతనికి మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయి” అని చెప్పారు మాస్టరుగారు. ఆ కుర్రవాడు నిర్లిప్తంగా చూసి, అవన్నీ జరిగేవికావులే అన్నట్టుగా ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు. సాయంత్రం పిక్నిక్ ముగించుకుని ఆ బృందం గృహోన్ముఖమైంది. బస్సు ముందుకు సాగుతుంటే విద్యార్థులు ఎక్కడ దిగవలసిన వాళ్ళక్కడ దిగుతున్నారు. ఇందాక నిర్లిప్తంగా నవ్విన కుర్రవాడు బస్సునుండి దిగేవరకూ మాస్టరు గారు కూడా బస్సు దిగలేదు. రాత్రి పదిగంటలవుతుండగా ఆ కుర్రవాడు బీచ్‌రోడ్డులో బస్సుదిగాడు. మాస్టరుగారు కూడా అతనితోపాటే బస్సుదిగారు. మాస్టరుగారు అతని కళ్ళలోకి చూస్తూ, మృదువుగా అతని చెయ్యి పట్టుకుని దగ్గరకు చేర్చు

కున్నారు. ఆ కుర్రవాడి కళ్ళలోంచి కన్నీరు వరదలైంది. స్థబ్దుగా నిలిచిపోయాడు. మాస్టరుగారు అతని భుజం తడుతూ ఇలా అన్నారు. "ఆత్మహత్య పిరికిపందల పని. చచ్చి ఎవరూ ఏమీ సాధించలేదు. జీవితం భగవంతుడిచ్చిన గొప్పవరం. ఆ వరాన్ని గాలికి వదిలెయ్యలేవు. నువ్వు నీ లోపలపడతున్న ఆవేదన, సంఘర్షణ నాకు తెలుసు. నువ్వు ప్రపంచంలోని అన్యాయాలను, స్వార్థంవల్ల కలిగే అనర్థాలను చూస్తున్నావు. నీలో విప్లవభావాలు కలిగాయి. విప్లవం తేగల సామర్థ్యం నీకు లేదని తెలుసు కున్నావు. అందుకని ఈ రాత్రికి సముద్రంలో దూకి నీ జీవితాన్ని అంతం చేసుకుందా మనుకున్నావు. అదేమంత తెలివైన పనికాదు. ఘనకార్యం అంతకన్నా కాదు. నీ పిరికితనాన్ని వదిలేసి నాతో రా. నీకు నేను దారి చూపిస్తాను." ఆ విద్యార్థి మాస్టరు గారి పాదాలమీద పడిపోయాడు. ఆ తరువాత అతడు పంద్రెండు సంవత్సరాలపాటు మాస్టరుగారి దగ్గర అఖండమైన జ్ఞానాన్ని సంపాదించుకున్నాడు. గ్రామాల్లో ఉండే ఎందరికో స్ఫూర్తిదాయకు డయ్యాడు.

❉ ❉ ❉

ఒకసారి మాస్టరుగారి సన్నిహితులు ఒకాయన మద్రాసు వెళ్ళవలసివచ్చింది. తనకు తెలిసిన కుటుంబంలోని ఒక అమ్మాయికి వచ్చిన సంబంధం గురించి మంచిచెడ్డలు చూసి రమ్మని ఆ కుటుంబంవారు ఆయనను కోరారు. ఆ స్నేహితునికి

తాను ఎప్పుడు ఊరువిడిచి వెడుతున్నా మాస్టరుగారికి చెప్పి వెళ్ళడం అలవాటు. మాస్టరుగారితో చెప్పి, శలవు తీసుకుని బయలుదేరుదామని ఆయన మాస్టరుగారి దగ్గరకు వెళ్ళారు. మాస్టరుగారు చిన్న కునుకు తీస్తున్నారు. ఈ స్నేహితుడు లోపలికి వెళ్ళేసరికల్లా ఆయన మేల్కొని ఇలా అడిగారు. 'ఏమయ్యా! మద్రాసు వెడుతున్నావా?'. ఆ మిత్రుడు అవాక్కయ్యాడు. మాస్టరుగారిలా చెప్పారు. "వెళ్లద్దు. నువ్వు తెలుసుకోవాలను కుంటున్నవాడి వివరాల గురించి నువ్వేమీ తెలుసుకోలేవు. వాడుత్త మోసగాడు. అవటానికివాడు బ్రాహ్మణుడే, మంచి కుటుంబంలోంచి వచ్చినవాడే. వాడికి ఒక్కరు కాదు చాలా మంది భార్యలున్నారు. వాళ్ళ వాళ్ళకు తెలిసి ఒక హిందువుల అమ్మాయిని, ముస్లింలకు మాత్రమే తెలిసి ఒక ముస్లిం అమ్మాయిని, ఇంకా ఒకరిద్దరినీ కూడా వాడు కట్టుకున్నాడు. వాడు చాలా లౌక్యుడు. మహామేధావి. మంచి మాటకారి. వాడి దొంగవేషాలు కనిపెట్టడం అంత తేలిక కాదు. నువ్వు వెళ్ళావంటే మోసపోయి వస్తావు." ఆ మాటలకు మిత్రుడు ఆశ్చర్యపోయి ఇలా అడిగాడు. "ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఆ సంబంధం గురించి తెలుసుకోవడానికి ఈ సాయంత్రం మద్రాసు వెడతానని ఆ కుటుంబంవారికి చెప్పానే. నేవెళ్ళి తెలుసుకోకుండా ఈ విషయాలన్నీ వాళ్ళకెలా చెప్పేది. మీరు చెప్పారని చెప్ప వచ్చునా?" 'బాగుంటుందనిపిస్తే చెప్పు' అన్నారు మాస్టరుగారు. ఆ మిత్రుడు పరిగెత్తుకుంటూ వాళ్ళింటికి వెళ్ళి, మాస్టరుగారు

చెప్పినదంతా చెప్పాడు. అంతావిని “సోది కబుర్లు పట్టుకుని అంతమంచి సంబంధాన్ని ఎలా వదులుకోవటం” అన్నారు వారు. అందుకు ఆ మిత్రుడు “మాస్టరుగారి సామర్థ్యం నాకు తెలుసు కనుక నామట్టుకు నాకు అది సత్యమే. నాకంతా స్పష్టంగా ఉంది. కాబట్టి ఈ వ్యవహారంలో మరింక నేను కల్పించుకోను. మీ కుటుంబానికి హితుడిని కనుక మీరు కూడా విరమించుకుంటే మంచిదని నా సలహా” అన్నాడు. ఆ కుటుంబం వారు ఎంతో గౌరవంగా తిరస్కరించారు. ఒక రిటైర్డ్ మిలటరీ ఆఫీసరును మద్రాసు పంపి ఆ వ్యక్తిని గురించి వాకబు చేసుకు రమ్మన్నారు. కాబోయే పెళ్ళికొడుకు గురించి ఆ మిలటరీ ఆఫీసరు పదిహేను రోజులపాటు కూపీలాగాడు. తిరిగివచ్చి అతను అన్నివిధాల మంచివాడని చెప్పాడు. పెళ్ళి జరిగిపోయింది. మూడేళ్ళు గడిచాయి. కుటుంబంవారంతా ఆశ్చర్యపోయేలా వాడి అసలురంగు బయటపడింది. వారంతా మాస్టరుగారి దగ్గరకు వచ్చి పరిష్కార మడిగారు. మాస్టరుగారు ఆ అమ్మాయితో ఇలా అన్నారు. “నీకు డబ్బూ పోయింది, పరువూ పోయింది. ఇప్పటికైనా వాడిని వదిలించుకుని ఇకనుంచి నీ అంతట నువ్వు బ్రతుకు.” ఆమె మాస్టరుగారి మిత్రునివద్దకు వచ్చి బాధపడింది. ‘అంతటి మహానుభావుడు చెప్పిన మాటలు పట్టించుకోకపోవటం మా మూర్ఖత్వం’ అంటూ.

❊ ❊ ❊

మాస్టరుగారు జ్యోతిష్యచక్రాలను ఒక్కసారి కంటితో చూసినంతమాత్రాన ఫలితాలను చెప్పగలిగేవారు. ఆ వేగం చూసేవారికి ఆశ్చర్యకరంగా ఉండేది. ఒకసారి మాస్టరుగారు ఒక మిత్రుని ఇంటికి వెళ్ళారు. ఆ మిత్రుడు విశాఖపట్టణంలో మంచి పలుకుబడి కలవాడు. మాస్టరుగారి మార్గాన్ని అనుసరించక పోయినా మాస్టరుగారంటే ఆయనకెంతో గౌరవమూ, పూజ్యభావమూ ఉండేవి. మాస్టరుగారు అలా వెళ్ళేసరికి ఆయన చాలా ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళ పెద్దమ్మాయికి ఒక అద్భుతమైన సంబంధాన్ని కుదర్చగలిగినందుకు ఆయన ఎంతో ఆనందిస్తున్నారు. కాబోయే పెళ్ళికుమారుని కుటుంబంయొక్క సంప్రదాయ నేపథ్యం, సాంఘికమైన హోదా, అర్థబలమూ, రాజకీయ పలుకుబడీ మొదలైనవాటి గురించి ఏకరువు పెట్టారు. బెంగుళూరు నగరంలో ఆ కుటుంబంవారికి ఉత్తములుగాను, లబ్ధప్రతిష్ఠులు గాను పరిగణింపదగిన అన్ని లక్షణాలు ఉన్నాయి. మాస్టరుగారి మిత్రుడు కూడా ఆయనకుగల జాతీయస్థాయి కంపెనీలలోని ఉన్నత పదవులను బట్టి మంచి పలుకుబడి గలవాడే. ఆయన, ఆయన కుటుంబంలోనివారు మాస్టరుగారు వచ్చినందుకు ఎంతగానో సంతోషించారు. ఆయనకి ఇడ్లీలు, కాఫీ ఇచ్చి, సంబంధం తాలూకు వివరాలన్నీ చెప్పారు. సంభాషణ చివరలో ఉన్నట్టుండి ఆయన మాస్టరుగారితో, "మాస్టారూ! వధూవరుల జాతకాలు రెండూ ఒకసారి చూసి మీ అభిప్రాయం చెప్పరాదూ..." అని అడిగారు. అందుకు

మాస్టరుగారు "ఇంతదూరం వచ్చాక ఇప్పుడు జాతకాలు చూడటంలో అర్థంలేదు. ఇప్పటికే ఒక నిశ్చయానికి వచ్చేశారు కాబట్టి చెప్పేందుకు నాకు అంత అవకాశం ఉండదు" అన్నారు. అందుకా మిత్రుడు ఏం ఫరవాలేదండీ. నాకు, మావాళ్ళకీ మనసుల్లో ఏమున్నా మీమాటే మాకు శిరోధార్యం. మీరు చెప్తే తిరుగుండదు. ఆనందంగా స్వీకరిస్తాం. మీరు మా శ్రేయోభి లాషులు గదా !" అన్నారు. మాస్టరుగారు జాతకాలు చూడటానికి ఒప్పుకున్నారు. పెళ్ళి కుమారుని జాతకాన్ని ఒక్క క్షణం అలా చూసి ప్రక్కన పెట్టేశారు. హఠాత్తుగా చాలా తీవ్రంగా మారిపోయి ఇలా అన్నారు. "అయ్యా!.......... గారూ ఎట్టి పరిస్థితులలోను ఈ సంబంధంకోసం వెళ్ళకండి." ఆ మిత్రుడు నిశ్చేష్టులయ్యారు. నిరుత్సాహపడ్డారు. మాటాపలుకూ లేకుండా అయిపోయింది. కాసేపటికి తేరుకుని ఆయనిలా అడిగారు. "మీరిలా ఎందు కంటున్నారో కారణం తెలుసుకోవచ్చా?." మాస్టరుగారు "కారణా లడక్కండి. దీనిగురించి ఇంక చర్చ వద్దు. ఇంతటితో ఈ విషయాన్ని వదిలేయండి" అన్నారు. లేచినిలబడి చెప్పాపెట్ట కుండా మాస్టరుగారు అక్కడినుంచి వెళ్ళిపోయారు. మాస్టరు గారు అలా ఎందుకు ప్రవర్తించారో ఆ మిత్రునికి బోధపడలేదు. మాస్టరుగారి సలహాను పాటించడం ఆయనకు చాలా కష్టమైంది. మాస్టరుగారి ప్రతిభపట్ల ఆయనకెంతో గౌరవం కూడా ఉంది. ఒక నెలరోజుల్లో ఎలాగో సర్దుకుని ఆ సంబంధాన్ని వదులు కున్నారు. తనకు ప్రియాతిప్రియమైన పెద్దకుమార్తెకు వచ్చిన

అంత మంచి సంబంధాన్ని వదులుకోవటమంటే ఆయనకు బాధగానే అనిపించింది. ఆరునెలలు పోయాక ఒక సాయంత్రం ఆ మిత్రుడు ఎంతో ఉద్విగ్నుడై కన్నీళ్ళతో మాస్టరు గారి దగ్గరకు వచ్చాడు. మాస్టరుగారికి సాష్టాంగపడి ఇలా అన్నాడు. "మీరు మహానుభావులండీ మాస్టరుగారూ! మీ గురించి మమ్మల్ని తెలుసుకోనివ్వరు. మీరు మీ నిరాడంబరతతో మమ్మల్ని మాయలో పడేస్తారు. మీరు నన్ను గొప్ప ముప్పునుంచి రక్షించారు. అప్పుడు మీరు మా అమ్మాయి సంబంధాన్ని అంత గట్టిగా ఎందుకు కాదన్నారో ఇప్పుడు తెలిసింది." మాస్టరుగారు చిరునవ్వు చిందించారు. తన రెండుచేతులతోను ఆయన భుజాలు పట్టుకుని లేవదీసి తన ప్రక్కనగల కుర్చీలో కూర్చోబెట్టి ఇలా అన్నారు. "నా సలహాను పాటించినందుకు సంతోషంగా ఉంది. **నాకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఎవరికయినాగాని నేను సూచన మాత్రంగానే చెప్పగలను. ఇతరులకోసం నిర్ణయాలు తీసుకోలేను. నాఅభిప్రాయాల్ని బయటపెట్టనూలేను. సున్నితంగా సలహాయిచ్చి ఊరుకుంటాను. దానిని పాటించటం, పాటించకపోవటం అవతలివాళ్ళకు సంబంధించినది. అదంతా వాళ్ళ కర్మనుబట్టి ఉంటుంది.** మీరు మీ అమ్మాయిని ఇస్తానన్న అతనికి దీర్ఘాయువు లేదని నాకు తెలుసు. అతడు అల్పాయుష్కుడు. సంవత్సరం కంటే బ్రతకడు. అతని గురించి మీరేమైనా విన్నారా?". ఆ మిత్రుడు ఏడుస్తూ ఇలా అన్నాడు.

"అతడు ఒక ప్రమాదంలో చనిపోయాడు." మాస్టరుగారు ఆయనను ఓదార్చారు.

సలహాలు ఇవ్వటంలోను, నడిపించటంలోను మాస్టరు గారి మార్గం ఎప్పుడూ సూక్ష్మంగా ఉండేది. ఆయన చెప్పిన దానిని అనుసరించకపోయినా ఆయన బాధపడేవారు కారు. ఆయన నియమాలు ఆయనవి. అలాగే ఇతరుల విషయం కూడా అనేవారు. ఎవరయినా అడిగితేనేగాని సలహాలు ఇవ్వటం గాని, ఇలా నడవండని చెప్పటంగాని చేసేవారు కారు. ఎదుటి వారిని బట్టి వారికి ఆయన దగ్గరివానిగానో, దూరంవానిగానో ఉండేవారు. సహాయానికి మాత్రం సర్వసన్నద్ధులుగా ఉండేవారు. అదికూడా అవతలివారు అర్థిస్తేనే. ఈవిధమైన సంస్కారవంత మైన వ్యవహార సరళి చాలా అరుదు. ఎక్కడోగానీ కనిపించదు. చుట్టూ ఉండే మనుషులు అతీంద్రియతను, సూక్ష్మతను పొందినవారైతేనే గాని ఏ గురువూ ఎప్పటికీ సరయిన అవగాహనకు అందదు.

❉ ❉ ❉

ఒకసారి కొందరు మేధావులు మాస్టరుగారి పరిజ్ఞానాన్ని, భవిష్యదృష్టిని పరీక్షిద్దామని వచ్చారు. మాస్టరుగారిని కలిసి ఆ మాటలు ఈ మాటలు అయ్యాక, ఆయనకొక జాతకచక్రాన్ని ఇచ్చారు. ఆ జాతకుడు తానున్న తీవ్ర వ్యాధిస్థితినుండి బయట పడతాడో లేదో చూసి చెప్పమన్నారు. ఆ వచ్చినవారు ఉద్యోగ

రీత్యా మాస్టరుగారికి సన్నిహితులు అవటంవల్ల అంతటి సాహసానికి పూనుకున్నారు. మాస్టరుగారు ఆ జాతకచక్రాన్ని తీసుకుని తెరిచి చూడనన్నా చూడకుండా ఇలా చెప్పారు. “ఎందుకు మీరిలా నా కాలాన్ని, మీ కాలాన్ని వృథాచేస్తారు. అతి తెలివితేటలతో మీరు మీ జీవితాలను వృథా చేసుకునేందుకే నిశ్చయించుకున్నారని నాకు తెలుసు. మీకున్న తెలివితేటల్ని ఏ కొద్దిమందికి మేలుకలిగేలా ఉపయోగించినా మీ బ్రతుకులకు ఒక సార్థకత ఉండేది. మీ జీవితం యొక్క నిష్ప్రయోజకత్వాన్నే మీరు పదేపదే చాటుకుంటున్నారు. నేను ఆ జాతకచక్రంలోకి చూడాల్సిన పనిలేదు. నాకు తెలుసు. మీరడుగుతున్న వ్యక్తి వారంక్రితమే పోయాడు. ఈవిధంగానన్నా మీరు బాగుపడి ఇకమీదటైనా ఏదైనా పనికొచ్చేపని చేస్తే మీ సహోద్యోగిగా నేనెంతో ఆనందిస్తాను. తరువాత మీఇష్టం.” ఆ వచ్చిన బృందంవారు సిగ్గుపడ్డారు. కానీ వారి ధోరణి మాత్రం మార్చుకోలేదు. వాళ్ళ మనస్సులు కరడుగట్టిపోవడం వల్ల వాళ్ళలాగే తీరికూర్చుని విమర్శలు చేస్తుండేవారు.

❊ ❊ ❊

ఒకసారి మాస్టరుగారి సహచరుడు ఒకతను రాత్రి సమయంలో రైలుప్రయాణం చేస్తున్నాడు. చాలీచాలని అప్పర్ బెర్త్ మీద పడుకున్నాడు. రైలువేగానికి నిద్రపడితే క్రిందపడతానేమోనని అతడికి భయంవేసింది. మాస్టరుగారిని ప్రార్థించు

కుని పడుకుండిపోయాడు. తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో రైలుకు సడన్‌బ్రేకు వేయటంవల్ల అతను క్రిందపడ బోయాడు. అంతలోనే రెండు తెల్లని కాంతివంతమైన చేతులు అతనిని పట్టుకుని, మళ్ళీ బెర్తుమీద ఉంచినట్లుగా అతనికి తెలిసింది. బ్రతుకుజీవుడా అనుకుని మాస్టరుగారికి మనసారా నమస్కరించుకున్నాడు. ఆ తరువాత అతడు మాస్టరుగారిని కలిసినప్పుడు ఆయనే ముందుగా "ఏమయ్యా ఒక్కరాత్రికి నిద్రపోకపోతే చచ్చిపోవుగదా! చక్కగా కూర్చుని ఏ ధ్యానమో, జపమో చేసుకుని ఆ రాత్రి గడపవచ్చుగదా! ఏం నిద్రపోవడాని కంత ఆరాట మెందుకు? అంతకంటే నిద్ర పోకుండా ఉండటానికి ప్రయత్నించు. అంతగా నిద్రవస్తే, కూర్చునే కునుకు తీయవచ్చు గదా! ఎలా పడుకోవాలి? ఎక్కడ పడుకోవాలి? అని ఆలోచించటం రోగలక్షణం. నిద్రకోసం ఆరాటపడటం తీవ్రమైన వ్యాధే. సాధ్యమైనంతవరకూ మెలకువగాను, జాగ్రత్త గాను ఉంటూ ఉండు" అని మందలించారు. మాస్టరుగారు, సహచరుడు నవ్వుకున్నారు.

❊ ❊ ❊

చాలాసార్లు మాస్టరుగారు భూగోళస్థాయిలో జరుగుతుండే సన్నివేశాల పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తుండేవారు. ఈ గ్రహం మీద మారుమూల ప్రాంతంలో కూడా ఏం జరుగుతోందో తమ కార్యకర్తలకు చెప్పగలిగేవారు. ఆయన చెప్పిన విశేషం రెండు

రోజుల తరువాత వార్తాపత్రికలలో వచ్చేది. కొన్నిసార్లు అర్ధరాత్రప్పుడు ఆయన తమ తోటివారిని నిద్రలేపి, తమతో ధ్యానానికి కూర్చోమనేవారు. అత్యంత నిశ్శబ్దంగా ఆ ధ్యానం రెండుమూడు గంటలు సాగేది. ఆ మరునాడు రాత్రి జరిగిన దానిని గురించి కార్యకర్తలు అడిగితే ఆయనిలా చెప్పేవారు. **"కొంతమంది మహానుభావులు చంద్రకిరణాల ద్వారా మన గ్రహానికి దిగివస్తున్నారు. వారు శుక్ర గ్రహానికి సంబంధించిన వారు. దివ్య ప్రణాళికకు సహకరించి, మానవాళిని ఉద్ధరించ టానికై వారు దిగివచ్చారు. అత్యంత భక్తితో పరమగురు పరంపర వారిని స్వాగతిస్తోంది. అలాంటి దివ్యమైన సమయంలో మీరు పడుకుని వుండటం ఇష్టంలేక మిమ్మల్ని లేపాల్సివచ్చింది."**

❊ ❊ ❊

ఒకసారి మాస్టరుగారు తీరికగా కుర్చీలో కూర్చుని గది పైకప్పు మూలకేసి చూస్తున్నారు. ఉన్నట్టుండి ఆయన గట్టిగా నవ్వారు. అక్కడున్న సహచరుడు అది గమనించి కారణ మడి గాడు. "అది సున్నితమైనది. చెప్పటానికంత బాగుండదు. అయినప్పటికీ చెబుతాను. నేను బెల్జియం పంపినవాడు అక్కడ విస్కీ త్రాగుతున్నాడు. అక్కడ చాలా చలిగా ఉంది. వేడి పుట్టటానికి విస్కీ త్రాగమని అతని మిత్రులు చెప్పారు. పాపం నాకెక్కడ తెలిసిపోతుందోనని భయపడుతున్నాడు. ఒక రెండు గుక్కలు త్రాగి, నాకు భయపడి ప్రక్కన పెట్టేశాడు. అంతకన్నా

అతడు ఆ గ్లాసుడు విస్కీ త్రాగి ఉంటే నేను సంతోషించి ఉండేవాడిని. అతడి స్థితికి నాకు నవ్వువచ్చింది" అన్నారు మాస్టరుగారు. 'మీకు ఇలా అన్ని విషయాలూ కనబడిపో తుంటాయా?' అని అడిగాడు ఆ సహచరుడు. "అదేంకాదు. అలా చూడటం నా పని కాదు. ఎవరి వ్యక్తిగత ఆలోచనలలోను నేను కల్పించుకోను. అవతలివాడు పిలిస్తే తప్ప నేను వెళ్ళను. బెల్జియంలో మనవాడు విస్కీ త్రాగుతూ నన్ను తలచుకున్నాడు. అందువల్ల నాదృష్టి అతని మీదకు వెళ్ళింది. అంతకుమించి మరేంలేదు" అన్నారు మాస్టరుగారు.

మాస్టరుగారి సన్నిహిత సహచరులందరికీ తమతమ జీవితాల్లో కొద్దిగానో గొప్పగానో మాస్టరుగారి దివ్యత్వానికి సంబంధించిన ఇలాంటి అనుభవాలు ఉంటూనే ఉంటాయి. మాస్టరుగారితో అనుబంధం మరింత బలపడటానికి అవి ఎంతగానో దోహదం చేస్తాయి.

## 16

# జ్యోతిర్విద్య

**మా**స్టర్ ఇ.కె.గారికి గల జ్యోతిర్విజ్ఞానం అసాధారణ మైనది. మాస్టర్ సి.వి.వి.గారు వరుణగ్రహంచేత పని చేయించటం మొదలైనప్పటినుండి గ్రహాలకు నూతనమైన విభిన్న కార్యక్రమాలు అప్పగించబడ్డాయి. ఇంతకుముందుకంటే భిన్నమైన క్రొత్త బాధ్యతలు గ్రహాలకు ఇవ్వబడినట్లుగా మాస్టర్ సి.వి.వి.గారు చెప్పారు. కాబట్టి సంప్రదాయసిద్ధమైన జ్యోతిర్విద్య కొంతవరకే ఉపయోగపడుతుంది. రవి, చంద్ర, శుక్ర, అంగారక, శని గ్రహాల ద్వారా వరుణ, ఇంద్ర గ్రహాల పనితీరు తెలిస్తేగానీ రాశిచక్రంలో ఆయా గ్రహాల సంచారానికి సంబంధించిన తగిన పరిజ్ఞానం దొరకదు.

ఈ కారణంగానే పరమగురువులు నూతన దృక్పథంతో కూడిన జ్యోతిర్విజ్ఞానాన్ని అందజేస్తే బాగుంటుందని భావించారు. దాని ఫలితంగా జ్వాల్‌కూల్ మహర్షి మేడమ్ బెయిలీ ద్వారా అందించిన *'ఈసోటరిక్ ఎస్ట్రాలజీ'* అనే గ్రంథం వెలువడింది. ఆ గ్రంథం జాతులు, దేశాలు, మొత్తం భూగోళం, భూమిపై నూతన గ్రహశక్తుల ప్రభావాలను గురించి వివరిస్తుంది. అది హిమాలయ పర్వతశ్రేణులలోని ఆశ్రమంనుండి వెలువడింది.

మాస్టర్ సి.వి.వి.గారు వ్యక్తిగత సాధన, పరివర్తనల నిమిత్తమై జ్యోతిషంలోని నూతన దృక్పథాన్ని ప్రసాదించగా, అది మాస్టర్ ఇ.కె.గారి ద్వారా 'స్పిరుచ్యువల్ ఎస్ట్రాలజీ' అన్నపేరుతో వెలువడింది. మొదటిగ్రంథం దేశాల బృందాలను, భూగోళాన్ని గురించి ప్రస్తావిస్తుంది. రెండవది వ్యక్తులు, వారి పరివర్తనలను వివరిస్తుంది. ఆ విధంగా 'స్పిరుచ్యువల్ ఎస్ట్రాలజీ' నీలగిరి పర్వతశ్రేణులలోని ఆశ్రమంనుండి వచ్చింది. ఈ రెండు గ్రంథా లకు ఒకే ప్రణాళికకు సంబంధించి రెండు వేర్వేరు ప్రయోజనా లున్నాయి.

మాస్టర్ ఇ.కె.గారు తొలిదశలో పరమగురువుల నుండి పొందిన పండ్రెండేళ్ళ ప్రబోధాల ఫలితంగా జ్యోతిర్విద్యలోని ఈ నూతన పార్శ్వంలో పారంగతులయ్యారు. భారతదేశంలో సంప్రదాయసిద్ధంగా వస్తున్న చాంద్రమాన పద్ధతిని కాక మాస్టరు గారు సౌరమాన పద్ధతిని అనుసరించారు. మొదటిదానిని సాయన పద్ధతి అని, రెండవదానిని నిరయన పద్ధతి అని అంటారు. మాస్టరుగారు ప్రపంచాని కంతటికీ హిమాలయాల నుండే జ్యోతిర్విజ్ఞానం అందిందని చెప్తుండేవారు. ఈజిప్షియన్లు, గ్రీకుల కంటే ఎంతో ముందే భారతీయ ఋషులు సంఖ్యల ఆకారాన్ని, గ్రహాలు చేసే పనిని గ్రహించారు. వేదాలలో గల జ్యోతిర్విజ్ఞానం సూర్యునికి సంబంధించిన సాయనమే. నిరయన మనేది తరువాతికాలంలో వచ్చింది. కనుకనే మాస్టరుగారు సాయన పద్ధతిని అనుసరించేవారు. అదే ఇప్పుడు పాశ్చాత్యదేశా

లన్నింటా బాగా ప్రచారం పొందింది. మన దేశంలోని పండితులు మాస్టరుగారి జ్యోతిర్విజ్ఞానం పాశ్చాత్యము అనుకుంటారు. అంతర్ముఖులు కాక బహిర్ముఖంగా ఆలోచించే ఆ పండితులతో వాదించటంవల్ల ప్రయోజనం ఉండదని తెలుసు కనుక మాస్టరు గారు మాట్లాడక ఊరుకునేవారు. మాస్టరుగారు జాతకాలు చూసి చెప్పేతీరు ఇటు భారతదేశంలోని ఇతరులకంటేను, అటు పాశ్చాత్య జ్యోతిష్కుల కంటేను భిన్నంగా ఉండేది. ఒక నిముషం పాటు చక్రాన్ని చూసి ఆ జాతకుని గురించి వినేవారు ఆశ్చర్య పోయేలా ధారాళంగా చెబుతుండేవారు.


మాస్టరుగారు ఎక్కువగా శనిగ్రహాన్ని ఆధారంగా చేసుకునే తన సహచరులు, అనుచరులకు మార్గదర్శనం చేసేవారు. ఆయన ప్రకారం ఇనీషియేషన్‌కి కారకుడు శనిగ్రహమే. వ్యక్తి అంతర్ముఖు డవటానికి దోహదం చేసేది శనిగ్రహమే. సాధకుడు శనిగ్రహం ఇచ్చే క్రమశిక్షణను పొందితేతప్ప ఆధ్యాత్మికరంగంలో ఏమీ సాధించలేడు. మాస్టరుగారు కుజగ్రహం ఆధారంగా కూడా కొన్నిసార్లు ఫలితాలు చెప్పేవారు.

ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటి అంటే– మాస్టరుగారి జాతకంలో శని పదవ ఇంటిలోను (దశమ భావంలోను), కుజుడు మూడు, నాలుగు ఇళ్ళ (తృతీయ, చతుర్థ భావాల) సంధిలోను ఉండి పరస్పరం సమసప్తకదృష్టి కలిగి ఉన్నారు. అంతేకాక ఈ శని, కుజులు ఇద్దరూ వక్రించిన బుధునితో కేంద్రదృష్టి కూడా కలిగివున్నారు. శని, గురునిపై

కేంద్రదృష్టి కలిగివుండగా, కుజుడు లగ్నంలో అదేదృష్టి కలిగి వున్నాడు. గురుడు సూర్యునితోను, ఇంద్రునితోను సమసప్తకాన్ని కలిగి ఉన్నాడు. ఈవిధంగా స్థిరరాశుల్లో నాలుగు కేంద్రదృష్టులు, మూడు సమసప్తకాలు ఉండటాన్ని బట్టి మాస్టరుగారు ఈ గ్రహాలకు సంబంధించిన సాధన పూర్తిచేసుకుని, తానే ఈ సాధన మార్గాన్ని అందివ్వడానికి గురువుగా పరిపూర్ణులయ్యారు అని తెలుస్తుంది. స్థిరచతుర్భుజి ఆధ్యాత్మికమార్గాన్ని సూచిస్తుంది అని మనం గుర్తుంచుకోవాలి. మాస్టరుగారు ప్రతి పనిని శనియొక్క నేర్పుతో ప్రారంభిస్తారు. తరువాత కుజుని వేగాన్ని, శక్తిని ప్రవేశపెడతారు. ఆయన సంకల్పం గురునియొక్క చైతన్యంతో విప్పారి ఆత్మచైతన్యాన్ని సూర్యునివలె ఉదయింప జేస్తుంది. ఈ విషయాన్ని ఈ జాతకం ద్వారా చక్కగా తెలుసుకో వచ్చు. మాస్టరుగారి పశ్చిమభావంలో ఉన్న శుక్ర, రాహువులు ఆయనవల్ల ఉపకారం పొందిన వ్యక్తులు ప్రతిఫలంగా ఆయనకు చూపించే అవిశ్వాసమూ, కృతఘ్నత, తత్ఫలితంగా ఆయన పొందే నిరాశల గురించి తెలియజేస్తాయి. ఏకాదశంలో కేతువు ముక్తజీవులతోను, జ్ఞానులైన పరమగురువులతోను, ఈ ప్రపంచాన్ని అంటక సేవచేసే మహానుభావులతోను ఆయన సాంగత్యాన్ని తెలియజేస్తుంది. ద్వితీయభావంలో వరుణుడి స్థితివల్ల ఆయన వాక్కు మహా శక్తివంతమై పునర్నిర్మాణం కోసం అవసరమైతే శస్త్రచికిత్స సాధనంగా కూడా ఉపయోగపడగలదని తెలుస్తుంది.

## మాస్టర్ ఇ.కె.గారి జాతకచక్రము

## ఆగస్టు11, 1926; బాపట్ల, ఇండియా; 05.30 p.m. IST



మాస్టరుగారు తన జీవితంలో ఏ బృహత్కార్యాన్నైనా వృషభ మాసంలోగాని, వృశ్చిక మాసంలోగాని చేపట్టేవారు. ఆయన చేపట్టిన పనులకు ఎన్నో బాలారిష్టాలు వచ్చేవి. ఆయన ప్రారంభించిన పనికి వ్యక్తులు సిద్ధంగా లేనప్పుడు అవి అంతటి తోనే పరిసమాప్త మైపోయేవి. వాళ్ళుగనుక ప్రారంభదశలో వచ్చే కష్టనష్టాలను తట్టుకుని తగిన క్రమశిక్షణతో ఆ పనిని

కొనసాగించినట్లైతే అది భవిష్యత్తులో చాలాకాలం నిలబడగలుగుతుంది. ఇది మాస్టరుగారి ప్రత్యేక పద్ధతి. ఆయన ప్రారంభించిన ఏ పనీ పదునెనిమిది సంవత్సరాలలోపు ఫలవంతం కాలేదు. ఆయనిలా చెప్పేవారు. **"పని అనేది వ్యక్తులకు శిక్షణకోసం. వారు పనికి తగిన నియమాలను పాటించలేకపోతే ఆ పని పడుకుంటుంది. పని నెరవేరకపోవటం అంత ముఖ్యం కాదు. అందులో దిగిన మనుషులే ముఖ్యం. నియమాలను విధించే శనిగ్రహంయొక్క క్రమశిక్షణను పాటించటం వారు నేర్చుకుని తీరాలి."** గురుడు నియమాలను తెలియజేస్తాడనీ, శని వాటిని ఆచరింపజేస్తాడనీ అందరికీ తెలిసిందే. కుజుడు నియమాలను పాటించనివారిని శిక్షిస్తాడు. శని విముఖంగాను, నిర్లక్ష్యంగాను ఉండేవారిని అదుపుచేసి కట్టుబాటులో పెడతాడు.

భవిష్యత్తుకు పనికివచ్చే మంచి ఉద్యానవనం కోసం ఉపయోగపడే బలమైన విత్తనాలవంటి వారికోసం మాస్టరుగారు చూస్తుండేవారు. ఆయన చుట్టూ చేరిన యువకులు తమ అర్హతలను తాము నిర్దేశించుకోవటమేగాని వారికోసం ఆయన తనకు తానుగా ఏమీ నిర్దేశించేవారు కారు– వారు అడిగిన పనిని అప్పగించటం వరకే తప్ప! ఆయన చుట్టూ చేరినవారిలో కొద్దిమంది మాత్రమే కార్యకలాపాలతోపాటుగా సరైన మార్గంలో ఎదిగారు. తక్కినవారు శనిగ్రహ శిక్షణకు తట్టుకోలేకపోయారు. మాస్టరుగారు ప్రబోధంలోను, సమాశ్వాసంలోను గురుడు, కార్యనిర్వహణ విషయంలో శని.

అశుభ గ్రహాలు అని పిలువబడే శని, కుజులు అంతరంగ సాధక మండలులచే ఇప్పుడు యోగచోదక గ్రహాలు (Planets of Initiations) గా పరిగణింపబడుతున్నాయి. జాతకచక్రంలోని కేంద్ర దృష్టులు, సమసప్తక దృష్టులు వ్యక్తియొక్క అంతరంగ వికాసానికి తోడ్పడతాయి. జీవులకు శని ప్రథమగురువు. స్థిరరాశులే సాధనా సోపానాలు. మిథున, ధనూరాశులు ఊర్ధ్వ ముఖంగా చైతన్యాన్ని ఉన్ముఖం చేసే ప్రజ్ఞాదండంగా పనిచేస్తాయి. ఇవి నవీనయుగపు జ్యోతిష్యానికి సంబంధించిన కొన్ని విశేషాలు. ఇవి అన్నీ మాస్టరుగారి ద్వారా వ్యక్తమై, కార్యరూపందాల్చి, సాధకులను చైతన్యవంతం చేస్తున్నాయి.

అంతరంగ సాధకులు ముందుగా 'స్పిరిచ్యువల్ ఎస్ట్రాలజీ' గ్రంథాన్ని అధ్యయనం చేసి, తమ నిత్యసాధనలో ఏ నెలకానెల అనుసంధానం చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. వారు ఆ తరువాత భూగ్రహానికి సంబంధించి గ్రహాల పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకోడానికి 'ఈసోటరిక్ ఎస్ట్రాలజీ' చదివి అర్థం చేసుకోగలుగుతారు. ఈ విధంగా మాస్టర్ ఇ.కె.గారు బాహ్య ప్రపంచంలోకి జ్యోతిష్యశాస్త్రానికి సంబంధించిన నూతన దృక్పథాలకు మంద్రంగా ఆహ్వానం పలికారు.

# 17

## క్రతువిద్య

**కుం**భయుగంలో క్రతువిజ్ఞానము మరోసారి చైతన్యవంత మవుతోంది. జీవితంలోని అన్ని కక్ష్యలకు లయాత్మకత (Harmony) ఆధారం. అది సాధిస్తేనే తప్ప దివ్యత్వానికి సంబంధించిన క్రమం సాధ్యపడదు. లయాత్మక జీవనమే క్రతువు. ఈనాడు సూక్ష్మశక్తుల అభివృద్ధికి క్రమం, పద్ధతి, లయాత్మకతలు ప్రాధాన్యం వహిస్తున్నాయి. కుంభయుగము క్రతునిర్వహణలకు, పర్యవసానంగా జరిగే ప్రజ్ఞావికాసానికి ప్రతీకగా నిలుస్తుంది. మాస్టరుగారి అవతరణము స్వరాజ్యము నకు దారితీసే లయబద్ధతా సూత్రాన్ని జాగృతం చేసింది. స్వరాజ్యము అంటే స్వయంపాలనము. అది సప్తమ కిరణానికి చెందిన లక్షణము. స్థూలవ్యవస్థకు అనుగుణంగా సూక్ష్మవ్యవస్థను ఈ సప్తమకిరణ క్రమము సంస్కరించ గలుగుతుంది. ద్వంద్వ జీవనం గల మానవుడు అజ్ఞానదశలో తన ప్రతిబింబములో ఉంటూనే తనలోని ఉన్నతకక్ష్యకు చెందిన ప్రజ్ఞకు స్పందించాల్సి ఉంటుంది. ఈ విధమైన స్పందన క్రతుకాండవల్ల మాత్రమే సాధ్యం. గతంలో ఈ క్రతుకాండలను పాటించడాన్నిబట్టే గొప్ప నాగరికతలు ఆవిర్భవించాయి. ప్రాచీన భారతీయులు, అట్లాంటి

యన్లు, మయావాసులు, మెక్సికన్లు, గ్రీకులు, ఈజిప్షియన్లు, చాల్డియన్లు, అస్సీరియన్లు, బాబిలోనియన్లు క్రతుకాండ ద్వారానే తాంత్రికవిద్యల శక్తిని తెలుసుకున్నారు.

కుంభము వాయుతత్త్వపు రాశి. వాయువు శబ్దమునకు స్పందిస్తుంది. ప్రాణమునకు వాహిక. వాయు నియంత్రణం ప్రాణాయామం ద్వారాను, శబ్దాధికారం ద్వారాను సాధ్యమవు తుంది. అందుకు సంబంధించిన సులువులు క్రతుకాండలో ఉంటాయి. మోజెస్, జీసస్‌లతో సహా పూర్వపు మహానుభావులు క్రతువిజ్ఞానం ద్వారా గొప్ప తంత్రవేత్తలయ్యారు. మహాభారత కాలంనాడు యుద్ధవీరులలో చాలామంది వివిధ క్రతు విభాగా లలో సభ్యులు.

ఈ భూమిపై హిమాలయాలలో గల ఒక కేంద్రంలో జ్ఞానులు సభ్యులుగాగల మహాశ్వేత బృందము (Great White Lodge) ఒకటి ఉంది. వారి శాఖలు భూమియందంతటా వ్యాపించి ఉన్నాయి. వారు పర్వదినాల్లో ఈ భూమిపైగల అన్ని అయస్కాంత కేంద్రాల్లోను క్రతువులను నిర్వహిస్తారు. మహాశ్వేత బృందము సారమేయ మండలమందుండే మూల మహాశ్వేత బృందంతో (Great Grand White Lodge) అనుసంధానింపబడి ఉంటుంది. ఐదవ ఇనీషియేషన్ పొందినవారు అనగా గ్రహ విజ్ఞానం సాధించినవారు ఈ మూల మహాశ్వేతబృందం శక్తి లోనికి ప్రవేశార్హత కలిగివుంటారు. మూడవ ఇనీషియేషన్ పొందినవారు భూమిపై గల మహా శ్వేతబృందము నందు

ప్రవేశార్హత పొందుతారు. మూడవ ఇనీషియేషన్ పొందటమనగా అమృతత్త్వాన్ని సాధించటం.

మాస్టర్ ఇ.కె.గారు మహా శ్వేతబృందంలో ప్రవేశాన్ని పొందారు. ఆయనకు క్రతుకాండ పునరుద్ధరణ బాధ్యత అప్పగించబడింది. మాస్టర్ సి.వి.వి.గారి ప్రధానాశయం కూడా అదే. పరమగురు పరంపరయొక్క ఆశయం కూడా అదే.

వాస్తవానికి మేడమ్ బ్లావెట్స్కీయే ఆధ్యాత్మిక రంగంలో అంతరంగ సోదరబృందాన్ని (Co - Freemasonry) ప్రారంభించారు. మాస్టర్ సి.వి.వి.గారు దానికి కుంభచైతన్యాన్ని ఇవ్వటానికని అందులో చేరారు. అయితే వరుణుని ప్రభావంవల్ల దానికెన్నో ఒడుదొడుకులు వచ్చాయి. ప్రస్తుతమున్న స్థితినుండి అంటే అధికారానికి, ధనానికి, మద్యానికి బానిసగా మారిన స్థితినుండి ఆ సంస్థ బయటపడగలదని భావించవచ్చు. ఇటీవలి కాలంలో ఆ సంస్థలో పెత్తందారీతనం, ఆదరభావం లేకపోవటం, సేవాదృష్టి తగ్గటం అనేవి పెరిగిపోయాయి. సోదరత్వమనేది మహానుభావుల సేవా కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు అవసరమైన ఒక అంతర్గత సామర్థ్యాన్ని నూతనంగా పెంపొందిస్తుంది. మాస్టరుగారు ఈ గ్రహానికి చెందిన మహా శ్వేత బృందంతో సంబంధం కలిగిన అంతరంగ క్రతువిధానానికి చెందినవారు. అది సనాతన సంప్రదాయానికి చెందినది. ఆ విధానంలో ఆయన చెప్పుకోదగినంత కృషిచేశారు. సనాతన క్రతువిధానాన్ని విచక్షణతో ప్రవేశపెట్టారు. ఆయన మాస్టర్

సి.వి.వి.గారి లాగానే అంతరంగ సోదరబృందంలో పాల్గొన్నారు. ఆయన తన కృషితో 1960లో మాస్టర్ మేసన్ స్థాయికి చేరుకున్నారు. 1968లో హోలీ రాయల్ ఆర్చ్ స్థాయిని పొందారు. ఈ విధానాన్ని గురించి ఎక్కువగా చెప్పుకోవటానికి అవకాశం లేదు. ఎందుకంటే అది అంతరంగ సాధనకు సంబంధించినది, నిగూఢమైనదీను. ఆయన బోధనల్లో అక్కడక్కడ మనకు పై సోదరబృందానికి సంబంధించిన క్రతువిద్యా విశేషాలు కనబడతాయి.

బాహ్య సాధనకు సంబంధించి ప్రథమ సోపానంగా మాస్టరుగారు జీవనాన్ని నిర్దేశించారు. మాస్టర్ జ్వాల్‌కూల్‌గారు కూడా తరచుగా తన బోధనల్లో లయాత్మకత, క్రతువు, సప్తమ కిరణం, క్రమానుగత వ్యవహారం మొదలైనవానిని నొక్కిచెప్పారు. లయబద్ధమైన జీవితం మాత్రమే ఆశ్చర్యకరంగా అద్భుత ఫలితాలను ఈయగలదని ఆయన చాటిచెబుతున్నారు. మాస్టర్ ఇ.కె.గారు విరామం లేకుండా రోజుకు పదహారు నుండి పదునెనిమిది గంటలు పనిచేసినా ఆయన చేసిన పనులన్నింటి లోను ఒక క్రమం ఉంటుంది. ఆ కారణంగానే ఆయన అంతటి సామర్థ్యాన్ని కలిగి ఉండేవారు. క్రతువుల పట్ల ఆయనకుగల దర్శనాన్ని మనం ఆయన రచించిన 'బుక్ ఆఫ్ రిచ్యువల్స్'లో చూడగలం. సనాతన భారతీయ క్రతువులను ఆయన సులభతరం చేసి, షోడశోపచార పూజ, అభిషేకము, హోమము వంటి గ్రంథాలుగా ఇచ్చారు. తన అనుచరులందరూ లయానుగుణ జీవనాన్ని గడపాలని ఆయన ఆదేశించారు.

పని, ఆహారం, విశ్రాంతి అనే వాటిమధ్య చక్కని, క్రమం ఉండాలని మాస్టరుగారు తరచుగా చెప్పేవారు. ఈ మూడింటి మధ్య క్రమం పాటిస్తే ఏవ్యక్తి అయినా అనారోగ్యంపాలు కాదని కూడా ఆయన చెప్పేవారు. మాస్టర్ ఇ.కె.గారు తామే ఆరోగ్యానికి ఆదర్శప్రాయులు అన్నట్టుగా ఉండేవారు. ముప్పదియేండ్ల కార్యనిర్వహణలో ఆయన ఏనాడూ అనారోగ్యాన్ని పొందలేదు. జలుబు, దగ్గు, తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం వంటివి ఎప్పుడూ ఆయన దరి చేరలేదు. ఒక్కసారిమాత్రం తుప్పుమేకు గుచ్చుకుని కాలు పుండుపడింది. ఆ సమయంలో కూడా ఆయన తన క్రమబద్ధమైన జీవితాన్ని వీడలేదు.

క్రమం అనేది ప్రాథమికంగా శనిగ్రహ ధర్మం. అది ఆ తరువాత గురుధర్మమైన విస్తరణను పొంది, శుక్రునికి సంబంధించిన అనుభూతిగా పర్యవసిస్తుంది. సంకల్పబలం లేనివారు సూక్ష్మలోకాల్లోకి ప్రవేశించలేరు. వారికి జీవితంలో క్రమంపట్ల ఆసక్తి ఉండదు. అందువల్ల క్రతువులన్నా ఇష్టం ఉండదు. వారిలో లోలోపల దాగివున్న రోగతత్త్వమే అందుకు కారణం. దానివల్ల వారు వెలుగులోకాల్లోకి పయనించలేరు. సాధకులు ఈ సందర్భంగా మాస్టర్ జ్వాల్‌కూల్‌గారి 'సెవెన్త్ రే *రిథమ్*'కు సంబంధించిన రచనలు చదివితే మంచిది. అందునా ముఖ్యంగా **"ఎ ట్రియటైజ్ ఆన్ వైట్ మేజిక్"** అనే గ్రంథాన్ని ప్రత్యేక దృష్టితో చదవాలి.

# 18

# జగద్గురుపీఠము

## సోదరబృందంతో సన్నిహిత సంబంధం :

మాస్టర్ ఇ.కె.గారు విశాఖపట్టణానికి వచ్చి, అక్కడ స్వస్థత, బోధనలతో తమ కార్యక్రమాలను మొదలుపెట్టారు. ఎన్నో కుటుంబాలవారు ఆకర్షింపబడి, ఆయన చెప్పినవిధంగా సాధన చేస్తూ క్రమశిక్షణతో కూడిన జీవితాలను నడిపేవారు. ఆ కుటుంబాలవారికి ఆయన మార్గదర్శకులయ్యారు. ఆయనకు గల ప్రేమ, సేవాసక్తి ఆయనను ఆ కుటుంబాలకు ఆత్మీయునిగా చేసాయి. వారందరూ ఆయనను తండ్రిగా భావించేవారు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక, ఆరోగ్య, విద్యా సంబంధ మైన విషయాల్లో సలహాలిస్తూ, చిన్నచిన్న గొడవలు వస్తే పరిష్కరించే వారు. ఆయన అప్పుడు, ఇప్పుడు కూడా వారిని వెలుగుమార్గంలో నడిపిస్తూనే ఉన్నారు. ప్రతీ ఇల్లూ తన ఇల్లే అన్నంత చనువుగా ఉండేవారు. అలాంటి గృహాలు చాలానే ఉండేవి. ఆయన ఎవరింటికైనా భోజనానికి వెడితే ఆ కుటుంబం వారు ఎంతగానో ఆనందించేవారు. ప్రతి ఇంట్లోను వంటిల్లు

ఆయనదే. గృహిణితో ఆయనకుగల చనువు, పితృవాత్సల్యం అలాంటివి. వంటింట్లో చేరి ఆ ఇల్లాలితోపాటు కుటుంబాని కంతటికీ కావలసిన ఒకటి రెండు వంటకాలు మాస్టరుగారు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆయన చేసిన వంటకాన్ని కుటుంబంలోని వారందరూ ఎంతో ఆనందంతో ఆరగించే వారు. ఎంత తీరుబడిలేని కార్యక్రమాల్లో ఉన్నా ఆయన కొన్ని కుటుంబాలవారితో కలిసి మొదటిఆట సినిమాకో, రెండవఆట సినిమాకో వెడుతుండేవారు.

మాస్టరుగారికి ఎప్పుడైనా తీరుబడిదొరికి ఊళ్ళో మంచి సినిమా ఆడుతుంటే వంద టిక్కెట్లు కొనేవారు. అన్ని కుటుంబాల వారిని సినిమాకు రమ్మనేవారు. అలాంటి సందర్భాలన్నింటిలోను ఆయన కొన్న టిక్కెట్లు సరిపోనంతగా వచ్చేవారు. ఆయనకు మనలను ఎలా ఉల్లాసపరచాలో తెలుసు. కొందరిని చక్కని సంభాషణలో పెట్టి, తానుమాత్రం తటస్థంగా వారిని గమనిస్తూ ఉండేవారు. సాధారణంగా ఆయన పదిమందిలోను ఉంటూనే ఒంటరిగా (అంతర్యామిగా) ఉండేవారు. ఆయన భౌతికంగాను, మానసికంగాను చలాకీగా ఉండేవారేగాని ఏనాడూ ఆలోచనలలో హడావిడిగా (busy) ఉండేవారు కాదు. ఆయనకు తన కార్యక్రమ ప్రణాళిక తనకున్నప్పటికీ, మనస్సుకు తానుగా ఏ కార్యక్రమాన్నీ పెట్టుకోకుండా ఎంతో స్వేచ్ఛగా ఉండేవారు.

ఆయన సమస్యలలో చిక్కుకుని ఉన్నప్పటికీ మనస్సుకు మాత్రం అవి పట్టుకునేవి కావు. ప్రసంగవశాన వివాదాంశమేదైనా తలెత్తితే ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపివేసేవారు. తన సమక్షంలో ఎవరయినా వాదులాడుకుంటుంటే తన మనస్సును అటువైపు పోకుండా చేసేవారు. ఆయన ఎన్నడూ ఎవరితోను విభేదించ లేదు. ఎదుటివారి అభిప్రాయాలపట్ల ఆయనకు సానుభూతి ఉండేది. ఇతరులు మాట్లాడుతున్నప్పుడు వారి మాటల్లో వ్యక్తమయ్యే అవసరాలను తెలుసుకోవటం ఎలాగో చెబుతుండే వారు. ఆయన గురువుల మధ్య పోలిక తేవటంగాని, గురువుల మంచిచెడ్డలను ఎంచటం గాని ఇష్టపడేవారు కారు.

## సంస్థ నిర్మాణము :

పైన చెప్పిన అంశాలన్నీ మాస్టరుగారు ఆయా కుటుంబా లతో కలిసిమెలిసి ఉంటూ తన ప్రవర్తన ద్వారా చూపించేవారు. వారందరు మాస్టరుగారి రచనలు చదువుతూ, ఆయన మార్గాన్ని, అంటే, పరమగురువుల పథాన్ని అనుసరించటానికి ప్రయత్నించే వారు. మాస్టరుగారు 'నేను అనుసరిస్తున్న మార్గం' అనేవారే గాని, నేను ఏర్పాటుచేసిన మార్గం అనేవారు కాదు. మాస్టరుగారి మార్గమంటే ఆయన అనుసరిస్తున్న గురువుల మార్గం – సనాతన మైన గురుపరంపర యొక్క మార్గం. తనద్వారా వ్యక్తమవుతున్న మార్గాన్ని చక్కని పద్ధతిలో నిర్వహించటంకోసం మాస్టరుగారు

1971 సం॥ము వృశ్చికమాసంలో మైత్రేయులవారి మధుర స్మృతికి అంకితంగా 'జగద్గురుపీఠం' అనే సంస్థను ఏర్పాటు చేశారు. నెమ్మదిగా విస్తరిస్తున్న కార్యక్రమాలతోపాటు, సంస్థ కూడా విస్తరించింది.

ప్రబోధము, స్వస్థతల రంగంలో ఆయన సేవల ఆవశ్యకత ఎంతగానో పెరిగి, చివరికి మాస్టరుగారు యూనివర్శిటీలో చేస్తున్న లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేయాల్సివచ్చింది. తనపై ఆధారపడి భార్య, ఆరుగురు బిడ్డలతో కూడిన పెద్ద సంసారం ఉన్నప్పటికీ తన ఆర్థికస్థితిని పైవాళ్ళకు వదిలి, మానవాళికి సేవచేయాలనే ఉత్తమలక్ష్యంతో ముందుకు సాగిన మాస్టరుగారి ధైర్యం, త్యాగనిరతి ఇందువల్ల వ్యక్తమవుతున్నాయి. జీవితంలో ఏ పరిస్థితిలోను ఆయన డబ్బుకోసం ఒకరిని అడగటం గాని, తడుముకోవటం గాని జరగలేదు. ఆ స్థితి ఆయన ఉద్యోగం నుండి విరమించుకున్నాక కూడా అలాగే కొనసాగింది.

మాస్టరుగారి జీవితంలో చెప్పుకోదగిన మరో ముఖ్యమైన అంశం– అంతటి సంసారభారం ఉన్నప్పటికీ ఆయన ఏవిధమైన ఆస్తిని గాని, చెప్పుకోదగ్గ బ్యాంకు నిలవలు గాని సమకూర్చు కోలేదు. 'నా సంగతి ఎలాగ?' అనే భావన ఆయనలో ఏకోశాన ఉండేది కాదు. ఆయన జీవిత చరమదశలో నిర్మించబడిన ఇల్లుకూడా ఆయన ప్రమేయంతో కాక, ఆయన సహచరులు

పట్టుపట్టటంవల్ల నిర్మించబడిందే. చాలా ఏళ్ళవరకూ ఆయన ఆ యింట్లోకి మారలేదు. ఆయన కుటుంబం ఆ యింట్లోకి మారినప్పటికీ, ఆయన పెద్దగా అక్కడ ఉండేవారు కారు. ఆ విధంగా కూడా ఆయన నిజమైన శిష్యత్వంలోని మరో కోణాన్ని చూపించారు. ఆయన ఇచ్చిన బలంతో జగద్గురుపీఠం క్రమంగా పెరిగిపెద్దదై, ఇప్పుడు విశ్వవ్యాప్తమయింది.

తపస్సు, ప్రపంచమందలి సమస్త పవిత్ర గ్రంథములను తులనాత్మకంగా అధ్యయనం చేయటం, విద్యారంగమున సేవల నందించటముతో కూడిన స్వాధ్యాయం, వైద్యం, ధ్యానము అనేవి జగద్గురుపీఠంయొక్క ప్రధాన ఆశయాలు. ఈ సంస్థ తనదైన పద్ధతిలో ఈ మూడు ఆశయాల సాధనకు కృషి చేస్తోంది. ఈ మూడు ఆశయాలను అవగాహన చేసుకుని, వాటి సాధనకోసం జీవితమంతా నిరంతరాయంగా కృషి చేసేవారికి అంతరంగ ప్రజ్ఞావికాసం జరుగుతుంది. ఈ మూడు ఆశయాలు– తపస్సు, స్వాధ్యాయం, సేవ అనేవి ఆత్మవికాసానికే గాని, తన గొప్పను చాటుకోవటానికి కారాదని తరచుగా చెప్పేవారు. గర్వంతో కాక వినయంతో ఎదగాలని, గర్వంవల్ల పనియొక్క విలువ పడిపోతుందని మాస్టరు గారు పదేపదే గుర్తుచేసేవారు. ఆయన పనిచేయడానికి ఆత్మసంకల్పం, పనిలో శ్రద్ధ, పనిలో నాణ్యత ప్రధానాలని, పైపై హంగులు అవసరం

లేదని గట్టిగా చెప్పేవారు. వికాసాన్ని కోరేవారికి "ఎదగండి తప్ప, బలవకండి." (Grow, but do not bulge) అనేది ఆయనిచ్చిన ప్రధానమైన సందేశం.

జగద్గురుపీఠం దినదిన ప్రవర్ధమానమైంది. ఎనభైకిపైగా *'హోమియో వైద్యాలయాలు'* నిర్వహిస్తోంది. పరమగురువుల బోధనలను అందించటానికి *'నావాణి'* అనే ఒక మాసపత్రికను వెలువరిస్తోంది. మాస్టర్ ఇ.కె.గారి గ్రంథాలను, ఆయన సహచరుల గ్రంథాలను ప్రచురించి అందిస్తోంది. క్రతువులను నిర్వహిస్తూ, వాటిని నేర్పుతోంది. వేదసూక్తాలను, ఇతరమైన పవిత్ర స్తోత్రాలను నేర్పుతోంది. నియమిత సమయాలలో రామాయణం, భగవద్గీత, భాగవతం మొదలైన పవిత్ర గ్రంథాల వివరణ సాగుతోంది. సామూహిక సహజీవనాలు నిర్వహింప బడుతున్నాయి. జ్యోతిష ప్రాధాన్యంగల దినాలలో ధ్యానం, తపస్సు నిర్వహింప బడుతున్నాయి. మానవతా విలువలను అందించే *'బాలభాను విద్యాలయాలు'* నిర్వహింప బడుతున్నాయి. యోగము, ధ్యానములు నేర్పబడుతున్నాయి. హోమియో విధానం లోను, ఇతర ప్రకృతి శాస్త్రాలలోను శిక్షణ ఇవ్వబడుతోంది. పేదల సహాయార్థమై ఆరోగ్యం, విద్య, వృత్తులకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నాయి. పూర్ణిమ, అమావాస్య పర్వదినాలలో ప్రత్యేక ధ్యానాలు జరుగుతున్నాయి. అయనములు,

సంక్రమణములు ఆత్మోన్నతి సాధనకు అనుగుణంగా వినియో గింప బడుతున్నాయి. చంద్రుడు ధనిష్ఠా నక్షత్రమందున్నప్పుడు ప్రత్యేక ధ్యానములు జరుగుతున్నాయి. సంస్థకు సంబంధించిన ముఖ్య సంఘటనలు సంవత్సరమంతా పరివ్యాప్తమయ్యాయి. జనవరి 11, 12, 13 తేదీలలో 'గురుపూజల' పేరిట అంతర్జాతీయ సమావేశాలు జరుగుతాయి. మే 29వ తేదీన 'మే కాల్ డే' పేరిట ఉపదేశదినం నిర్వహింపబడుతోంది. ఆ రోజున భారతదేశంలోను, ఐరోపాలోను, దక్షిణ, మధ్య, ఉత్తర అమెరికా దేశాల్లోను గల బృందాలలో మిథున చైతన్యాన్ని ప్రచోదనం చేయటం జరుగుతోంది. ఆగష్టు 4న 'మాస్టర్ సి.వి.వి.గారి జన్మదినం', ఆగష్టు 11న 'మేడమ్ బ్లావెట్స్కీ, మాస్టర్ ఇ.కె. గార్ల' జన్మదినాలు, సింహమాసంలో కృష్ణపక్ష అష్టమి దినాన 'శ్రీకృష్ణుని' జన్మదినంతోపాటు 'మాస్టర్ ఎమ్.ఎన్. గారి' జన్మదినం, వైశాఖ పూర్ణిమనాడు 'బుద్ధజయంతి', డిసెంబరు 22న 'క్రీస్తు జన్మదినం', మార్గశిర (ధనుర్మాస) పూర్ణిమనాడు 'శ్రీ దత్తజయంతి' – సంస్థ తాలూకు ప్రతి కేంద్రం లోను నిర్వహింపబడే ముఖ్య ఉత్సవాలు. ప్రతి సంవత్సరం 'ఎస్ట్రలాజికల్ డైరీ' అనే పేరుతో ఒక ప్రత్యేక కేలండరు ప్రాచ్య పాశ్చాత్యులకోసం ఇవ్వబడుతోంది. దానిలో జ్యోతిషపరంగా ఆధ్యాత్మిక సాధనకు పనికివచ్చే ముఖ్యదినాలు సూచింప బడతాయి.

పూర్ణిమ, ఏకాదశులలో 'ప్రత్యేకపూజలు' జరుగుతాయి. ఆశ్వయుజమాసం (తులామాసం) లో శుక్ల పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రల సందర్భంగా 'శ్రీమాతకు ప్రత్యేక పూజలు' జరుగుతాయి. అలాగే చైత్రమాసం (వృషభమాసం) లో శుక్ల పాడ్యమి నుండి నవమి వరకు వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీరామనవమి పేరుతో 'శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు' నిర్వహింపబడతాయి.

జగద్గురుపీఠం కేంద్రాలన్నింటిలోను సంవత్సరం పొడవునా శ్రద్ధతో కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. సంస్థ సభ్యుడు సంస్థ యొక్క ప్రణాళికను అనుసరించి తమ కార్యక్రమ ప్రణాళికను నిర్వహించుకుంటాడు. బాధ్యతాయుతమైన స్వేచ్ఛ ట్రస్టు యొక్క సంప్రదాయం.

# 19

## ప్రాక్పశ్చిమములు

**భూ**గ్రహ చైతన్యము యొక్క మేధాసంపదలోని రెండు భాగాలను సమన్వయపరచడం ద్వారా మానవ కార్యకలాపాల సమన్వయానికి ప్రాక్పశ్చిమ సమన్వయం సాధించటం కుంభ యుగానికి చెందిన ప్రధానకార్యం. విక్టోరియా మహారాణి పట్టాభిషేకంతో కుంభయుగం మొదలయింది. వలస రాజ్యపాలన విచ్ఛిన్నమై అంతరించే సమయంలోనే ప్రపంచ దేశాలు, రాజ్యములచే సూక్ష్మకక్ష్యలో స్వయంపాలనా బీజాలు వెదజల్ల బడ్డాయి. స్వేచ్ఛ, స్వయంపాలన, స్వయంపరివర్తన, విశ్వచైతన్యానికి కారణమైన బృందచైతన్యానికి దారితీసే ఆత్మపరిజ్ఞానము– అనేవి కుంభయుగ ధోరణులు (concepts). పెత్తందారీతనం పరస్పర గౌరవానికి దారితీయాలి. కుంభయుగం పరాకాష్ఠకు చేరేటప్పటికి ఒకరిపై మరొకరు పెత్తనం చెలాయించటం పశుప్రాయంగా పరిగణింప బడుతుంది. ఈ దిశగా ప్రాక్పశ్చిమాల సమన్వయం కోసం సూక్ష్మకక్ష్యలో కార్యక్రమం మొదలయ్యింది. ఈ సమ న్వయం మానవ కార్యకలాపాలు అన్నింటికీ సంబంధించినది. అంటే ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలకు చెందినది. ఈ రంగాలకు చెందిన వాస్తవ విలువలను

మన్నించటం, పైపై విలువలను త్రోసిపుచ్చటం అనేది కూడా కుంభరాశి లక్షణమే. జంతు, వృక్ష, ఖనిజ వర్గాలను దివిజ వర్గానికి అనుగుణంగా సంరక్షింపగలిగే సామర్థ్యం గల సమగ్ర మానవ జాతిని ఆవిర్భవింపజేయటం కుంభరాశి తత్త్వం.

దైవంపేరుతో వ్యాప్తిలోకి వచ్చిన నీచ భావనలు, మూఢ విశ్వాసాలు ఆత్మవికాసానికి కాక అజ్ఞానానికి కారణ మవు తున్నాయి. వాటిని నాశనం చేయటానికి శాస్త్రపురోగతే ముఖ్య సాధనంగా పరిగణింప బడుతోంది. పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్థం నుండి ఆధిభౌతికమైన శాస్త్రవిజ్ఞానం ఒక వైపు, ఆధ్యాత్మిక మైన శాస్త్రపరిజ్ఞానం మరొక వైపు ఆవిర్భవింప సాగాయి. పడమటి దేశాల్లో శాస్త్రజ్ఞులు మానవాభ్యుదయ కృషిలో నిమగ్నమై వుండగా, తూర్పుదేశాల్లో ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు తమ కృషిని ప్రారంభించారు. ప్రాక్పశ్చిమ సమన్వయం అంటే విజ్ఞానశాస్త్ర విలువలు, ఆధ్యాత్మిక శాస్త్రవిలువల సమ్మేళనంగా భావించబడుతోంది. ఇది ప్రాక్పశ్చిమ దేశాల్లో మతతత్త్వాన్ని గ్రుడ్డిగాను, ఆవేశంగాను అనుసరించేవారి ఊహకు అందని విషయం. పరమగురు పరంపర వారి కార్యకలాపాలు యోగ సాధకులు కానివారి (Non- Initiates) యొక్క అవగాహనా స్థాయికి అతీతమైనవి.

పశ్చిమదేశాల్లో శాస్త్రీయ అవగాహన పెంపొంది గ్రుడ్డి నమ్మకాల ద్వారా రూపొందిన చీకటి గుడియొక్క పునాదిరాళ్ళు

ఒకటొకటిగా పెకలింపబడుతుంటే, తూర్పుదేశాల్లో దైవశక్తిని గ్రుడ్డిగానమ్మే మూర్ఖత్వానికి భిన్నంగా ఆధ్యాత్మికతకు సంబంధించిన శాస్త్రీయ ప్రతిపాదనలు చేయబడ్డాయి. పశ్చిమదేశాల శాస్త్రవేత్తలు రేడియో తరంగాలను, టెలిగ్రాఫ్ విధానాన్ని, ఫొటోగ్రఫీని, టెలిఫోన్‌ను, టెలివిజన్‌ను, ఎలక్ట్రానిక్స్‌ను కనిపెట్టగా, తూర్పు దేశాల శాస్త్రజ్ఞులు ఆకాశము, కాలము, శబ్దము, వర్ణము, సంకేతముల తత్త్వాలను ఆవిష్కరించారు. ఈ రెండింటి సమ్మేళనం ద్వారా భూమిపై దివ్యత్వాన్ని అవతరింపజేయటం రాబోయే శతాబ్దాలకు లక్ష్యం. ప్రస్తుతానికి ఈ రెండు కార్యక్రమాలు చెరొక వైపునుంచి చొచ్చుకు వస్తున్నాయి. అవి రెండూ, చైతన్యం నుండి ద్రవ్యానికి, ద్రవ్యం నుండి చైతన్యానికి అనుసంధాన మేర్పడి, శక్తుల వినిమయం జరిగే ఒకానొక కేంద్రం దగ్గర కలుస్తాయని భావించబడుతోంది. ఇది కుంభయుగంలో ఆశింపబడుతున్న ఇంద్రజాలం (White Magic). ఈ విధమైన ప్రాక్పశ్చిమ శాస్త్రాల సమన్వయం ఎవరిలో ఉంటుందో, ఆ వ్యక్తి ఒక్కడు మాత్రమే ప్రాక్పశ్చిమ సమన్వయానికి తగిన సాధనం కాగలడు. సర్వ సామాన్యంగా ప్రాగ్దేశపు ఆధ్యాత్మికవేత్త పశ్చిమదేశాల శాస్త్ర విజయాలను నిరసిస్తాడు. అందుకు కారణం అతని అవగాహనా లోపమే. అదేవిధంగా పాశ్చాత్య సోదరుడు ప్రాగ్దేశాలవారి సూక్ష్మలోకాల పరిజ్ఞానాన్ని తృణీకరిస్తాడు. అందుకు కారణం కూడా అతని అవగాహనా లోపమే. శాస్త్రానికి, దివ్యజ్ఞానానికి అంగీకారయోగ్యమైన ఒక స్థితి అవసరం. మేడమ్

బ్లావెట్స్కీ రచించిన 'ఐసిస్ అన్‌వీల్డ్' అనే గ్రంథం మొట్టమొదటి సారిగా అలాంటి చక్కని సమన్వయాన్ని ఇచ్చింది. ఆ గ్రంథంలో ఆమె శాస్త్రము, దివ్యత్వాలకు చెందిన వాస్తవ విలువలను ప్రకటించి, కాకమ్మ కథలను, గ్రుడ్డి నమ్మకాలను నిర్దాక్షిణ్యంగా కొట్టిపారేసింది. ఆ గ్రంథం వెలువడినప్పటినుండి మానవాళికి ఒక క్రొత్తబాట తెరుచుకుంది. ఇది కాలమహిమ అని చెప్పవచ్చు. అప్పటినుండి తూర్పు నుండి పడమటికి ఆధ్యాత్మిక రాయబారాలు మొదలయ్యాయి. మహాయోగి స్వామి వివేకానంద, పరమహంస యోగానంద, మహర్షి శ్రీ అరబిందో, దార్శనికులు శ్రీ దయానంద ఈ సందర్భంగా పేర్కొనదగిన వారిలో కొందరు. అదేవిధంగా పడమటి నుండి తూర్పు దేశాలకు వ్యాపారం, పరిపాలన, పాశ్చాత్య భౌతిక సౌకర్య సాధనాలు, పద్ధతులు, నాగరికతా విధానాలు కొనితెచ్చే లౌకిక రాయబారాలు కూడా మొదలయ్యాయి. ఈవిధమైన సమ్మేళనం దివ్యకార్య ప్రణాళికలో ఒక మహా తరంగము. ఇంతకుముందు చెప్పబడినట్లుగా ద్రవ్యము, చైతన్యములు ఎవరి ఆత్మలో సంయోగమై, ఆత్మగా వ్యక్తం కాగలరో ఆ వ్యక్తి మాత్రమే అలాంటి సమన్వయ సాధనకు అర్హులు.

మనిషిలో ఉదరవితానానికి పైభాగం తూర్పునకు, క్రిందిభాగం పడమరకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఉదర వితానానికి కొద్దిగా పైనుండే కేంద్రస్థానము ఈ రెండింటికీ సంయోగ

స్థానం. దానిని అనాహతం (హృదయకేంద్రం) అంటారు. అది చక్కని అవగాహన కలిగిస్తుంది. మనిషిలోని భౌతికతత్త్వం, ఆధ్యాత్మిక తత్త్వం ఈ హృదయకేంద్రంలోనే సంయోగం చెంద వలసి ఉంది. అలాంటి సందర్భాల్లో మనిషి చైతన్యానికి, ద్రవ్యానికి సమాన దూరంలో ఉండి రెండింటిని గౌరవిస్తాడు. ఆధ్యాత్మికత వైపు ఎక్కువగా మొగ్గుచూపేవారు భౌతికతవైపు ఎక్కువగా మొగ్గేవారి కంటే ఏవిధంగాను గొప్పవారు కారు. వారు తమకున్న పక్షపాత దృష్టివల్ల యుగదర్శనం పొందటానికి కావలసిన కేంద్రస్థానానికి చేరుకోలేరు. వారు తమ అభిప్రాయాల్లో తాము చిక్కుకుని దార్శనికులు కాలేరు. సర్వసాధారణంగా ఇలాంటి అసంపూర్ణ యోగులే అధికసంఖ్యలోగల మానవ బృందాలకు గురువులుగా ఉండి, వారిని వివేకవంతమైన జీవననానికి, ఆచరణాత్మకతకు దూరం చేస్తున్నారు. ఇలాంటి గురువులు ప్రకృతిచే వంచింపబడి ఆవేశపూరితులైన తమ అనుచరులను వంచిస్తూ ఉంటారు. తమ వ్యాపకాన్ని, కుటుంబ జీవనాన్ని, సున్నితమైన సామాజిక సంబంధాలను పట్టించుకోకుండా తిరిగే వారు వీరే. వారు ప్రకృతియొక్క వైభవోపేత కార్యకలాపాలకు దూరం చేయబడతారు. సనాతన ఋషులందరూ తమతమ కుటుంబాలతో జీవిస్తూ, ఎవరి వృత్తులు వారు చేసుకుంటూ జ్ఞానకేంద్రాలుగా వెలుగొందారు. సంసారాన్ని, వ్యక్తిగత బాధ్యత లను గాలికి వదిలివేయటం యోగశాస్త్రం ఎప్పటికీ అంగీక రించదు. జీవితానికి సంబంధించి అన్ని విషయాలను సమ

దృష్టితో చూడాలని యోగశాస్త్రం చెబుతుంది. మిక్కిలిగా ద్వేషించటంగాని, ప్రకృతికి సంబంధించిన ఏ విషయాన్నైనా పరిహరించటంగాని కూడదని చెబుతుంది. ఏది ఎందుకు పనికివస్తుందో గ్రహించి తగినట్లుగా స్వీకరించటమే తప్ప వ్యతిరేకించటమనేది కూడదని యోగవిద్య చెబుతోంది.

మనిషిలో ఉండే ఊర్ధ్వకేంద్రాలైన సహస్రారం, ఆజ్ఞ, అనాహతాలు మూడూ నిమ్నకేంద్రాలైన మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకాలలో ప్రతిఫలిస్తాయి. షట్చక్రాలకు చక్కని అనుసంధానం కుదిరినప్పుడే యోగం సిద్ధిస్తుంది. షట్చక్రాలు అలా అనుసంధానమై షడ్దర్శనాలనబడే ఆరు వైఖరు లకు దారితీస్తాయి. షట్చక్రాలకు సంబంధించిన ఆరు వైఖరులను పొందిన వ్యక్తి ఘనము (Cube) వలె పరిపూర్ణుడవుతాడు. ఘనమునకు ఒకదానికొకటి సమానంగా ఉండే ఆరు ముఖాలు ఉంటాయి. దానిని తలక్రిందులు చేయటమంటూ ఉండదు. ఏ ముఖం మీదుగానైనా ఒకే విధంగా నిలబడగలదు. అదే విధంగా ఆరు వైఖరులు పొందిన వ్యక్తికి కూడా తారు మారులు ఉండవు. అన్ని పరిస్థితులలోను అతడు నిట్టనిలువుగానే ఉండగలడు. పరిస్థితుల ప్రభావానికి లోనుకాడు. రూపుకట్టు కుంటున్న గోళము కంటే ఘనము భిన్నము కాదు. గోళము ఒక సమగ్ర సంకేతము. సృష్టి మొత్తము గోళముగానే ఉంటుంది. ఆకాశం కూడా గోళముగానే ఉంటుంది. ఆరు వైఖరులు

గాయత్రీదేవి యొక్క ఆరు ముఖాలుగా కూడా చెప్పబడతాయి. ఈ వైఖరులే మూడు తలములుగల శిలువగా చూపబడతాయి. ఆ విధంగా ఒక పరిపూర్ణ మానవుడు గోళముగాను, ఘనము గాను, జ్ఞానిగాను, యోగిగాను ప్రతిపాదింపబడతాడు. ప్రస్తుత యుగంలో కావలసిన వారు అలాంటి యోగులే గాని, జీవిత వైభవాన్ని నిరసిస్తూ గుహలలోకి పోయి తపస్సు చేసుకోమని నూరిపోసే శుష్క వేదాంతులు కాదు. ఉత్తమ యోగులు, పరమ గురువులు ఈనాడు ముమ్మరంగా మానవ కార్యకలాపాలు సాగుతుండే కేంద్రాల్లో పనిచేస్తున్నారు. పదిమందీ మూగినప్పుడు వారు స్వేచ్ఛగా నిలబడతారు. వారు ప్రపంచంలోనే ఉంటూ శాంతి, సామరస్య తరంగాలను ప్రసారం చేస్తూ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంటారు. వారు ప్రపంచానికి సంబంధించినవారు కారు కనుక ప్రపంచంలోని పరిస్థితులకు ప్రభావితులు కారు.

ప్రాక్పశ్చిమ సమన్వయం అనే దానిని సూక్ష్మదృష్టితోను, స్థూలదృష్టితోను కూడా చూడాల్సి ఉంటుంది. లోపల ఆ సమన్వయం జరిగితేనే తప్ప బయట దానిని సాధించటం సాధ్యపడదు. ఈ సత్యాన్ని గ్రహించిన మాస్టర్ ఇ.కె. యీ ప్రణాళిక చేపట్టారు.

# 20

## మాస్టర్ ఇ.కె.గారి ప్రథమ విదేశ యాత్ర

**మా**స్టర్ ఇ.కె.గారు ప్రారంభ పుష్కరకాల శిక్షణా సమయంలో 'మిహిర' అనే ఒక పత్రికను నిర్వహించేవారు. ఆ పత్రికలో భవిష్యత్తులో జరగబోయే గ్రహకూటముల గురించి, శక్తిసంపన్నుడైన ఒక మహాపురుషుని ఆవిర్భావం గురించి ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసం ఆల్బర్ట్‌శశి అనే ఒక బెల్జియం దేశస్తుని దృష్టిలో పడింది. ఆయన దివ్యజ్ఞాన సమాజంలోను, ఆర్కేన్ స్కూల్‌లోను ప్రముఖ సభ్యులు. మేడమ్ బ్లావెట్స్కీ, మేడమ్ బెయిలీల ద్వారా వస్తున్న ప్రబోధాలను బాగా అధ్యయనం చేసినవారు. ఆయన మద్రాసు అడయారులో గల థియొసాఫికల్ సొసైటీలో ఉంటూండేవారు. మిహిర పత్రిక ఆయనకు చేరింది. అందులోని వ్యాసాన్ని చదివి ఆయన ఆ వ్యాసకర్త అందరిలాంటి జ్ఞాని కాదని గ్రహించారు. మాస్టర్ ఇ.కె.గారితో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయటానికి ఉత్సాహపడ్డారు. ఆయన మాస్టర్ ఇ.కె.గారికి, థియొసాఫికల్ సొసైటీవారికి పర్వతప్రదేశాల్లోగల విశ్రాంతి గృహానికి రావలసిందిగా ఆహ్వానం పంపారు. అతి ప్రశాంతమైన వాతావరణంలో నీలగిరి పర్వతాల్లోని కోటగిరి

అనేచోట ఆ విశ్రాంతిగృహం ఉంది. మాస్టరుగారు ఆ ఆహ్వానాన్ని మన్నించి నీలగిరులలో ఒక నెలరోజులు ఆల్బర్ట్‌శశి గారితో సహజీవనం చేశారు. వారిద్దరూ బ్లావెట్స్కీ, బెయిలీలకు సంబంధించిన ప్రబోధాలను గూర్చిన అనుభవాలను కలబోసుకున్నారు. పరమగురు పరంపరయొక్క కార్యక్రమాలకు సంబంధించిన తమ అవగాహనలను కూడా పరస్పరం చెప్పుకున్నారు. హిమాలయాల్లోని గురుపరంపరకు చెందిన సిద్ధపురుషులయొక్క గ్రంథాలతో శశిగారికి మంచి పరిచయం ఉంది. ఆయన నీలగిరులలో ఉండే పరమగురువును గూర్చిన సమాచారం తెలుసుకోవాలనుకున్నారు. మాస్టర్ ఇ.కె.గారు మాస్టర్ సి.వి.వి. గారి కార్యరంగాన్ని గురించి శశికి తెలిపారు. మాస్టర్ సి.వి.వి. గారి నుండి తాను పొందిన ప్రబోధాలలోని కొన్ని భాగాలను కూడా చదివి వినిపించారు. శశి ఆనందంతో పరవశించి, ఇ.కె.గారితో పాటు మాస్టర్ సి.వి.వి. గారి ప్రార్థనలో పాల్గొంటానని కోరారు. ప్రార్థనా సమయంలో శశి తాను గాఢమైన అనుభూతిని పొందానని, ఒక గొప్ప పరమగురువు యొక్క దివ్యశక్తిని పొందాలనే తన ఆకాంక్ష తీరిందని చెప్పారు. మాస్టర్ సి.వి.వి. గారిని గురించిన మరింత సమాచారం తెలుపవలసిందిగా ఇ.కె.గారిని అర్థించారు. ఇ.కె.గారు తాను మాస్టర్ సి.వి.వి. గారి నుంచి పొందిన జ్యోతిష పాఠాలను శశికి

చూపారు. ఆ ప్రబోధాల్లోని విషయ పరిజ్ఞానానికి శశి ఎంతగానో ఆనందించారు. దాని ఫలితంగా ఆ పాఠాలన్నింటినీ ఒక క్రమంలో పెట్టి ప్రపంచమంతా వ్యాపించి ఉన్న సత్యాన్వేషకు లకు అందేలా ఒక గ్రంథంగా వెలువరింపజేయాలని ఆయన పట్టుబట్టారు. మాస్టర్ ఇ.కె.గారు అందుకు అంగీకరించి పుస్తకానికి రూపకల్పన చేశారు. శశి దాని ముద్రణకు ఏర్పాటు చేశారు. నీలగిరులలోని ముద్రణాలయంనుండి తొలి ప్రచురణగా వెలువడిన ఆ గ్రంథమే 'స్పిరిచ్యువల్ ఎస్ట్రాలజీ'. వారిద్దరూ అత్యంత ఆత్మీయ మిత్రులైనారు. ఆ తరువాత మాస్టరుగారు విశాఖపట్టణం తరలివెళ్ళినప్పుడు శశిగారు మాస్టరుగారిని పాశ్చాత్యదేశాలలో ఉన్న సాధకబృందాలకు భారతీయమైన అఖండ విజ్ఞానాన్ని బోధించవలసిందిగా పదేపదే ఆహ్వానించారు. మాస్టర్ ఇ.కె.గారి లోని బోధనా సామర్థ్యాన్ని ఆయన గుర్తించ డమే ఇందుకు కారణం. మాస్టర్ ఇ.కె.గారు పశ్చిమదేశాలను పర్యటించటానికి ఇదంతా పూర్వరంగం. మాస్టర్ ఇ.కె.గారు తొలిసారిగా 1972 ఏప్రిల్ 22వ తేదీన వృషభమాస ప్రారంభంలో, స్థిరరాశిలో బెల్జియం బయలుదేరి వెళ్ళారు.

**మొదటి దశ :**

మాస్టర్ ఇ.కె.గారు పి.యస్.యస్. వర్మ అనబడే సహచరునితో కలిసి బెల్జియం వెళ్ళారు. వర్మగారు మాస్టరుగారి

కార్యక్రమాలతో మమేకమై, ఉద్యోగానికి రాజీనామా చేసి ఇ.కె.గారి కోసం కృషిచేయాలని నిర్ణయించుకున్న వ్యక్తి. ఆయన ప్రోద్బలంతోనే మాస్టర్ ఇ.కె.గారు జగద్గురుపీఠానికి రూపకల్పన చేశారు. ఆ సంస్థకు అప్పట్లో మాస్టర్ ఇ.కె.గారు సంస్థాపక అధ్యక్షులు కాగా, వర్మగారు సంస్థాపక ముఖ్య కార్యనిర్వాహకులు. ఐరోపాకు మాస్టరుగారి తొలిపర్యటన వర్మగారి సాహచర్యంతో సాగింది. ఆ తరువాత 1972 నుండి 1977 వరకు గల కాలంలో మాస్టరు గారు నాలుగుసార్లు విదేశీ పర్యటన చేశారు. మాస్టరుగారి ఐరోపా సందర్శనకాలంలో ఆయన ప్రధానంగా కలుసుకున్నది శశిగారి అనుయాయులను, మరికొందరు దివ్యజ్ఞాన సమాజ శాఖల సభ్యులను. ఆయన ఆ సందర్భంగా బెల్జియంలోను, ఫ్రాన్స్ దక్షిణప్రాంతంలోను, ఫ్రెంచిభాష మాట్లాడే స్విట్జర్లాండ్ ప్రాంతాలలోను విస్తారమైన ప్రసంగాలు చేశారు. ఆ తొలిదశ యాత్రలో బెల్జియం, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లలోని ఫ్రెంచిభాష మాట్లాడే బృందాలవారు మాస్టరుగారికి పరిచయమై ఆయన ప్రవచనాలను విన్నారు. అవన్నీ సాధారణంగా బహిరంగ ఉపన్యాసాలే. వాటిని అంతరంగ సాధకబృందాలు, కొన్ని సందర్భాల్లో దివ్యజ్ఞాన బృందాలు కలిసి నిర్వహించాయి. మాస్టరు గారి పర్యటనల సందర్భంగా లండన్‌లోని లూసిస్ ట్రస్టును, ఆల్ఫ్స్ పర్వతాలను, విచిత్రమైన పారిస్ నగరాన్ని, మరికొన్ని

ఇతర ప్రాంతాలను సందర్శించారు. ఆయన ఒక భారతీయ మిత్రుని ఆహ్వానంపై న్యూయార్క్ నగరాన్ని కూడా విహంగ వీక్షణం చేసివచ్చారు. మాస్టరుగారి అభిప్రాయం ప్రకారం ఆ సందర్శనలవల్ల ఆయా దేశాల్లో నామమాత్రంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయేగాని తగినంతగా బలపడలేదు. అందువల్ల ఆయన 1977-1981 మధ్యకాలంలో తన పర్యటనలకు కొంత విరామాన్నిచ్చారు. ఆ కాలంలోనే వర్మగారు ఇతర వ్యాపకాలకేసి మళ్ళారు.

**రెండవ దశ :**

వృషభమాసంలో ప్రారంభమైన మొదటిదశ పర్యటనల కంటే భిన్నంగా రెండవదశ పర్యటనలు సింహమాసంలో ఆగష్టు 2వ తేదీ 1981వ సంవత్సరంలో మొదలయ్యాయి. ఈ యాత్రలలో మాస్టరుగారు తనతో పాశ్చాత్యదేశాల్లో పర్యటించేందుకు శ్రీ పార్వతీకుమార్‌ను ఎంచుకున్నారు.

శ్రీ పార్వతీకుమార్ 1971వ సంవత్సరం అక్టోబరు నెల ఆఖరివారం నుండి మాస్టర్ ఇ.కె.గారితో సాహచర్యం కలిగి ఉన్నారు. శ్రీ కుమార్ తన వృత్తిని అప్పుడే అంటే 1970లో ప్రారంభించిన ఒక యువకులైన పబ్లిక్ అక్కౌంటెంట్. మాస్టర్ ఇ.కె.గారు ఆయనను జగద్గురుపీఠ సంస్థను నడిపించ వలసింది గాను, దానికి సంబంధించిన నియమావళిని రూపొందించ

వలసిందిగాను బాధ్యతను అప్పగించారు. ఆనాటినుంచీ శ్రీ కుమార్ మాస్టర్ ఇ.కె.గారి కార్యకలాపాలతో సహకరిస్తూ వచ్చారు. మాస్టరుగారి ప్రణాళికకు సంబంధించి క్రమక్రమంగా ఒక్కొక్క భాధ్యతను చేపడుతూ వచ్చారు. ఆయన మాస్టర్ ఇ.కె. గారి దివ్యశక్తి తోడ్పాటుతో తనంత తానుగా అంతర్ముఖంగాను, బహిర్ముఖంగాను ఎదుగుతూ వచ్చారు. 1977 నాటికి మాస్టర్ ఇ.కె.గారి కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్య బాధ్యతలను కుమార్‌గారు స్వీకరించారు. కుమార్‌గారి కుటుంబంయొక్క శక్తిసామర్థ్యాలను బట్టి మాస్టరు గారు 1977వ సంవత్సరంలో తన వ్యక్తిగత నివాసాన్ని, కార్యక్రమాలను కుమార్‌గారి నివాస మైన 'రాధామాధవం' యొక్క మొదటి అంతస్తుకు మార్చారు. (22 ఏప్రిల్ 1977). ఆనాటి నుండి ఆ కుటుంబంవారు మాస్టరుగారు సంకల్పించిన కార్యక్రమాలకు రూపకల్పన చేయటానికి కలిసికట్టుగా కృషిచేస్తున్నారు. చాలా సందర్భాల్లో మాస్టరుగారు చెప్పకుండానే మాస్టరుగారి పనికి సంబంధించిన విషయాలను శ్రీ కుమార్‌గారు తగిన ఆత్మ పరిజ్ఞానంతో గ్రహింప గలిగేవారు. సూక్ష్మప్రజ్ఞకు సంబంధించిన ఆవిధమైన అనుబంధం నాలుగు సంవత్సరాల్లో మరింతగా బలపడింది.

1981వ సంవత్సరం జులై మాసంలో మాస్టరుగారు విశాఖపట్టణానికి 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడ

పట్టణంలో హోమియో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకనాటి ఉదయాన ఆయన కుమార్‌గారికి ఫోనుచేసి 'సాధ్య మైనంత తొందరలో ఇక్కడకువచ్చి నన్ను కలుసుకోగలవా?' అని అడిగారు. కుమార్‌గారు వెంటనే బయలుదేరి మరునాటి ఉదయానికల్లా కాకినాడ చేరుకుని మాస్టరుగారిని కలుసు కున్నారు. మాస్టరుగారు ఒక చేతులకుర్చీలో తీరుబాటుగా కూర్చొని ప్రేమపూర్వకమైన చిరునవ్వుతో కుమార్‌గారిని పలకరించారు. కుమార్‌గారు ఆయన ముందు నిలుచుని ఎందుకు పిలిచారో విషయం తెలుసుకోగోరారు. మాస్టరుగారిలా అన్నారు. "ఇక ముందునుంచి పశ్చిమదేశ యాత్రలలో నీవు నాతో రావలసి వస్తున్నట్టుగా అనిపిస్తోంది. మరి నీకు వీలుపడు తుందా?" దానికి కుమార్‌గారు వీలుపడుతుందని చెప్పారు. అందుకు మాస్టరుగారు "నీ సంసిద్ధతకు నాకు ఆనందమేగాని, నీకు ఎలా వీలుపడుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. నీ వృత్తిలో నీవు చక్కగా ముందుకు పోతున్నావు. తీరికనేదే ఉండదు. ఎప్పుడూ వ్యాపారవేత్తలు నీవుండాలనుకుంటూ ఉంటారు. మరోప్రక్క నీ కుటుంబం. పిల్లలిద్దరూ మరీ చిన్నవాళ్ళు. నీ భార్య, పిల్లలకు నీ అవసరం ఎంతో ఉంటుంది. వీటికితోడు గత పదేళ్ళుగా నేను నీకు చాలా బాధ్యత పెట్టాను. ఇప్పటికే నీ భుజాలమీద ఎన్నో బాధ్యతలున్నాయి. మామూలుగా అయితే

నేను నిన్ను అడిగివుండేవాడిని కాదు. కానీ నా పైవాళ్ళు నాతో నీవుండితీరాలి అంటున్నారు. అందువల్ల పాశ్చాత్యదేశాల పని మరింత బాగా జరుగుతుంది. నీ సంసిద్ధతకి నేను ముగ్ధుడ నయ్యాను. ఈ సంగతి బయటకు తెలియనీకు. ఎవరికీ తెలియ కుండా పాస్‌పోర్టుకి ప్రయత్నించు" అన్నారు. అందుకు కుమార్ గారు ఇలా అన్నారు. "మాస్టరుగారి దయవల్ల కుంభరాశి పూర్ణిమనాడు భవిష్యత్తులో జరగబోయే మీ ఐరోపా పర్యటనల్లో నేను మీతో ఉంటానని నాకు తెలిసింది. నా పాస్‌పోర్టు నాకు ఎప్పుడో వచ్చింది. అది నా ప్రయత్నంవల్లగాక నా క్లయింటు ఒకాయనవల్ల వచ్చింది. ఆయన ప్రభుత్వ అనుబంధ సంస్థలోని ఉద్యోగి. ఆయన పనిమీద నన్ను విదేశాలకు పంపుదామని అనుకుంటున్నారు. నా పాస్‌పోర్టు సంఖ్యాబలం ఎనిమిది. నాకంతా స్పష్టంగా ఉంది. నేను వీసాకు ప్రయత్నిస్తాను. ఈ సంగతిని నాకు నేనుగా ఎవరికీ తెలియనీయను. కానీ నా భార్యతో చెప్పటం మంచిదేమో!" మాస్టరుగారు నవ్వుతూ "ఆవిడకు నన్ను చెప్పనీ. మరోవారంలో నేను విశాఖపట్టణం చేరుకుంటాను" అన్నారు.

అన్నట్టుగానే వారానికల్లా మాస్టరుగారు విశాఖపట్టణం చేరుకున్నారు. రాధామాధవంలో తన గదిలోకి కుమార్‌గారిని, ఆయన భార్య శ్రీమతి కుమారిగారిని పిలిపించారు. మాస్టరుగారు

శ్రీమతి కుమారిగారితో ఇక్కడ పనితోపాటు పాశ్చాత్యదేశాల్లోని పనికూడా నిర్వహించటానికి కుమార్‌గారు ఎన్నుకోబడ్డారని, కావాలనుకుంటే ఆమెకూడ పిల్లలతోపాటు రావచ్చునని చెప్పారు. ఇప్పుడేకాదు, ఇకముందు ఎప్పుడైనాసరే నీవు కుమార్‌తో విదేశాలకు రావచ్చు అనికూడా ఆయన చెప్పారు. ఆమె సంతోషించి తన అంగీకారాన్ని తెలిపారు. ఆమె మాస్టరుగారి కార్యనిర్వహణ విషయంలో ఎప్పుడూ సహకరిస్తూనే వచ్చారు. ఇప్పుడు కూడా ఆమె యథావిధిగా సహకరిస్తున్నారు. శ్రీమతి కుమారిగారు సింహరాశికి చెంది, సింహంలో రవి ఉన్న కారణంగా మాస్టరుగారితో చక్కని మానసికమైన అనుబంధాన్ని కలిగి ఉండేవారు. నిజం చెప్పాలంటే మాస్టరుగారు కుమార్ గారితో కంటె ఆమెతోనే ఎక్కువ చనువుగా ఉండేవారు. కుమార్‌గారు ఎప్పుడూ ఏదో ఒక పనిలో తలమునకలై ఉండే వారు. మాస్టరుగారు ఆమెపట్ల తండ్రిలా ఉండేవారు. ఎన్నోసార్లు అపాయకరమైన స్థితి వచ్చినప్పుడు పిల్లల గురించి మాస్టరుగారే ఎంతో శ్రద్ధ చూపేవారు. కొన్ని సందర్భాల్లో చాలామంది బంధువులు వచ్చినప్పుడు మాస్టరుగారు ఆమెకు వంటలో సహాయం కూడా చేసేవారు. వారిద్దరిదీ చక్కని తండ్రీకూతుళ్ళ అనుబంధం. ఇప్పటికి కూడా ఏదైనా సమస్యవస్తే శ్రీమతి కుమారిగారు మాస్టరుగారిని గట్టిగా తలుచుకుంటారు. మాస్టరు

గారు ఆమెకు ఆజ్ఞాకేంద్రంలో ప్రశాంతపరిచే నీలవర్ణంతో దర్శనమిచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారు. భారతీయస్త్రీకి వచ్చే సమస్యలు ఎక్కువగా భర్తకు, పిల్లలకు సంబంధించినవే అయివుంటాయి. కుటుంబానికి ఆమె ఒక కోటలాంటిది. నిరంతరం అప్రమత్తంగా ఉండి వారిని కనిపెడుతుంటుంది. వీరి ఆరోగ్య విషయంలోనో, వారికి ఏదైనా తేడాచేస్తేనో ఆమె ఎంతగానో కలవరపడుతుంది.

1981 నుండి మాస్టరుగారు మూడు పర్యాయాలు యూరప్ వెళ్ళారు. ఒక్కోసారి ఏడేసి దినములున్నారు. ఈ పర్యటనల్లో మాస్టర్ జ్వాల్‌కూల్‌గారి గ్రంథాలను అధ్యయనం చేసిన ఎన్నో బృందాలవారు మాస్టరుగారికి పరిచయమయ్యారు. అంతకుముందు పరిచయమైనవారి సంగతి సరేసరి. అంతరంగ సాధక బృందాలవారు స్పందించే తీరు ఎంతో భిన్నంగా ఉంటుంది. మాస్టరుగారు వారికి బృందజీవన విధానాన్ని తెలియ జేసి, ఉదయం, సాయంత్రం జరిగే ప్రేయర్సు ద్వారా మాస్టర్ సి.వి.వి.గారి శక్తి తరంగాలను సమర్థవంతంగా వారిలో ప్రవేశింప జేసేవారు. మాస్టరుగారు పశ్చిమదేశాల్లో ఆయన సాగిస్తున్న కార్యక్రమాల్లో ఆనందదాయకమైన లయను గమనించారు. అక్కడ ఆయన రెండుపూటలా ధ్యానము, ప్రవచ నములను ఇచ్చేవారు. తక్కిన దినమంతా వ్యక్తిగత సంప్రదింపులు

సాగేవి. ఆయన కార్యశీలత చక్కని వికాసమును చెందినట్లుగా ఆయన భావించే వారు. దినమంతా తీరికలేని కార్యక్రమాలతో సాగటమే అందుకు కారణం. అక్కడివారు సద్యఃస్ఫూర్తితో స్పందించేవారు. ఆయన మాటను చక్కగా గ్రహించేవారు. ఆ విధంగా మాస్టరుగారు బెల్జియం, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఇటలీ, జర్మనీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటన సాగించారు.

1984వ సంవత్సరానికి ఆయన పర్యటనల ఆవశ్యకత మరింతగా పెరిగింది. ఆరునెలలు ఇండియాలోను, ఆరునెలలు యూరప్‌లోను గడపటానికి ప్రణాళిక సిద్ధమైంది. కానీ కాల పురుషుని ప్రణాళిక మరోవిధంగా ఉండటంవల్ల అది కార్య రూపం ధరించలేదు. జెనీవాలో యూరప్‌లోని అనేక దేశాల ప్రతినిధులతో ఒక కార్యనిర్వాహకవర్గం ఏర్పడి, జగద్గురుపీఠం ఐరోపా విభాగం స్థాపించబడింది. మాస్టరుగారు శ్రీ కుమార్ గారిని 'ఈ కమిటీలో నీపేరెక్కడా కనపడదు. ఎందుకని?' అని అడిగారు. అందుకు కుమార్‌గారు 'ఎందుకంటే– వారు నన్ను చూడరు గనుక' అన్నారు. అప్పుడు మాస్టరుగారు ఇలా చెప్పారు. "ఇండియాలో ఇన్ని సంవత్సరాలుగా జగద్గురుపీఠం నీ నిర్దేశకత్వంలో నా సమక్షాన ఒక్కొక్కమెట్టూ పెరుగుతూ వచ్చింది. ఈ యూరప్ ట్రస్టు ఏమవుతుందోనని నాకు ఆశ్చర్యంగా ఉంది." ఏమయితేనేం జగద్గురుపీఠం యూరప్‌శాఖ

ఏర్పడింది. దాని ప్రారంభోపన్యాసంలో మాస్టరుగారు చెప్పిన మాటల్లో ఆయన నిష్క్రమణానికి చెందిన ప్రథమసూచన ధ్వనించింది. కుమార్‌గారికి ఆ మాటలు విన్నప్పుడు అలాగే అనిపించింది. జెనీవాలో జగద్గురుపీఠ సభ్యుల నుద్దేశించి మాస్టరుగారిలా చెప్పారు. **"ముప్పది ఏళ్ళ కృషి ఒక కొలిక్కి వచ్చింది. నేను నా కాలాన్ని, ధనాన్ని, శక్తిని నా కివ్వబడిన ప్రణాళికకు చెందిన పనికోసం వినియోగించాను. నన్ను నేను నా కివ్వబడిన ప్రణాళికకు, దానికనుగుణంగా నన్ను నడిపేవారికి అంకితమైపోయాను. అయినప్పటికీ పనిలో నిర్దుష్టతను, లోతైన అర్థంలో నిశ్శబ్దాన్ని నేర్చుకోవటంలో విద్యార్థిగానే కొనసాగు తున్నాను."** ఆమాటల వెనుక ఉండే ధ్వనిని ఆ సందడిలో ఎవరూ గమనించ లేకపోయారు. అవి అలాగే గాలిలో కలిసి పోయాయి. అయినప్పటికీ ప్రాక్పశ్చిమ సమన్వయ కార్యక్రమం యూరప్‌లోని బృందాల హృదయాలలో బలంగా స్థాపించ బడింది. నేటికికూడా వందలాది మంది సభ్యులు తమ హృదయాల్లో మాస్టర్ ఇ.కె.గారి ప్రేమ పూర్వక స్పర్శను స్మరించుకుంటూనే ఉంటారు.

# 21

## మహాప్రస్థానం

**మా**స్టరుగారు, కుమార్‌గారు 1983 నవంబరులో ఇండియాకు తిరిగివచ్చారు. మాస్టరుగారు ప్రశాంతంగా ధ్యానం చేసుకోవాలని అనుకునేవారు. భవిష్యత్తులో జరగవలసిన పనులను నిర్ణయించేందుకు ఒక ఏకాంతమైన ప్రదేశం ఎక్కడ దొరుకుతుందా అని అన్వేషించటం మొదలుపెట్టారు. ఒకనాడు ఆయన కుమార్‌గారి దగ్గరకు వచ్చారు. ఎన్నడూ లేనిది ఆయన సరాసరి కుమార్‌గారు పడుకుని ఉన్న గదిలోకి వచ్చారు. ఆ సమయంలో కుమార్‌గారు ఏదో పుస్తకం చదువుతున్నారు. మాస్టరుగారు లోపలకు వెళ్ళి మంచంమీద ఆయన ప్రక్కన కూర్చుంటూ ఇలా అన్నారు. **"మనం యూరప్ నుంచి వచ్చి అప్పుడే నెల అయిపోయింది. ఇదివరకటిలా పనేమీ జరగటం లేదు. ఏకాంతం కావాలి అనిపిస్తోంది. ఇంక ఇక్కడకూడా అక్కడికీ ఇక్కడికీ తిరగటం కుదరదేమో! 1984లో చేయాల్సిన విదేశీ పర్యటన కూడా విరమించుకోవాలని ఉంది. దానిగురించి మళ్ళీ తరువాత ఆలోచిద్దాం. వాళ్ళకి నేను రావటంలేదని చెప్పేస్తావా?"** కుమార్ గారు అలాగేనని తలూపారు. పాశ్చాత్య సోదరులకు మాస్టరుగారికి ఇతర కార్యక్రమాలు ఉండటంవల్ల

ఆరునెలల పర్యటన ఉండదని తెలియజేశారు. అక్కడి బృందాల వారు చాలా నిరుత్సాహపడ్డారు. అప్పటికి మాస్టరుగారి ప్రబోధా లకు వారు అలవాటు పడిపోయారు. ఒకసారి అలవాటుపడితే మళ్ళీమళ్ళీ వినాలనిపించటం ఆయన ప్రవచనాల ప్రత్యేకత.

మాస్టరుగారు ఎంతగా ఏకాంతవాసాన్ని కోరుకుంటు న్నారో అంతగానూ ఇక్కడి బృందాలవారు ఆయనను చూడాలని, తమతమ ప్రాంతాల్లో ఆయనకు సన్మానం చేయాలని గట్టిగా పట్టుబడుతూ ఉండేవారు. మాస్టరుగారు కుమార్‌గారితో ఇలా చెప్పారు. **"కొత్త కార్యక్రమానికి గురుపూజల తరువాత రూప కల్పన చేద్దాం. ముందుగా ఇక్కడివాళ్ళని సంతృప్తి పరచవలసి ఉంది. ఎక్కడ నాకు సన్మానం చేస్తామన్నా నాతోపాటుగా నీవూ ఉండాలి. కుమారినీ, పిల్లలను కూడా తీసుకువస్తూ ఉండు."** కుమార్‌గారు ఆ ప్రకారంగానే కుటుంబంతోసహా మాస్టరుగారిని అనుసరించారు. మాస్టరుగారికి, కుమార్‌గారికీ కలిపే సన్మానాలు జరిగాయి. సంవత్సరాంతంలో గురుపూజలకు ఏర్పాట్లు మొద లయ్యాయి. యథాప్రకారంగా మాస్టరుగారు ఆ ఏర్పాట్లలో ఎంతో చురుకుగా పాల్గొన్నారు. ఏర్పాట్లు చేయడంలో సిద్ధహస్తులైన సహచరులు, అనుచరులు ఎందరో ఉన్నా గురుపూజలకు సంబంధించి ప్రతి చిన్నవిషయాన్నీ స్వయంగా చూసుకోవటం మాస్టరుగారికి ఆనందదాయకంగా ఉండేది. మొదటినుంచీ ఆయనతీరు అలాగే ఉండేది.

ఆ గురుపూజల్లో (1984) మాస్టరుగారు మృత్యువును

గురించి మాట్లాడారు. ఉదయం, సాయంత్రం జరిగే ప్రవచనాల్లో ఆయన కఠోపనిషత్తు పై ప్రసంగించారు. అది మాస్టరుగారి నిష్క్రమణాన్ని సూచించే రెండవ సూచికలా అనిపించింది. సమయం చాలకపోవటంవల్ల ఆ వివరణ అసమగ్రంగా నిలిచి పోయింది. కఠోపనిషత్తులో కీలకాంశమైన మృత్యుపరిణామ రహస్యాన్ని చెప్పవలసి ఉంది. కాలము అనుమతించలేదు. గురుపూజలు అయిపోయాక రాధామాధవంలో తన గదికి మాస్టరుగారు కుమార్‌గారిని పిలిపించారు. ఆయనతో ఇలా చెప్పారు. **"నేను ఏకాంతంగా ఉండాలనుకుంటున్నాను. ఒక దగ్గర స్థిరంగా ఉండి నా సలహాలకోసం వచ్చేవారికి అందు బాటులో ఉండాలి. కొంతకాలంపాటు అక్కడికీ ఇక్కడికీ తిరగాలనిపించటం లేదు. జరగవలసినంతగా పని జరగటం లేదు. మనవాళ్ళు కొంతమంది దగ్గరలో ఉండే అటవీప్రాంతంలో సహజీవన యోగశిక్షణా తరగతులు నిర్వహించమంటున్నారు. క్రొత్త కార్యక్రమాన్ని అదయ్యాక ఆలోచిద్దాం. మూడునెలలు అయిందిగాని చెప్పుకోదగిన పని ఏమీ జరుగలేదు. ఈ అటవీ ప్రాంతానికి నువ్వు రానవసరం లేదులే. నువ్వు ఇక్కడే ఉండి పనులు చూసుకుంటూ ఉండు."**

మాస్టరుగారు ఒక బృందంతో కలిసి విశాఖపట్టణానికి దగ్గరలోగల అటవీప్రాంతంలో ఉన్న మోతుగూడెం అనే గ్రామానికి తరలివెళ్ళారు. వారందరికీ చక్కని శిక్షణ ఇచ్చారు. ధ్యానము, క్రతువులు, ప్రవచనాలతోపాటు నిత్యానుష్ఠానం కోసం

ఆయుర్వేద సూత్రాలను కూడా ఆయన వారికి పరిచయం చేశారు. అది ఎంతో ప్రగాఢమైన ప్రబోధాత్మకమైన కృషి. ఆ బృందజీవనం చివరివారంలో సభ్యులు ఒక్కొరొక్కరుగా మలేరియా దోమల బారినపడ్డారు. ఆ విషయం మాస్టరుగారికి ఎంతో ఆందోళన కలిగించింది. ఆ దోమలు మాస్టరుగారిని కూడా వదిలిపెట్టలేదు. తరగతులు ముగియగానే బృందం వారందరూ శీఘ్రంగా ఇళ్ళకు తిరిగివచ్చారు. వారిలో బాగా జబ్బుపడిన ఒక సభ్యుడు ఎంతగా శ్రద్ధతో వైద్యం జరిగినా మృత్యువాతపడ్డాడు.

మాస్టరుగారు కూడా మలేయాబారినపడి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అంతకుమించి ఆ తరగతులవల్ల చాలామంది జబ్బుపడటం, ఒక సభ్యుడు మరణించటం ఆయనను ఎంతగానో క్రుంగదీసింది. ఒక వారంపాటు ఆయన ఇంటివద్దే ఉండి ఎంతో బాధపడ్డారు. ఆయన మెదడుకు కూడా మలేరియా వ్యాపించడంతో తరచుగా స్పృహ కోల్పోయేవారు. సోదర బృందానికి మిత్రులైన మంచి వైద్యులొకాయన మాస్టరుగారిని హాస్పటల్‌లో చేర్పించటం అవసరమని, అక్కడయితే వైద్య సదుపాయాలన్నీ ఉంటాయనీ సూచించారు. మాస్టరుగారు మాత్రం కుమార్‌గారి నివాసమైన రాధామాధవంలోనే ఉంటాననీ, అక్కడి నుంచే కావలసిన అన్ని వైద్యాలూ జరిపించాలనీ పట్టు బట్టారు. ఎవరూ ఆయనను కాదనలేకపోయారు. మార్చి 10వ తేదీ 1984న మాస్టరుగారిని రాధామాధవం తీసుకువచ్చారు.

ఊళ్ళోఉండే ఘనవైద్యులందరినీ సంప్రదించటం జరిగింది. ఉత్తమమైన వైద్యపరికరాలన్నీ వినియోగించబడ్డాయి. కానీ అప్పటికే ఆయన శరీరంలో ఒక్కొక్క భాగమూ మలేరియా ప్రభావానికి లోనుకాసాగింది. ఒక వారంరోజులపాటు మాస్టరు గారు, ఆయన సహచరులు కూడా ఎంతో బాధపడ్డారు. చెదురు మదురుగా తెలివి వస్తూపోతూ ఉండేది. పౌర్ణమికి రెండు రోజుల ముందు ఆయన పరిస్థితి కొంత మెరుగైనట్లనిపించింది. బాగా తెలివివచ్చింది. గదిలో ఉన్నవారందరినీ తనను ఒంటరిగా ఉండనివ్వమని అడిగారు. కుమార్‌గారు ఒక్కరే లోపలికి రావాలని కోరారు. కుమార్‌గారు లోపలికి వెళ్ళగానే మాస్టరు గారు కుమార్‌గారి చేతులు పట్టుకుని తనప్రక్కన కూర్చోమన్నారు. (వారంక్రితం మాస్టరుగారు వారిఇంటివద్ద ఉన్నప్పుడు కూడా ఇంచుమించుగా అపస్మారక స్థితిలోనే ఉండి కుమార్‌గారు ఉన్నప్పుడు మాత్రం స్పృహలోకి వచ్చేవారన్న సంగతి చాలా మందికి అద్భుతంగా తోచింది. మాస్టరుగారి రెండవ కుమారుడు ఈ విషయాన్ని ప్రత్యేకించి గమనించాడు.) నాలుగు నిముషాల పాటు ఏమీ మాట్లాడకుండా మాస్టరుగారు కుమార్‌గారి కళ్ళలోకి చూస్తూ ఉండిపోయారు. మళ్ళీ అంతలోనే ఆయనను అచేతన స్థితి ఆవరించింది. కుమార్‌గారు వైద్యుని పిలవాల్సి వచ్చింది. రాధామాధవంలో సోదరబృందం వారందరూ మాస్టరుగారి ఆరోగ్యం కోసం తీవ్రంగా ప్రార్థన చేస్తూనే ఉన్నారు. ప్రార్థనలు, అభిషేకాలు రాత్రింబవళ్ళు సాగుతూనే ఉన్నాయి. ఎలాగైనాసరే మాస్టరుగారు ఆ అనారోగ్య స్థితినుండి కోలుకోవాలని అందరూ

తపించిపోయారు. మీనపూర్ణిమా సమయం ఆసన్నమైంది. అర్థరాత్రి పున్నమిచంద్రుని ప్రభావం సర్వత్రా వ్యాపించి ఉండగా మాస్టరుగారు దేహత్యాగం చేశారు (మార్చి 17, 1984). దేశ విదేశాల్లోని సోదరబృందాల వారందరూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. సమాజంలోని వారందరూ దిగ్భ్రాంతు లయ్యారు.

## ముందుకు సాగుతున్న కార్యక్రమాలు :

సోదరబృందాలవారు ఆ బాధ నుండి కోలుకుని మాస్టరు గారి కార్యక్రమాలను తమకు తోచినవిధంగా కొనసాగిస్తున్నారు. మాస్టరుగారివల్ల ఎందరో ఉత్తేజితులయ్యారు. అలా ఉత్తేజితులైన వారిలో ప్రతిఒక్కరు తమదైన మార్గంలో పనిచేయటం మొదలు పెట్టారు. ఆ విధంగా మాస్టరుగారి వాగ్దానం కొనసాగుతోంది. అది భిన్నమార్గాల్లో మరింతగా వ్యాప్తమవుతోంది.

మాస్టరుగారి ఈ జీవిత కథనంలో మాస్టరుగారి సహచరులు అనే మాటే వాడబడింది తప్ప మాస్టరుగారి శిష్యులు అని ఎక్కడా వాడలేదు. ఇలా కావాలనే వ్రాయటం జరిగింది. ఇందుకు కారణం మాస్టరుగారు తరచుగా చెబుతుండేమాట– **"నా చుట్టూ నాకు శిష్యులన్న వాళ్ళెవరూ లేరు. నాకు నేనే ఒక శిష్యుడిని. నా చుట్టూ చాలామంది రోగార్తులు ఉన్నారు. అది వేరే సంగతి."** ఆ మాటల్లోని గాఢమైన భావానికి అను గుణంగా ఈ గ్రంథంలో శిష్యులు, భక్తులు వంటి మాటలను పరిహరించటం జరిగింది.

# 22

## మాస్టరుగారి ప్రబోధాలు

**మా**స్టరుగారి ఉపదేశాలు నిరాడంబరంగాను, సూటిగాను, జీవితానికి అన్వయింప దగినవిగాను ఉంటాయి. నిత్య జీవితానికి అన్వయింపదగిన విజ్ఞానమే సజీవ విజ్ఞానము. అత్యంత అమూర్త ఆదర్శకల్పనము చేయగలిగినా అటువంటి విజ్ఞానాన్ని మాత్రమే ఆయన తన జీవితంలో ఆచరించి చూపేవారు. ఆచరణాత్మకత అనేది ఆయన వ్యవహార విధానానికి మూలసూత్రం. కార్యాచరణ ద్వారా విజ్ఞానాన్ని ప్రదర్శించటమే ఆయన బలం. సర్వోత్తమసత్యాన్ని సంభాషణాత్మకమైన చిన్నచిన్న వాక్యాల్లో అందజేయటం ఆయన ప్రత్యేకత. గురువు అనే మాటను సార్థక్యం చేశారు. ఏకకాలంలో ఒక పసిబిడ్డకు, ఒక తత్త్వవేత్తకు కూడా బోధించగల సామర్థ్యం గలవారు. చదువురాని సామాన్య గృహిణి మొదలుకొని విద్యావంతులైన నాగరిక వ్యక్తుల వరకు అందరినీ ఉత్తేజపరచగలరు. సమదర్శనమే ఆయన జ్ఞానబలం. ఆయనకు సర్వాత్మనా, సర్వకాలములలోను, సర్వే సర్వత్రా, అన్నిరూపాల్లోను, అన్నిపేర్లతోను భగవంతుడు దర్శన మిచ్చేవాడు. ఆయనను గమనించటమే ఎంతో ఆనందప్రదంగా ఉండేది. ఎప్పుడోగాని ఆయన అంతర్ముఖత్వం నుండి బయటకు

వచ్చేవారు కాదు. అంతటి తాదాత్మ్యత ఉన్నప్పటికీ ఆయన హాస్యంగా కూడా ఉండేవారు. అలాగని ఆయన ఎప్పుడూ నవ్వుతూ పరిహాసా లాడుతూ ఉండేవారని కాదు. సందర్భాన్ని బట్టి ఆయన తీవ్రంగాను, కోపంగాను, సరదాగాను, ప్రశాంతం గాను, ఉల్లాసం గాను, మౌనంగాను కూడా ఉంటుండేవారు.

నా దృష్టిలో గురువు అనేవాడు తన బోధనలకు అతీతంగా ఉంటూ అవసరాన్ని బట్టి నాయకత్వం వహించటం, బాధ్యత పడటం చేయాలి. ఆయన సత్యస్వరూపులు కావాలి. ప్రబోధము అందులో ఒక భాగం మాత్రమే. ఒకసారి జగద్గురువు బోధనల గురించి చెప్పండి అని అడిగినప్పుడు ఆయనిలా అన్నారు. **"జగద్గురుని సాన్నిధ్యము అన్ని ప్రబోధాల సారాంశం. ఆయన ప్రబోధాలు అయన సాన్నిధ్యానికి సాటికావు. ఎప్పుడైనా మీరు ప్రవచన మిస్తున్నప్పుడు ఆ సాన్నిధ్యాన్ని అనుభవించటం నేర్చుకోండి. ప్రబోధానికి ఉన్ముఖమగుట అనేది సాధారణంగా మానసికం. ఆ విధమైన ఉన్ముఖత్వం సాన్నిధ్యానుభూతికి దారితీయాలి. సాన్నిధ్యమే సర్వప్రబోధముల పరమావధి."**

యోగము, సత్యము, వెలుగుల మార్గాన్ని అనుసరింప దలచుకున్న సాధకులకు అవసరమైన ప్రబోధా లన్నింటినీ మాస్టరుగారు వైవిధ్యభరితమైన రచనలు, ప్రవచనాల ద్వారా అందించారు. ఆయన ప్రబోధాల పరమార్థం అంతర్యామి సాధనయే. ఆయన ప్రధానంగా ప్రస్తావించే మహాగ్రంథాలు భగవద్గీత, పతంజలి యోగసూత్రాలు. ఆయన తరచుగా

పతంజలి శాస్త్రవేత్త అయితే, శ్రీకృష్ణుడు కళాకారుడు అంటుండే వారు. పతంజలిమహర్షి మానవశాస్త్రాన్ని, ఆత్మానుభూతికోసం వ్యక్తి పాటింపవలసిన క్రమశిక్షణను ఇచ్చారు. ఆయనిచ్చిన శిక్షణా సోపానాలన్నీ ఒకదగ్గర చేరిస్తే అదే శిష్యరికమవుతుంది. శ్రీకృష్ణుడు అవే సోపానాలను కళాత్మకంగా వివరించాడు. పతంజలి యొక్క యోగశాస్త్రం యోగాభ్యాసం కోసం. శ్రీకృష్ణుని భగవద్గీత మరో అడుగు ముందుకు వేసి ఆ అభ్యాసాన్ని నిత్య జీవిత అనుభూతిగా పరిణమింపజేస్తుంది.

ఈ రెండు గ్రంథాలనే కాక మాస్టరుగారు తరచుగా భాగవతాన్ని కూడా ప్రస్తావించేవారు. అందులో యోగజీవనంలో ఉన్నతస్థాయికి చేరుకున్న శిష్యుల గురించి చెప్పబడింది. శిష్యుడు అనే మాటకు మరో పేరే భాగవతుడు. తన ప్రజ్ఞను మూడు లోకములకు అతీతంగా నిలపగలిగినవాడు విశ్వసాధకుడు (World Disciple). అతడు ఒకవిధమైన పరమానంద స్థితిలో ఉంటూనే ఎంతో శ్రద్ధతో మూడు లోకాల్లోను తన కర్తవ్యాలను నిర్వహిస్తూ ఉంటాడు. విశ్వప్రజ్ఞతో ఆనందిస్తూనే మూడు లోకాల్లోను సమర్థవంతంగా పనిచేయగలిగిన ఉదాత్తస్థితి అది. మాస్టర్ ఇ.కె.గారు తమ రచనలలోను, ప్రవచనాల్లోను, ఉన్నత స్థాయి క్రతువులలోను ప్రస్తావించే మరో మహాగ్రంథం మహాభారతం. మహాభారతానికి ఎన్నో కీలకాంశాలను ఉపయోగించి, జ్ఞానమార్గాలను మాస్టరుగారు ఆవిష్కరించిన తీరు అద్భుతమైనది. అది ఆయన ప్రత్యేకత.

బైబిల్ పాతనిబంధనల విషయంలోను మాస్టరుగారికి ఇంతటి పరిజ్ఞానమూ ఉండేది. దానికి సంబంధించిన ఎన్నో కీలకాంశాలు (keys) ఆయనకు తెలుసు. దాని సాయంతో సృష్టికి సంబంధించిన ఎన్నోవిషయాలను ఆయన అలవోకగా వివరించేవారు. క్రొత్తనిబంధనలు ఎంత సాంకేతికమో పాత నిబంధనలూ అంతే సాంకేతికమని ఆయన ఉద్దేశం. కాకపోతే పాతనిబంధనల గ్రంథాన్ని విశ్వావిర్భావానికి సంబంధించిన సన్నివేశాల వరుస కథనంగా మాత్రం చూడరాదని ఆయన హెచ్చరించేవారు. అందులోని ఒక్కొక్క సన్నివేశం కాలానికి, మానవుడు అనుసరింపదగిన మార్గానికి సంబంధించిన ఒక్కొక్క కీలకం.

మాస్టరుగారి ప్రబోధాలనుండి మణిపూసల వంటివాటిని వేరుచేసి చూపటం సాధ్యం కానిపని. అంతకంటే పాఠకులే ఆయన గ్రంథాలను తీసుకుని ఆసక్తితో చదువుకోవటం మేలు. అయినప్పటికీ మాస్టరుగారు ఆయన మార్గాన్ని, అంటే సత్య పథాన్ని అనుసరింప దలుచుకున్న వారికోసం ఇచ్చిన కొన్ని ఆచరణాత్మక సూచనలు ఈ క్రింద ఇవ్వబడుతున్నాయి. మాస్టరు గారు ఇలా చెప్పేవారు. **"సత్యమార్గాన్ని అనుసరించటం నేర్చుకోండి. నిత్యమూ నేనలా నేర్చుకుంటాను. నన్ను అనుసరించటం ఆ మార్గాన్ని అనుసరించటం కంటే భిన్నంకాదు. అది అందరి మార్గము. మీమధ్య ఉండి దానిని ఎలా అనుసరించాలో నేను మీకు చూపుతున్నాను. నేను ప్రత్యేకించి ఏ మార్గాన్నీ ఇవ్వలేదు. సనాతనకాలం నుండీ వస్తున్నదారినే నేనూ అనుసరిస్తున్నాను.**

నాతోపాటు వచ్చే మీరు ఆ దారిలో ఉన్నట్టే. మిమ్మల్ని నడపటానికి గాని, మీకు చూపటానికిగాని నాకంటూ వేరే మార్గంలేదు. నేను సాగిపోతుంటాను. కావాలనుకుంటే నాతోపాటు మీరూ రావచ్చు. ఇంకా కావాలనుకుంటే నాకంటే ముందూ ఉండవచ్చు. నిదానంగా వెనకా ఉండవచ్చు. మీకిష్టమైతే విశ్రాంతి తీసుకో వచ్చు. ఇంకా కావాలనుకుంటే ప్రక్కదారీ పట్టవచ్చు. కానీ ఆ మార్గం మాత్రం అలాగే ఉంటుంది. దానిని జ్ఞానులైన మహర్షులు విశ్వకేంద్రం **(Cosmic Centre)** వరకు విస్తరింపజేసారు. ఆ దారిని అనుసరించటమో, ప్రక్కదారి పట్టటమో– అది నీకు సంబంధించినది. ఎవ్వరూ ఆ దారినే వెళ్ళమని నిర్బంధించరు. బలవంతంగా రుద్దటమనేది లేదు. ఒక ఆత్మగా నీకు నువ్వు నిర్ణయించుకుంటే ఇతరమార్గాల జోలికి పోకుండా ఆ మార్గాన నడిచిపో. నీకు స్థిరమార్గాలే బాగున్నా యనిపిస్తే నీదారి అలా వెదుతూ ఉంటుంది. ఎవరిని నడిపించ టానికి నాకు ప్రత్యేకమైన ఆకర్షణ ఏదీ లేదు. నేను ఆ మార్గాన్ని అనుసరిస్తూ ఉంటాను. ఎప్పటికప్పుడు నాకు కావలసిన నిర్దేశకత్వం ఆ నిర్దేశకులనుండి నాకు అందుతూ ఉంటుంది. మీరూ అలా చేయవచ్చు. ఈ ప్రపంచాన్ని మార్చివేసేటంతటి ఆకర్షణ కూడా నాకులేదు. ప్రపంచం దానిదారి అది చూసుకుంటుంది. కావలసిందల్లా నీ దారి నువ్వు చూసుకోవటమే. ఇలా అయితే బాగుంటుంది అనుకున్నంత మాత్రంచేత నీలో గాని, నీ చుట్టూ ఉన్న ప్రపంచంలోగాని ఏ మార్పూ రాదు. **Action is the key. Act, act and act. Three times I tell you to act. While**

**acting, learn how to act and how not to act, when to act and when not to act, where to act, and where not to act. Let action be the vehicle of your progress."**

**అహమస్మి, సోహమస్మి, బ్రహ్మోహమస్మి :**

జీవాత్మే పరమాత్మ అనే సిద్ధాంతం అతి ప్రాచీనమైన సత్యానికి చెందిన సూత్రం. మాస్టరుగారికి అత్యంతప్రియమైన అంశమది. దానినే సంస్కృతంలో ఇలా చెప్తారు.

**అహం అస్మి, సోహం అస్మి, బ్రహ్మ అహం అస్మి**

ప్రతి సాధకుడు ప్రథమంగా తెలుసుకోవలసింది తానొక ప్రజ్ఞారూపాన్ని అని. తక్కిన వ్యక్తిగతమైన గుర్తింపులన్నీ భ్రమ మాత్రమే. రెండవ సోపానం అతడు తన వ్యక్తిగత ప్రజ్ఞకు ప్రత్యేకమైన ఉనికి లేదని, అది విశ్వప్రజ్ఞకు చెందినదని తెలుసుకోవటం. మొదటి సోపానంలో అతడు 'నేను ఉన్నాను' అని గుర్తిస్తాడు. రెండవ సోపానంలో నేనుగా ఉన్నది 'అదే'– 'అది' అంటే అనిర్వచనీయమైన విశ్వశక్తి. ఈ రెండవ సోపానాన్ని "అహం సః" నేను అదిగా ఉన్నాను అంటారు. ఇంక మూడవ సోపానంగా వ్యక్తిగత చైతన్యము విశ్వచైతన్యంలో లీనమై 'అది' మాత్రమే ఉండి తాను లేని స్థితి వస్తుంది. అది అనే ఈ స్థితిని సంస్కృతంలో "బ్రహ్మ అహం అస్మి" అంటారు. ఇంక ఆపైన నాలుగవ సోపానంలో వ్యక్తిప్రజ్ఞ 'అది' నుండి వెనక్కి వస్తుంది.

ఇంక అప్పుడు అతడు దానిలో లీనమైనవాడు ఎంతమాత్రమూ కాడు. 'అదే' అతడుగా వచ్చినట్లు. ఈ నాలుగవ సోపానాన్ని 'అదే నేను అయి ఉన్నాను' అంటారు. ఈ విధాన మంతటిని మంత్రంగా ఇచ్చారు. ఆ మంత్రమే

**"హంస శ్శివ సోऽహమ్"**

(దీనికి సంబంధించిన వివరాలకోసం ఈ రచయిత యొక్క *'మంత్రములు - వాని ప్రాముఖ్యత, సాధనా విధానము'* అనే గ్రంథాన్ని చూడండి.)

ఈ నాలుగు సోపానాలు సత్యపథంలో ప్రయాణించి సత్యంగా తిరిగి రాదలచిన ప్రతి సత్యాన్వేషికి సాధారణమైన విషయాలే. పరమగురు పరంపర సోదర మానవులను సేవించుటకు, వారికి దారి చూపుటకు ఈ నాలుగవ సోపానమైన తిరిగిరావటాన్ని గురించి బలంగా నొక్కి చెబుతుంది. ప్రాచీనమైన వివిధ మత సంప్రదాయాలు మూడవ సోపానమైన 'దాని'లో లీనమవటం వరకు మాత్రమే చెబుతున్నాయి. పరమగురువులు సాధకుడు తిరిగివచ్చి జాతికి సేవ చెయ్యటాన్ని గురించి చెబుతున్నారు. మాస్టర్ ఇ.కె.గారు ప్రతి శిక్షణా తరగతిలోను ఆయనకు ప్రత్యేకాంశమైన ఈ విషయాన్ని తప్పక చెప్పేవారు.

**సాధకులకు ఆచరణాత్మకమైన సూచనలు :**

మాస్టరుగారు యోగమార్గాన్ని అనుసరించే వారికోసం ఈ క్రింది సూచనలు చేశారు.

1. సాధనక్రమాన్ని వ్రాసుకునేందుకు ఒక ప్రత్యేకమైన నోట్‌బుక్‌ను స్పిరిచ్యువల్ డైరీగా దగ్గరుంచుకోవాలి. అది రూళ్ళ కాగితాలతో కాషాయరంగు అట్టతో బైండు చేయబడినదై ఉండాలి. ఈ రంగు పరమగురువులకు, వారి శిష్యులకు నీవు నీ నిత్యజీవితానికి సంబంధించిన సూచనలను గ్రహించి ఆచరించటానికి సిద్ధంగా ఉన్నావని తెలియజేయటానికి సంకేతంగా ఉపయోగపడుతుంది. ఆ పుస్తకం రోజంతా నీతోనే ఉండాలి. ఇతరులు తెరిచి చూడటానికి అవకాశం ఇవ్వకూడదు. దానిని ఇతరులకు చూపించి ప్రచారం చేసుకునే ప్రయత్నం ఎంత మాత్రం పనికిరాదు. దానిని రహస్యంగా ఉంచే ప్రయత్నం గమనింపబడకుండా చేయాలేగాని, అట్టహాసంగా కాదు.
2. ధ్యానాధ్యయనాలకు ఒక ప్రత్యేకమైన గది ఉండాలి. ఒకసారి నిర్దేశించుకున్నాక దానిని మార్చకూడదు. మార్చక తప్పనప్పుడు ఆ మార్పుకు మానసికంగా ముందురోజునే నీ అజ్ఞాత గురువునకు తెలియజేయాలి. ఆ గదిని ధ్యానానికి, చదువుకోవటానికే తప్ప మరేపనికీ వాడకూడదు.
3. ధ్యాన సమయానికి ఐదు నిముషాలు ముందే సిద్ధంగా ఉండాలి. ఎల్లప్పుడూ ఒకే సమయానికి ధ్యానం చేయాలి. ఆ సమయానికి ఐదు నిముషాలు ముందు ఉండటం అవసరం. గదిలో ఒక నిర్దిష్ట ప్రదేశంలో మాస్టరుగారిది

గాని, మరే దేవతామూర్తిది గాని పటం పెట్టుకోవాలి. ఉత్తరంగా గాని, తూర్పుగాగాని తిరిగి కూర్చోవాలి. ఒక అగరువత్తు వెలిగించి పెట్టుకోవాలి. అది మంచిగంధపుదైతే మంచిది.

4. శరీరంలో ఎక్కడా బిగింపు లేకుండా సుఖంగా కూర్చోవాలి. నీ శరీరానికి తగిన ఆసనంలో కూర్చోవచ్చు. నిర్దిష్ట సమయానికి నమస్కారముద్రలో చేతులు జోడించి మాస్టరు గారినిగాని, ఇష్టదైవాన్నిగాని ప్రార్థించాలి. నమస్కారముద్ర అంటే రెండు అరచేతులు జోడించి నమస్కరించటం. తనలోని ఉన్నత ప్రజ్ఞకో, గురువునకో, దైవానికో తనను తాను సమర్పించు కోవడాన్ని ఇది తెలియజేస్తుంది.

5. కళ్ళు మూసుకుని అరచేతుల్ని మోకాళ్ళపై ఉంచి లోలోపల గమనించుకుంటూ ఉండాలి. ఆలోచనలు వస్తుంటే వాటిని గమనించు. అలా గమనించటంవల్ల అవి అణిగి పోతాయి. అలా గమనించకపోతే అవి నిన్ను ప్రక్కదారి పట్టిస్తాయి. కాబట్టి మొదటిదశ ఆలోచనలను గమ నించటం. గమనిక పెరిగినకొద్దీ ఆలోచనలు ఉపశ మిస్తాయి. నెమ్మదిగా మనస్సు శూన్య మవుతుంది. అంటే ఆలోచనలు రావటంతగ్గి మనస్సు కుదుట పడుతుంది.

6. అలా కుదుటపడ్డ మనస్సుకు నెమ్మదిగా ఒక తెల్లని పద్మాన్ని

నీ భ్రూమధ్యంలోను, తలలోను భావించటం అభ్యాసం చేయాలి.

7. సూచనప్రాయమైన ఆలోచనలుగాని, జ్ఞానసంబంధమైన ఆలోచనలుగాని వస్తే వాటిని చిన్న మాటలలో డైరీలో రాసుకో. వాక్యాలు వినబడితే లేదా వ్రాయబడి కనబడితే ధ్యానం తరువాత వాటిని వ్రాసుకోవాలి. ఇది నిత్యమూ ఉదయంపూట జరుగవలసిన ధ్యానవిధి.

8. రోజంతా డైరీని నీతోనే ఉంచుకో. నీలోని ఊర్ధ్వ మనస్సు నుండి వ్రాసుకోదగిన ఆదేశాలేమైనా వస్తే అవి దాటి పోకుండా ఎప్పటికప్పుడు వ్రాసుకోవటానికి వీలవుతుంది.

9. ఈ క్రింది సలహాలను పాటిస్తూ నీ నిత్యకృత్యాల్లోకి నీవు వెళ్ళవచ్చు.

10. నీ కార్యక్రమాన్ని నువ్వు తప్పక పాటిస్తున్నప్పటికీ నీ మనస్సుకి ఏ కార్యక్రమమూ లేకుండా స్వేచ్ఛగా ఉంచుకో.

11. మానసికంగా నీ ఎదుట ఉన్నవాళ్ళ గురించి గాని, ఏదైనా సమస్య గురించి గాని పట్టించుకోకు.

12. ఎవరూ దగ్గర ఉండరాదని నిషేధించకు.

13. ఇతరులను సరదాగా కబుర్లు చెప్పుకునేటట్లుచేసి, వాటికి నువ్వు అంటుకోకుండా ప్రేక్షకునిగా ఉండు.

14. ఇతరులు ఎదుట ఉన్నప్పటికీ మానసికంగా ఏకాంతంగా ఉండు. అలాగని ఒంటరితనం పనికిరాదు.

15. అదేపనిగా చర్చించటం కూడదు. చర్చలు, వాదోప వాదాలు నీ చుట్టుప్రక్కల జరుగుతుంటే అవి పూర్తయ్యే వరకూ మానసికంగా దూరంగా ఉండు.

16. ఇతరుల అభిప్రాయాలను సానుభూతితో చూడటం నేర్చుకో. మరీ కచ్చితంగా ఖండించకు.

17. ఇతరులకు ఏమి కావాలో విను తప్ప, ఏం మాట్లాడు తున్నారో వినకు.

18. ముఖ్యమైన విషయాల్లో రాజీపడకు. ముఖ్యం కానివాటిల్లో ఉదారంగా ఉండు. సంకల్పాల్లో ఉదారంగా ఉండు.

19. గురువులను, వారు చేస్తున్న పనులను ఎప్పుడూ పోల్చటం గాని, తేడా చెప్పటంగాని చెయ్యకు. ఏ పరమగురువు పనినీ మదింపు చేయటంగాని, తప్పుపట్టటంగాని ఎన్నడూ చెయ్యకు.

20. నీలోని తప్పులు పట్టే స్వభావాన్ని అధిగమించటం నేర్చుకో.

21. అడగందే సలహాలివ్వకు. అడిగినప్పుడు తప్పించుకోకు. నీకు స్పష్టంగా తెలియని విషయాలను గురించి సలహా లివ్వకు.

22. శరీరానికి తగిన పోషణ ఇవ్వాలి. తీసుకునే ఆహారం ఎక్కువ గుణాత్మకంగాను, తక్కువ పరిమాణం కలదిగాను ఉండాలి. గాఢమైన వాసనలుగల ఆహారానికి దూరంగా ఉండాలి.

23. రోజులో ఒక్కసారైనా తలస్నానం చేయాలి.

24. ఎన్నిసార్లు వీలయితే అన్నిసార్లు ముఖము, చేతులు, కాళ్ళు కడుక్కోవాలి. తగినంత నీరు త్రాగాలి.

25. బరువైన విందులు, సామూహిక భోజనాలు తప్పించుకోవాలి. అలాగని మనుషులకు దూరంగానూ ఉండకూడదు.

26. అత్యంత అవసరమైతేనే గాని మందులు తీసుకోకూడదు. ఆహారంలోను, విశ్రాంతిలోను, నిద్రలోను తగిన మార్పులు చేసుకుంటూ ఆరోగ్య పరిస్థితిని చక్కబరచుకోవటానికి ప్రయత్నించు.

27. గమనికతో ఆవేశాలను అదుపు చేసుకోవటం అభ్యసించాలి.

28. సమయాన్ని, ధనాన్ని, శక్తిని అర్థవంతంగా వినియోగించ టానికి నీకు నువ్వు శిక్షణ ఇచ్చుకో.

29. ఎన్ని గంటలు ప్రయోజనకరంగా జీవించావు అనేది పరిగణనలోకి తీసుకోబడుతుందని తెలుసుకో.

30. నీ ఖర్చులకు పద్దు రాసుకో. ఖర్చులకు సంబంధించి లెక్క రాయటం అనేది వ్యక్తిగత క్రమశిక్షణకు సంబంధించిన విషయం.

31. విలాసాలకోసం, వినోదాలకోసం చేసే వ్యర్థమైన ఖర్చును మానుకో. ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకోకపోతే ఆర్థికమైన ఇబ్బందులు తప్పవు.

32. మాటలలో పొదుపును పాటించటం అవసరం. మాట్లాడేటప్పుడు మంచి హాస్యాన్ని, సరదా సంభాషణను చేయాలి. అనవసరంగా నోరుపారేసుకోకూడదు.

33. చిరునవ్వు నేర్చుకో. ఇది నీ ఆత్మను, ఇతరుల ఆత్మను వికసింపజేస్తుంది. బాధ్యత లేనివారి ఎదుట నవ్వకు. అలా నవ్వితే వారు మరింత బాధ్యతారహితు లవుతారు.

34. చిరునవ్వుతో మనుషులను ఆకట్టుకోవడమనేది పవిత్రమైన ఒక కళ. దానిని ఉపయోగించుకో. దుర్వినియోగ పరచకు.

35. అసత్య వాగ్దానాలు చెయ్యకు.

క్రమశిక్షణాయుతమైన జీవితాన్ని నడపదలచినవారికి మాస్టరుగారిచ్చిన ఆచరణాత్మక సూచనలివి.

ఆయన నిర్వహించిన బోధన, స్వస్థతలు ఎక్కువభాగం వెలుగుకు, శబ్దానికి సంబంధించినవి. మాస్టరుగారికి యాభైయ్యేళ్ళు నిండినప్పుడు ఆయన అనుయాయులు

స్వర్ణోత్సవం జరిపిం చారు. ఆ సందర్భంగా ఒక విశేషసంచిక ప్రచురింపబడింది. అందులో మాస్టరుగారి జీవితమూ, కార్య క్రమాలు వివరించబడ్డాయి. ఆ సందర్భంలో ఆయన అనుయా యులు తమకోసం ఒక ఆశంసనాన్ని ఇవ్వవలసిందిగా మాస్టరు గారిని వినయంతో అడిగారు. మాస్టరుగారు రాధామాధవంలో తన గదిలోకి వెళ్ళి పదినిముషాలు ఉండి ఆయన చేతులతో స్వయంగా సాధకుల ప్రయోజనం కోసం ఒక ఆశంసనాన్ని తీసుకువచ్చారు. అది ఈ విధంగా ఉంటుంది.

## INVOCATION

*May the Light in me, be the light before me.*
*May I learn to see it in all.*
*May the sound I utter, reveal the light in me.*
*May I listen to it while others speak.*

*May the silence in and around me present itself.*
*The silence which we break every moment.*
*May it fill the darkness of noise we do*
*And convert it into the Light of our background.*

*Let virtue be the strength of my intelligence*
*Let realization be my attainment*
*Let my purpose shape into the purpose of our earth.*
*Let my plan be an epitome of the Divine plan.*

*May we speak the silence without breaking it*
*May we live in the awareness of the back ground.*
*May we transact light in terms of joy*
*May we be worthy, to find place in the*
*Eternal Kingdom OM.*

## ఆశంసనము

*నాలోనఁ గల వెల్గు నా పరిసరముల*
*వారి రూపమున గన్పట్టుగాక !*
*నా యుచ్చరించెడి నాద మా వెల్గుగా*
*వినిపించి, కనిపించి వెలయుగాక !*
*నాలోన, వెలుపల నేలు నిశ్శబ్దంబు*
*ప్రేమగా సాక్షాత్కరించుగాక !*
*మా కంఠ శబ్దాల చీకట్లు వెల్గుగా*
*కఱగించి యది మమ్ము కలుపుగాక !*

*తెలివికిని సద్గుణమ్ముల బలము గూర్చి*
*నా ప్రణాళిక విశ్వ ప్రణాళికగను*
*వ్యాప్తమై విశ్వమూర్తి రూపంబునందు*
*నిలుచు గావుత శాశ్వత నిలయమగుచు.*

ఈ సందర్భంగా ఒక ఆసక్తికరమైన విషయం– మాస్టర్ జ్వాల్‌కూల్‌గారి నుండి వచ్చిన 'ది గ్రేట్ ఇన్వొకేషన్' మానవాళి ఉద్ధరణకోసం సంకల్పము, వెలుగు, ప్రేమలను ఉద్దీపింపజేసే ప్రార్థన. మాస్టరుగారి 'ఆశంసనం' వ్యక్తిగత, బృంద జీవనాల ఉద్ధరణకు ఉద్దేశింపబడినది. అది వెలుగు, శబ్దము, మౌనము లకు సంబంధించినది. మొదటి ప్రార్థన స్థూలగతికి చెందినది కాగా, రెండవది సూక్ష్మగతికి సంబంధించినది.

స్వస్తి

# OTHER BOOKS THROUGH
# DR. SRI K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |

BOOKS :

| | | |
|---|---|---|
| 12. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 13. | THE AQUARIAN MASTER | E/G/S |
| 14. | SOUND –The Key & its Application | E/G/S |
| 15. | ASHRAM LEAVES | E/G/S |
| 16. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |

| | | |
|---|---|---|
| 17. | VENUS –The Path to Immortality | E/G/S |
| 18. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 19. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 20. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 21. | THE MASTERS OF WISDOM | S |
| 22. | MEDITATION & GAYATRI | S |
| 23. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 24. | ON HEALING | E/G/S |
| 25. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 26. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 27. | THE AQUARIAN CROSS | E/G/S |
| 28. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 29. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 30. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 31. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 32. | JUPITER –The Path of Expansion | E/S |
| 33. | MASTER E.K. –The New Age Teacher | E/G/S/ T |
| 34. | AMANASAKUDU | T/K |
| 35. | VRUTRASURA RAHASYAM | T |
| 36. | THE DOCTRINE OF ETHICS | E |
| 37. | DHANAKAMUNI KATHA | T |
| 38. | ANTARDARSANA DHYANAMULU | T |
| 39. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 40. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 41. | ASANGUDU | T |
| 42. | SARASWATHI - THE WORD | E |
| 43. | AGNI | E |
| 44. | ANTHARDARSANA DHYANAMULU | T |
| 45. | MARRIAGE - A SACRAMENT | E |
| 46. | MASTER C.V.V. YOGAMU KARMARAHITYAM | T |